THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_204304
UNIVERSAL
LIBRARY

OUP -23 - 1-1-69—5,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T82 B577Y Accession No. P. G. 13219

Author భాగ్న . యజ్ఞఫలము

Title వేంకటేశ్వరులు, ఖిలుసం ఆవ

This book should be returned on or before the date last marked below. 1952

మహాకవి

యజ్ఞఫలము

[నాటకము]

★

(సీతాకల్యాణపర్యంతము
రామగాథ)

★

అనువాదకులు :

విద్వాన్, శ్రీ బులుసు వేంకటేశ్వరులు, బి. ఏ.,

ఆంధ్రపండితులు. పి. ఆర్. కాలేజి. కాకినాడ.

తొలి ప్రచురణ
'భారతి' 1952 ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ సంచికలు
మలి ప్రచురణ
1952 జూలై.

ప్రతులకు:
బులుసు వేంకటేశ్వరులు, బి. ఏ.,
రామారావుపేట, కాకినాడ
అని వ్రాయునది.

సర్వస్వామ్య
సంకలితము.

శ్రీపతి ప్రెస్
కాకినాడ.

మూల్యము రెండు
రూపాయలు.

అంకితము

శ్రీరమ్యగురువరేణ్యప
దారాధనతత్పరత్వ మన్యమకరుణా
పారంగత తద్వ్యక్తా
శ్రీరమ్యత నాకు సకలసిద్ధులు నిడుతఁ!
గురువరా! త్వత్కృపామృతభరితమామ
కీన కావ్యసుమంబు లంకిత మొనర్తు
జన్మమృత్యుజరావ్యాఘ్రజంతువితతి
నాశనము చేసి యవ్యయానంద మంద.

నీపాదకమలసేవా
వ్యాపారమహాసుఖంబునందు మఱిఁగి వాం
ఛాపూర్ణసిద్ధి సంధెను
నాపుణ్యకృతిప్రసిద్ధనవకన్య లహా!
పరుసవేదిని సోఁకినవస్తువు లవి
ముఖుని మేషంబునఁ స్వర్ణమయము లగును
భవ్యభవదీయచరణసంస్పర్శ కలుగు
కృతిలలితాంగియె సౌభాగ్యవతి తలంప.

పలుపలుకు లేల? గురువర
లలితపదాంభోజయుగళి లగ్నం బయి మ
త్సులలితమానసబంభర
మలవోకగ బ్రహ్మపదము నందునుగాతఁ!

ఇందలి పాత్రలు

సూత్రధారుఁడు
సుమంత్రుఁడు
కాంచుకీయుఁడు
విదూషకుఁడు
చిత్రకేతుఁడు, చిత్రపదుఁడు — గంధర్వులు
రావణుఁడు
మాళవకుఁడు, భషకుఁడు, దంతిలుఁడు, గోపిలుఁడు — కింకరులు
దేవతలు
గంధర్వులు
రాక్షసులు

దశరథుఁడు (రాజు)
విశ్వామిత్రుఁడు
వసిష్ఠుఁడు
రాముఁడు, భరతుఁడు, లక్ష్మణుఁడు, శత్రుఘ్నుఁడు — కుమారులు
జనకుఁడు
పరశురాముఁడు

★

నటి
విజయ
చేటి
మంథర
కౌసల్య, కైకేయి, సుమిత్ర — రాణులు
మధురిక, చతురిక, పుష్పలతిక, చంద్రకళ — చెలికత్తెలు
సీత, మాండవి, ఊర్మిళ, శ్రుతకీర్తి — కోడళ్లు

★ ★

అవతారిక

భాసమహాకవి యిరువదిమూఁడునాటకములకుఁ దక్కువ కాకుండ వ్రాసియుండవలయు ననియు, 'కిరణావళి' 'ముకుటతాడితకము' 'ఉదాత్తరాఘవము' మున్నగునామములు గలభాస నాటకము లింకను మనకు లభింపవలసియున్న వనియు శ్రీ. ఆర్. వి కృష్ణమాచారిగారు తమ ప్రియదర్శికాభూమికలో వ్రాసియున్నారు.* ఇట్లు భాసుఁడు ముప్పదినాటకములవఱకు వ్రాసియుండవలయు నని మఱి యిద్దఱు విమర్శకులు పేర్కొని యుండిరి. ఏది యెట్లున్నను, అలంకార గ్రంథములలో నుదాహృతములైన శ్లోకములు కొన్ని ప్రస్తుతము మనము భాసనాటకములుగాఁ బరిగణించు పదుమూఁడు నాటకములలోను గానరాకపోవుటవలన భాసుఁ డింకను గొన్నినాటకములు వ్రాసియుండవలయు ననియుఁ గాలగర్భమున నవి లీనమై యుండు ననియు ననుకొనుటకు వీలుచిక్కుచున్నది. ఈ యవకాశమును బురస్కరించుకొని యిటీవల వెలువడిన "యజ్ఞఫల" మను సంస్కృతనాటకము భాసమహాకవి రచించి యుండిననాటకములలో నొకటి యని తెలియుచున్నది.

యజ్ఞఫలము : గ్రంథస్వరూపము

కథియవాడు రాష్ట్రమునకుఁ జెందిన గోండలు నగరము నుండి రాజవైద్య జీవరామ కాళిదాసశాస్త్రిగారు 'యజ్ఞఫల'

* ప్రియదర్శికా భూమిక. పుట. XXXIII. వి. వి. ప్రెస్సు. శ్రీరంగము. 1909 సంవత్సరమున ముద్రితమైన ప్రతి.

మను నాటకమునకు సుమారు మూఁడువందల సంవత్సరములకు వెనుకటివైన రెండు ప్రాచీనపు వ్రాతప్రతులను సంపాదించిరి. వాని ననుసరించి 'యజ్ఞఫలము' ను ప్రకటించి తమయుపోద్ఘాతములో "అతిప్రాచీనసంస్కృతభాష ననుసరించియు, వస్తుకల్పనమునఁగల శ్రేష్ఠతనుబట్టియు, రసభావాలంకార నాట్యాంగమనోహరిత్వమును బురస్కరించుకొనియు, భాసనాటక సామాన్యలక్షణము లని బార్నెట్టాదులు పేర్కొన్న యనేక విషయముల కీ నాటకము నిధానమగుటంబట్టియు నిది తప్పక భాసనాటకములలో నొకటి యని నా దృఢ విశ్వాసము" అని వారు వ్రాసి యున్నారు. ఆ పిమ్మట, వెనుకటి పదుమూఁడు నాటకములు భాసునివి 'కా' వని కొందఱు 'ఔ' నని కొందఱు వాదించుచు వచ్చుచున్నట్లే 'యజ్ఞఫలము' కూడ భాసునిదే యని కొందఱు కా దని కొందఱు పత్రికలలో తర్జనభర్జనలు కావించి యున్నారు. †

ఈ పరిస్థితిలో బొంబాయి భారతీయవిద్యాభవన స్తంభములలో నొకరనఁదగిన డాక్టరు ఏ. డి. పుసల్కరు ఎం. ఏ; పి హెచ్. డి; బెంగుళూరు సంస్కృత సారస్వతసమితికిఁ బ్రాణ మనఁదగిన శ్రీ ప్రొఫెసరు యస్. యన్. సింహా ఎం. ఏ, మున్నగువారు సునిశితవిమర్శన వెలువరించి యుక్తియుక్తముగా 'యజ్ఞఫలము' భాసకృతమే యనుటకు సంశయింపఁ బని లేదని

† శ్రీవేంకటేశ్వర ప్రాచ్యవిద్యాసంస్థ పత్రిక. సంపుటము 11 సంచిక 2. జూలై-డిసెంబరు 1941 పుట. 473. *Quarterly Journal of the Mythic Society*. సం. XXXII. సంచిక 4. పుట 441. *Hindu Literary Supplement* 15-2-1942.

తమ గ్రంథములలోఁ దెలిపియున్నారు. ‡ వారు చూపిన హేతువాదమును బరిశీలించుటకుఁ బూర్వము స్థాలీపులాకన్యాయమున యజ్ఞఫలనామౌచిత్యము, నాటకకథావిధానము తెలిసికొనుట యత్యావశ్యకము. దీనివలనఁనే కొంతకుఁ గొంతయైనను ఈ నాటకము భాసమహాకవి కృతమే యని తెలియకపోదు.

నామౌచిత్యము

ఈనాటకమున 'యజ్ఞఫల' మనుమాట ఐదారు పర్యాయములు వచ్చుటయే కాక దశరథునియజ్ఞఫలముగా శ్రీరామావతారము, విశ్వామిత్రుని యజ్ఞఫలముగా శ్రీరామాస్త్రప్రతిగ్రహణము, జనకుని యజ్ఞఫలముగా శ్రీ సీతారామకల్యాణము ఈ నాటకమున వస్తువులగుట ఈ నాటకమున కీ నామము చాల నుచితముగా నున్నది. సుగ్రీవ విభీషణ రామపట్టాభిషేకములు కథావస్తువులుగాఁ గల నాటకమునకు "అభిషేకనాటక" మని పేరిడిన భాసుఁడు 'యజ్ఞఫల' మను నామ మీ నాటకమున కిడియుండుట చాల సమంజస మని తోఁపకమానదు.

కథావస్తువు — ప్రథమాంకము

ఇందు దశరథుని యజ్ఞఫలముగా రాముఁడు లవతరించుటయు, వారిబాల్యము కడచుచుండుటయు, వారిజన్మదినోత్సవము దశరథమహారాజు జరపుచుండుటయు, దశరథుని హృదయ మెఱిఁగి సుమంత్రుఁడు రాజ్యమునఁ గల సర్వప్రజలను వాంఛితార్థములచే సంతోషపెట్టుటయు, అటుపిమ్మట కారాగృహ

‡ *1. Bhasa. by Dr. A. D. Pusalker* పుట *135-142*
2. Pancharatra. Edited and Published by S. N. Simha. M. A. Bangalore.

బద్ధుల నెల్లర విడిచిపుచ్చు మనియు సర్వజనులను సర్వదాన సత్కారములచే సంతోషపెట్టు మనియు రాజాజ్ఞ యగుట కంచుకి తెలుప సుమంత్రుడు డప్పటికే కప్పుడే యాపని యొనరించియుంటి నని తెలుపుట, రాజు తనపై బడ్డ గురుతర బాధ్యతలకు, పుత్త్రుల నెట్లు శస్త్రాస్త్ర సర్వవిద్యాపారంగతులఁ గావింపఁగలుగుదునో యనియు బెంగపెట్టుకొనుట, వసిష్ఠమహర్షికి విద్యార్థులనుగా వారి నొప్పగించుట, రాజు సుమంత్రునితోఁ దన గురుతర బాధ్యతలను గూర్చియు రామపట్టాభిషేక ప్రతిబంధక మగు కైక వరమును గూర్చియు ముచ్చటించుట, ఇంతలో రాణులు మువ్వురు నెవరికి వారే ముందు తమకు దర్శనమిప్పింపు మని రాజునకు విన్నపము లంపుకొనుట, రాజు మువ్వురను సమముగా గౌరవింతు నని ప్రతివచన మిచ్చి గ్రీష్మోద్యానమునకు రమ్మని వార్త లంపుట, ఇంతలో సూర్యాస్తమయమగుట, రాజు విదూషకునితో వెడలుటయు జరుగును. ఈ యంకము మొదటనే విదూషక కాంచుకీయ సంభాషణము భాసుని హాస్యరస చమత్కృతులకు నిదర్శనముగా వెలయుచున్నది.

ద్వితీయాంకము

ఇందు రాజు పరివారముతో గ్రీష్మోద్యానమునఁ బ్రవేశించుట, సుమంత్రుని బిలిచి రాముని యౌవరాజ్యాభిషేకమున కనుకూలముగా సర్వజనులను రామమానసులనుగను భరతుని రామభక్తునిగను జేయుచుండు మనుట, ఇంతలో రాణులు రాఁగా సుమంత్రుఁడు వెడలిపోవుట, రాజు రాణులతోడి సంభాషణమున అభిషేకప్రశంస తెచ్చుట, దాయభాగవిచారము, సుమిత్ర రామభక్తి, కైకేయి సౌశీల్యముతో రామునికే రాజ్యమీఁ దగు

ననుట, కౌసల్యా రామానురక్తి, సుమిత్రాకైకేయీసౌశీల్య ప్రదర్శనము, దశరథుఁ డమితానంద మందుట, రాణులనిష్క్రమణము, దశరథుఁడు సుమంత్రుని బిలిచి వసిష్ఠాదేశప్రకారము తనపుత్త్రులను రాజనీతిశాసనవిధాతలఁజేసి యనుగ్రహింపుఁడని విన్నపమంపుట, ఇంతలో రామకీర్తి విని రావణుఁ డయోధ్యానగరమున ననిష్టమాచరింపఁ దిరోహితుఁడై తిరుగుచుండె నన్న వార్త విని రాజు ప్రతీకారచర్యలఁ గైకొన నేఁగుట జరుగును.

తృ తీ యాం క ము

ఈ యంకమున విష్కంభములో నింద్రుఁ డిరువురుగంధర్వులను రావణునివలన రామున కేయపాయము కలుగకుండునట్లు చూచుటకుఁ బంపుట తెలియనగును. తరువాత రావణవిశ్వామిత్రులు మాయారూపులై తిరోహితులుగ వచ్చుట, వారొకరినొకరు కనుఁగొనఁగలిగియు నితరుల కగపడకుండుటయు రావణుఁడు రాము నెత్తుకొనిపోవుటకు, విశ్వామిత్రుఁ డాతనిని శిష్యునిగాఁ గైకొని దివ్యాస్త్రముల నుపదేశింపఁ గైకొనిపోవుటకు వచ్చినట్లు తెలియును. ఇంతలో రాజకుమారులతో వసిష్ఠుఁ డరుదెంచి నాఁ డనధ్యాయమగుట రాజకుమారులను వారివారి ధనుర్విద్యాకౌశలముఁ బరీక్షించుకొన ననుమతించి వెడలిపోవుట, కొంత దవ్వేఁగి రాజకుమారులలో భరత లక్ష్మణ శత్రుఘ్నులు తమతమ ధనుర్విద్యానిపుణతఁ జూపుట, వారు రామునివిద్యానిపుణతఁ జూప బలవంతపెట్టుట, రాముఁడు రెండుసారులు బాణములు విడుచుట, వానిని దారిలో మాయాశరీరులై యున్న రావణవిశ్వామిత్రులు త్రుంచివేయుట, రాముఁడు కోపించి యాగ్నేయాస్త్రము ననుసంధించుట, రావణుఁ డది చూచి

భీతుఁడై పాఱిపోవుట, ఆతఁడు చేయుకర్మమును జేయుచుండునట్లు చూచుటకు విశ్వామిత్రుఁ డాతని ననుసరించిపోవుట, ఇంతలో రాణుల చెలికత్తెలు దూరమునఁ గనఁబడ వారికిఁ దగులు నను భీతిచే రాముఁడు బాణము విడువకుండుట, రావణుని రథపు గుఱ్ఱలు కాంచి చెలికత్తెలు భీతావహులై పాఱిపోవుట, రాముఁడు బాణము విడువఁజూచుచుండ వసిష్ఠమహర్షి యేతెంచి వారికి రావణ విశ్వామిత్రుల యాగమన విశేషములం జెప్పి మఱు నాఁడు విశ్వామిత్రుఁ డటకు రానున్నాఁ డనియు వచ్చినపుడు నమస్కారపురస్సరముగా గౌరవింపుఁ డనియుఁ జెప్పి వెడలుట, రాజకుమారు లింటి కేఁగుట, మంథర దుర్మంత్రణము, సుమంత్రుఁడు వచ్చి రావణ విశ్వామిత్రాగమనవార్త విని కావలి వారలను హెచ్చరింప నేఁగుట జరుగును.

చతుర్థాంకము

ఈ యంకమునకుఁ దొలుత నలువురు కావలివారి హాస్య సంభాషణము, విదూషకుని రాకతో నది యధికమగుట, విశ్వామిత్రునిగుఱించి వారు వికటముగాఁ జెప్పుకొనుట జరుగును. పిదప విశ్వామిత్రుఁడు దశరథునికొలువుకూటమున కేతెంచి గౌరవింపఁబడి రాజకుమారులను వసిష్ఠు ననుమతిఁ బరీక్షించుట, పరీక్షాసమయమున రాజకుమారులకు జృంభకాస్త్రబ్రహ్మాస్త్రములు తెలియ వని తెలిసికొని రాక్షసవధనిమిత్తము రాముని దనతోఁ బంపుమని దశరథు నడుగుట, దశరథుని సంకోచము, వసిష్ఠు ననుమతిని దశరథుఁడు తన పుత్త్రులు త్వరలో దివ్యాస్త్రస్వాత్తులై తిరిగి తన కడకు వచ్చెద రని విశ్వామిత్రుఁడు మాట నొసఁగ నాతనితోఁ దన పుత్త్రులను బంప నిచ్చగించుట, విశ్వా

మిత్రుఁడు రామలక్ష్మణులను మఖునాఁడుదయము తనయాశ్రమమునకుఁ దీసికొనిపోయి స్వాగతించుకొని విశ్రమించుట జరుగును.

పంచమాంకము

ఇందలి విష్కంభమువలన రామలక్ష్మణ సాహాయ్యమున విశ్వామిత్రునియజ్ఞము పూర్తియగుట, మారీచసుబాహుల పతనమువలన నారణ్యజనులు సుఖించుటయుఁ దెలియును. అంత రామలక్ష్మణులతో విశ్వామిత్రుఁ డరుదెంచి రాముని గొనియాడుట, రామలక్ష్మణుల వినయప్రదర్శనము, రామరావణాభవిష్యద్యుద్ధమున రామవిజయము విశ్వామిత్రుఁడు సూచించుట, రామలక్ష్మణు లారణ్యప్రకృతిరామణీయకమునకు సమ్మోహితులగుట, విశ్వామిత్రుఁడు వారికి గ్రామజీవనసౌభాగ్యముఁ జూపుట, రామలక్ష్మణులు వృద్ధగోపాలస్త్రీతో సంభాషించి గ్రామజీవనాకృత్రిమత, గ్రామజనపవిత్రతలఁ దెలిసికొనుట, విశ్వామిత్రాదేశమున జనకుని యజ్ఞమునకు విశ్వామిత్రునితో రామలక్ష్మణులు పోవుట కంగీకరించుట యిందుఁ గలవు.

షష్ఠాంకము

విష్కంభమున విశ్వామిత్రపరిచర్యకు నియుక్తులైన ముగ్గురుభటులు తమ సంభాషణలో రామలక్ష్మణుల సౌందర్యవర్ణనము, రాము నుద్యానమున నొంటరిగాఁ జూచిన సీత యాతని ప్రేమించుటయు, రాముఁడు సీతపై మక్కువగొనుటయు మనకుఁ దెలుపుదురు. పిదప, ప్రేమావేశచిత్తుఁ డగు రాముఁడు ప్రవేశించి సీతాసక్తమనస్సును నిగ్రహించుకొన యత్నించుట, ఇంతలో సీత చెలికత్తెలతో మరలఁ గానవచ్చుట, సీత చెలికత్తెల

సంభాషణమున సీత రామపరవశయై యున్న దని రాముఁడు గ్రహించి సంతసించుట, సీత మూర్ఛనొందఁగా రాముఁడు సమీపించుట, చెలికత్తెలాసందించి సీతను దేర్చుట, సీతను బెండ్లాడఁగోరువాఁడు శివధనుర్భంగము గావింపవలె నన్న జనకుని శపథము విషయము, రాముఁ డందులకు సమర్థుఁడే యని చెలికత్తె లెఱుంగుట, ఇంతలో జనకమహారాజే తెంచుట యెఱిఁగి రాముఁడు నిష్క్రమించుట, నిర్లిప్తుఁ డగు జనకమహర్షి సీతతో మాటాడుట, ఆమెకు జరుగఁబోవు వివాహముసంగతి తెల్పి విశ్వామిత్రుని గౌరవింప నేఁగుట యిందుఁ గలవు.

సప్తమాంకము

నిర్వహణాంక మను పేరుగల యేడవ యంకమున జనకచక్రవర్తి స్వగతాంత మగుటయు, జనకుఁ డిదివఱకే దశరథాదుల భార్యాసహితుల రప్పించుట, కర్మధర్మములను గుఱించిన జనకుని మనోహరసంభాషణము, శివధనుర్భంగమును గావించిన రామునకే సీత నిచ్చితి ననియు దాని నేకగ్రీవముగా నందఱంగీకరించినది లేనిది తెల్పుఁ డనుటయు, సర్వప్రజలు నేకగ్రీవామోదమును దెలుపుటయు, వసిష్ఠ విశ్వామిత్ర శతానందమహర్షులు సీతారామకల్యాణమునకు దమయానందమును వెల్లడించుటయు, ఇంతలోఁ గ్రుద్ధుఁ డగుపరశురాముఁ డేతెంచుట, రామాదులు దశరథ జనకాదులు నాతనికి సమస్కరింప నాతఁడు శాంతించి శిష్టరక్షణార్థము దుష్టశిక్షణార్థము తనధనువు రామునకిచ్చి యాశీర్వదించి తాను దపోజీవనమున బ్రహ్మానందరూపుఁడగుట, దేవతలు పుష్పవృష్టితో వధూవరు లగు సీతారాములను, ఊర్మిళాలక్ష్మణులను, మాండవీభరతులను, శ్రుతకీర్తి

శత్రుఘ్నులను ఆశీర్వదించుట, రాజసింహుఁ డగు రాజు పాలింప వర్ణాశ్రమ ధర్మరక్షణము సర్వశుభములు కలుగుఁగాక యను భరతవాక్యము గలవు.

యజ్ఞఫలము భాసనాటకమే

ఈ నాటకము భాసునిదే యనుటకు శ్రీ పుసల్కరు మున్నగువారు తెలిపిన హేతువాదము పేర్కొందును. ఈ కథావస్తువు భాసుని యితరనాటకములతోడి సాజాత్యము నంది యున్నది. ఇందలి నాందీ శ్లోకము :

"శ్లో. రామః కృపాయా భరతో మనోజ్ఞః
పాయా త్సదాప శ్శుభలక్ష్మణశ్చ
శత్రుఘ్న వీరో మునియజ్ఞ రక్షీ
సదా రసోత్సాహవపుః ప్రసన్నః."*

ఇది యితర భాసనాటకములందలి నాందీ శ్లోకముల వలెనే ముద్రాలంకార సంయుతము. ఇందు ముఖ్యనాటక పాత్రములు చక్కఁగా సూచింపఁబడుటే కాక రామ భరత లక్ష్మణ శత్రుఘ్నులు ప్రసన్నులై మిమ్ము రక్షింతురుగాక యనియు, కృపా భరతుఁడు, శుభ లక్ష్మణుఁడు, శత్రుఘ్నవీరుఁడు నగు రాముఁడు మిమ్ము రక్షించుఁగాక యనియుఁ జక్కని శ్లేషార్థము లిందుఁ బొందుపఱుపఁబడినవి. ఇష్టే పాత్రల నన్నిటిని సూచించు పంచరాత్ర నాందితో నిది సాజాత్యము నందియున్నది.

"శ్లో. ద్రోణః పృథివ్యర్జున భీమదూతో
యః కర్ణధారః శకునీశ్వరస్య
దుర్యోధనో భీష్మ యుధిష్ఠిరస్స
పాయా ద్విరా డుత్తరగోభిమన్యుః."

యజ్ఞఫలమునందలిస్థాపన భాసునియితరనాటకములందలి

స్థాపనలవలెనే సంక్షేపముగా నున్నది. అంతేకాక భాసునికిఁ బ్రియతమ మగు ప్రయోగాతిశయపద్ధతియే యీ ప్రస్తావనమునఁ గాననగుచున్నది.

ఇంతేకాక, 'నిష్క్రమ్య ప్రవిశ్య' మున్నగు శీఘ్రనిష్క్రమణ శీఘ్రప్రవేశములను సూచించుపదములు భాసనాటకము లన్నిటఁ గలయట్లే యిందును గలవు. '(కర్ణే) ఏవమివ' మున్నగు మాటలు స్వప్నవాసవదత్తమునను యజ్ఞఫలమునను గలవు. ప్రతిజ్ఞాయౌగంధరాయణ చారుదత్తములలో ఈరీతిప్రయోగము లధికముగాఁ గలవు. 'ఏవ మవిజ్ఞాతాని దైవతాన్యభిభూయంతే' అని యజ్ఞఫలమునఁ గలదు. స్వప్నవాసవదత్తమునను నిట్లే కలదు. రాజ్యము భారవహ మని అవిమారకమునను రాజు 'సత్త్రతాభారవాహా' అని ప్రతిమానాటకమునను గలదు. ఈభావనే యజ్ఞఫలమునను గలదు. ఇవి కాక ద్వీపకేసరుల తోడి యుపమానములు, నైధికధర్మగౌరవము, వయశ్శౌర్యములకు సంబంధములేదన్న భావము, భాసుని యితరనాటకములలో నున్నట్లే యజ్ఞఫలమునను గలవు.

యజ్ఞఫలమునఁ జేర్పఁబడిన ఆశ్రమ వర్ణనము, సాయంకాల వర్ణనము, గ్రామజీవన వర్ణనము మున్నగున వెల్ల భాసుని స్వప్నవాసవదత్తమునను పంచరాత్రమునను అవిమారక బాలచరితములలోను ఆయాయా వర్ణనములతోడి మిక్కిలి సాదృశ్యమును గలిగి యున్నవి. యజ్ఞఫలమునఁ గల రాముని మదనావస్థ సరిగా నట్లే అవిమారకమున ద్వితీయాంకమునందుఁ గాననగుచున్నది.

మఱియు, భాసుఁడు తఱచు శ్లోకము రెండవపాదము

లొకరిచేతను మిగిలిన రెండుపాదము లింకొకరిచేతను జెప్పించును. ఈ విషయమునకు యజ్ఞఫలమునఁ బెక్కు లుదాహరణములు కలవు. (ii. 29; iii 21, 23, 24, iv. 29) ప్రతీహారి పేరు విజయ యనియే భాసనాటకములన్నిటఁ గలదు. ఇట్టే యజ్ఞఫలమునను గలదు. సాధారణముగా భాసుఁడు విష్కంభమును ఇరువురు, ముగ్వురు, నలువురు వ్యక్తులతో నడపును. ఇట్లే యజ్ఞఫలమున ఇరువురు గంధర్వులు, ముగ్వురు భటులు, నలువురు కావలివారు ఆయావిష్కంభములలోఁ బాల్గొందురు. బాణుఁడు భాసుని గుఱించి చెప్పిన :

"సూత్రధార కృతారంభైః, నాటకై ర్బహు భూమికైః
సపతాకైర్యశో లేభే, భాసో దేవకులైరివ."

అనుభావమునకుఁ దగినట్లు యజ్ఞఫలమున నెన్నియో నిదర్శనములు గలవు. యజ్ఞఫలము సూత్రధారకృతారంభము కలదే. ఇందు బహుపాత్రములే కలవు. ఆపాత్రములు వేఱు వేఱు జీవితదృక్పథములకే చెందినవి. ఇందు బహు పతాకాస్థానములు నున్నవి. దశరథ మహారాజు రాణులతో జరిపిన సమావేశము, రావణుఁడు రామాస్త్రములను దిరోహితుఁడై నడుమనే ఖండించుట, విశ్వామిత్రుని యజ్ఞము మున్నగున విందుల కుదాహరణములు.

ఇది కాక, "భాసో హాసః" అన్న జయదేవమహాకవి వాక్యము యజ్ఞఫలమున విదూషకముఖమునను కావలివారల సంభాషణ మూలమునను సత్యమని ధ్రువపడుచున్నది. 'యజ్ఞఫల' మతిపురాతన నాటక మని యం దుదాహరింపఁబడిన ప్రాచీన శాస్త్రగ్రంథములను బట్టియు, నందు నాణెములకు సువర్ణము

లనునామ మఃండియుండుటఁ బట్టియు మనకుఁ దేటతెల్లమగు చున్నది.

మఱియు, 'యజ్ఞఫల'మునఁ గల సలలితమైనభాషయు, స్వచ్ఛములైన యుపమానములును, సరళమైన పదములును నిది భాసకృతమే యనుటకు సాక్ష్యములు. భాసుఁ డన్నఁ బరమ గౌరవము కలకాళిదాసు భాసుని భావముల నెన్నిటినో కైకొన్నటులు దృష్టాంతము లున్నవి. అట్లే యజ్ఞఫలము నుండియుఁ బెక్కులు చూపవచ్చును. వీనిని త్రిప్పి కొందఱు విమర్శకులు కాళిదాసు ననుసరించిన యొకకవి యెవఁడో యీ నాటకము వ్రాసియుండవచ్చు ననుచున్నారు. వైతండికుఁడు హేతువాదమున కొప్పుకొనఁ డని యజ్ఞఫలమున భాసుఁడు చెప్పినమాట అసత్యము కాదు కదా !

భాసనాటకములనుబట్టి భాసుని ప్రధాన గుణము లని యేవి నిర్ణయింపఁబడినవో అవి యజ్ఞఫలమునఁ గలవని పైవిమ ర్శకు లిట్లు ధ్రువపఱిచిరి. అందుచే యజ్ఞఫలమునకుఁ గ్రొత్త వ్రాఁతప్రతులు లేమైన లభించి యందు నాటకకర్తనామాదికము స్పష్టముగా గోచరించి యీ యజ్ఞఫల మన్యకర్తృక మని నిరూ పించువఱకు నిది భాసకృతముగనే యెన్నఁదగును.

యజ్ఞఫలము; భాసుని ప్రతిభాదికము

భాసుని యితరనాటకములందువలెనే యజ్ఞఫలమునను ఆతని ప్రతిభావిశేషములు లెక్కకు మిక్కిలిగా గానవగు చున్నవి. ఇందు ముఖ్యముగా భాసుని పాత్రపోషణవైశిష్ట్యము నిరుపమాన మైనది. ఆతని పద్యప్రియత్వమున కీ నాటకమును నిదర్శనమే యగును. అలంకార సంపద, సుభాషితావళి, ఆయా

పాత్రల సంభాషణాచాతుర్యము, హాస్యరస పోషణము, శృంగారరస విశిష్ట పరిపోషణము, కరుణరసపోషణము, శాంత రసపుష్టి, వీర భయానక బీభత్సరసముల కొసఁగిన స్థానము, అద్భుతరస నిర్వహణము– ముఖ్యములగు నీపట్టులలో భాసుని నిరుపమప్రతిభావిశేషములు చక్కఁగాఁ బొడకట్టుచున్నవి.

పాత్రపోషణ వైశిష్ట్యము

దశరథ శ్రీరామ పరశురామ వసిష్ఠ విశ్వామిత్రాది ప్రధాన పాత్రల పోషణము నెంత యద్భుతముగా భాసుఁ డిందుఁ జూపినాఁడో అంత యద్భుతముగానే సామాన్యపాత్ర లగు సుమంత్రుఁడు మంథర మున్నగు పాత్రములవిషయమునను జూపినాఁడు. సుమంత్రుఁడు మహారాజు హృదయము నెఱింగి యాతఁ డాజ్ఞాపించుటకుఁ బూర్వమే సర్వజనములను సర్వ సత్కారపరంపరలచే సంతోషపెట్టిన సన్మంత్రిసత్తముఁడు.

ఈతఁడు వ్యర్థప్రసంగములలోఁ గాని అతిప్రసంగమునఁ గాని పాల్గొననొల్లని యథోచిత కార్యప్రవర్తకుఁడు. "వైతండికుఁడు హేతువాదమున కొప్పుకొనఁడు. ఈతనితో మనకుఁ బని యేమి" యని యొక్కమాటలో విదూషకుని వదలించుకొని పోయి నిజకార్య తత్పరుఁ డయిన యాదర్శమంత్రి యితఁడు.

దశరథుని పాత్రపోషణ మెంత శ్లాఘాపాత్రముగా భాసుఁ డిందు నిర్వహించినాఁడో చూడుఁడు. దశరథుఁడు :

"పవనశతం బొనర్చు నొకచాయను ; జూచుకొనున్ స్వకార్యముల్
వివిధము లొక్కవంక; నరివీరుల నుక్కడఁగించు నొక్కటన్;
మిఫులఁగఁ దన్పు నొక్కెడల మిత్రుల; నొక్కట వేఁట కేఁగు ని
ట్లవిరళ కార్యభారమున నందఁడు, దుఃఖ మొకింతయేనియున్."

దశరథుఁడు రాజ్యము చేయుచుండఁగా :

"కాలవర్షంబు గురియును మేఘంబు లెప్పుడు
ఈతిబాధలు లేక సస్యేందిర కృషి
ఫల మనంత మొసంగెడు; నలఘుపుణ్య
కలితదైవానుకూల్యంబు గలుగుకతన."

సర్వలోకములకు సర్వకాలములకు నాదర్శప్రాయమైన రాజ్యమునకుఁ బ్రాతిపదిక వేసినమహారాజు దశరథుఁడు. ఈతని రాజ్యపాలనమే యిట్లున్నదన్న నిఁక రామరాజ్య మెట్లుండునో యూహించుకొనుఁ డని చమత్కారముగా భాసుఁడు సూచించినాఁడు.

సందర్భానుసారముగా నిట్లు పాత్రముల శీలచిత్రణము చేయుటలో భాసుఁ డందె వేసినచేయి.

రామపట్టాభిషేకవిఘ్నకారిణి యని జగముచే నేఁటికిని నిందింపఁబడుచునే యున్నకైకేయిశీలము పరమనిర్దుష్టముగా నితఁడు చిత్రించినాఁడు. ఆమెస్వభావము నెంతచక్కఁగా దశరథునినోటఁ గవి చెప్పుచున్నాఁడో కనుఁడు:

"ఏకరణివచ్చుచుండునో, యీకాంతకు ముక్కుసందె యొసఁగును రుషయం తేకాని విక్రమాన్విత, నాకష్టము బాపి యొసఁగు నావరం గాచెద."

"ఈమెకోపము పరిగణియింపరాని
దగును శౌర్యప్రణయశీల యగుటచేత
తలఁప ఛందోనుబద్ధవృత్తంబురీతి
శీఘ్రముననే ప్రసాదసంసిద్ధి గూర్చు."

మహానుభావురా లగు కైకేయి దాయభాగ విభాగ ప్రసంగసమయమున రాజుతో సవతులయెదుట నెంత పవిత్రముగ మాటాడుచున్నదో చూడుఁడు :

"ఆగు స్వవంశునికంటె మేలగును సుగుణి
గుణుల గుణవత్తరుఁడు మేలు కోటిరెట్లు
భాస్వరం బయి వెలుఁగుదీపంబు రాత్రి
గాని యది యెంత మధ్యాహ్నభానుముంగ."

"భరతుఁడు గుణి యాగు గణన
త్రిజగద్గురు రాముఁడు కానఁ దగు నతఁడే రా
జ్యభరము వైకొన సుగుణుం
భరతుం డతఁ డతనికన్నఁ బరముఁడు కలఁడే ?"

ఇట్టి ప్రతిపాత్రము విషయమునను గడుజాగరూకతతోఁ దూచినట్లు మాటలు వేయుచు ముక్తసరిగ వలసినవిషయము లన్నియు వచ్చునట్లు శీలచిత్రణమును జేసిన శిల్పిరత్నము భాసమహాకవి.

ఇట్టి భాసుఁ డింపుఁ బోషించిన పరశురాముని శీలము నిరుపమానమైనది. భవభూతియంతటిమహాకవికుఁడ నవతారపురుషుఁ డగు పరశురాముని దశరథ జనకరాజర్షులు రాయబారములు నోటికి వచ్చినమాట లని యుద్ధమునకు సిద్ధపడినట్లు మహావీరచరిత్రమునఁ గల్పించినాఁడు. అసలీ రామద్వయ సమాగమ ప్రధానోద్దేశ మేమన భృగురాముఁ డవతారమును జాలించుచుఁ దన తేజమును రామతేజములో నైక్యమొనరించి తన ధను వాతని కొసఁగి దుష్టశిక్షణ శిష్టరక్షణ కార్యకలాప మాతనిపై విడుచుట యే. ఈ యాంతరరహస్యమును జక్కఁగా గ్రహించి ఆ సమాగమసమయమున నన్ని పాత్రముల శీలముల సత్యమ్ముతముగా నిర్వహించిన దక్షుఁ భాసుఁడే. అదియు సీ యజ్ఞఫలమున నే. క్రుద్ధుఁడై వచ్చిన పరశురాముని దశరథ జనకాదులు రామలక్ష్మణాదులు వసిష్ఠ విశ్వామిత్ర శతానం

దులు నమస్కారనతశిరస్సులచే శాంతపఱిచిరి. ఆ మహాత్ముఁడు కోదండము నొసంగి :

“పాపులఁ బరిమార్చుటకై, చేపట్టుము నీవు దీని; క్షితి ధర్మాత్ముల్
ప్రాపించి శరణుచొచ్చిన, నేపగిదిని వారిఁ గాచి యొసఁగుము రామా!”

అని శాసించి తాను శాంతుఁడై నిష్క్రమించును. ఇంతకు నాతఁడు చేసిన పనులెల్ల ధర్మరక్షణార్థము, ఖల శిక్షణార్థము నని భాసుఁడు పరశురాముని నోటనే పలికించి యాతని శీల మత్యున్నతముగఁ బోషించినాఁడు.

అలంకార సంపద : సుభాషితములు

స్పష్టమై స్వచ్ఛమై త్రికాలాబాధ్యములై తీయదీయములు గలిగిన భాసుని యలంకారములు సుభాషితములు, నీ నాటకమున లెక్కకు మిక్కిలిగా నున్నవి.

“సరసులోని యగాధంబు జలములోన, నెసఁగు నుత్తమమానసౌకసము లట్లె
సకల రసపూర్ణ కవిచిత్త సద్మమందుఁ, బరగు నుజ్జ్వలనూత్న భావంబు లనఁగ”
“మనసె కాద కృత్యాకృత్య మతి వివేకమునకు నుత్తమ ప్రామాణ్య మన ధరిత్రి”
“కేసరిని సుంగు తరుఁ బెల్లగింప గనెనె?”
“కాలవశమునఁ బుణ్యంబు క్షయము నొంద సారహీనములౌ నెట్టిసంపదలును.”

ఇట్లెన్నియైనఁ జూపవచ్చును.

నవరస పోషణము — శృంగారము

ఈ నాటకమున నవరసపోషణము ఆయాతావులఁ జక్కఁగా నిర్వహింపఁ బడినను, ఇందు ప్రధానరసము శృంగారము. ఇది మిథిలోద్యానమున సీతారాముల పరస్పర వీక్షణములతో నారంభమై రామానురక్తయై మూర్ఛిల్లిన సీతను రాముఁడు సమీపించుటతో వృద్ధియై సీతాకల్యాణమున శుభ

పర్యవసానము నందినది. ఇందలి శృంగారము పరమ పవిత్రమైనది. నాయకుఁడగు రాముని ప్రణయము అస్థానమునఁగాక స్వస్థానమున నగుట యొక విశేషము. మఱి యిది పేలవములగు కచకుచాది వర్ణనములతోఁ గాక కేవలము స్త్రీ సౌందర్యద్యోతకము లగుముఖకాంతిసౌందర్యములకే సంబంధించినది.

"స్వచ్ఛసుందరశరదిందువదన"

"అజగన్మోహనాంగి" "కుసుమపేశలసుగాత్రి"

"సురుచిరగత్న వదనారవిందముఁగని, మన్మథుఁడు నాట్యమొనరించు మహితభంగి."

మున్నగు మనోహరభావములతోడనే కాని నీచ శృంగారమునకుఁ గాని గతానుగతిక మగునవయవవర్ణనములకుఁ గాని పోక భాసుఁ డిందలి సీతారామ శృంగారమును బవిత్రతర మొనరించినాఁడు.

హాస్యరస పోషణము

భాసుని హాస్యరసపోషణమునకుఁ దొలుతటి యంకమునందలి విదూషక కాంచుకీయ సంభాషణము చక్కని యుదాహరణము. ఇదికాక, నాల్గవ యంకమునకుఁ బూర్వమునఁగల ప్రవేశికలో జనకరాజ ప్రాసాదమున మాళవకుఁడు, భషకుఁడు, దంతిలుఁడు, గోపిలుఁడు అను నలుగురు వైతాళికులు జరిపిన సంభాషణము, విదూషకుఁడు వచ్చిన పిమ్మట అతఁడు విశ్వామిత్రుఁడు ఉభయతోముఖుఁడని వికృతముగా వర్ణించిన వర్ణనములు మున్నగునవి అబాధకములైన భాసుని హాస్యసంభాషణములకు సాక్ష్యములు.

కరుణారసము

విశ్వామిత్రుని వెంట నరుగు రామలక్ష్మణులు గ్రామ సీమలఁ గనుచు వృద్ధగోపికతోఁ జేసిన సంభాషణము, తమ కప కారము చేయుచున్న మృగములనైనను జంపవల దనియు నవి యొక్క నాఁడు కానరాని చో విచారించెద మని యామె చెప్పిన పట్టులను గరుణారసము లలితముగాఁ జూపఁబడినది.

వీరభయానక బీభత్సరసములు

రాముఁడు తాను విడచిన రెండు బాణములు వ్యర్థములై నపుడు వీరగర్జన మొనరించి భయంకరముగాఁ బలికినపుడు వీర భయానక రసములు, పిప్పలవృక్షము నాకులు చిల్లులుపడి యుండుట, రథము గుఱ్ఱములు కానరాకుండ వాని యానవాళ్లు గనిపించుటచేఁ గలఁగి పాఱిపోయిన చెలికత్తెలస్థితి గనుఁగొన్న పుడు బీభత్సరసము పోషింపఁబడినవి.

శాంతరసపోషణము

జనకరాజర్షి శీలపోషణముపట్ల శాంతరసము చక్కఁగా నిరూపిత మగుచున్నది. "దేశాంతరమో జన్మాంతరమో, ఏమైనను జీవికి స్వకృత్యము ననుసరించి పోనక తప్పదు. వెళ్ళిన పిదప నెవరు బంధుజనులకు బాధ కలిగింపరో మఱి తాము దుర్గతి నందరో వారే ధన్యులు." మున్నగు జనకుని వాక్యములు శాంతరస ప్రతిపాదకములు.

"ఒక్కటియయ్యును నాత్మ తానొక్కజముగ
వివిధరీతుల మనలోన వెలయుచుండు."

అన్న జనకుని విజ్ఞాన విశేషమున శాంతరసము పారము గన్నది.

అద్భుతరసము

భరతలక్ష్మణశత్రుఘ్నుల ధనుర్విద్యా ప్రదర్శనమునను, శ్రీరాముఁడు శివధనుర్భంగ మొనరించినపట్టునను, శ్రీరామ లక్ష్మణులు రాక్షసులను పెక్కువిధములఁ బాఱఁద్రోలి మారీచసుబాహుల నుక్కడఁచు పట్టునను అద్భుతరసము పోషింపఁబడినది. అదికాక:

> "నలువయు విష్ణువున్ శివుఁడు నారదతుంబురులింద్రుఁడున్; సుతూహలులయి కల్పవృక్షకుసుమావళిఁ జల్లుచు "

అనుపట్టునను అద్భుతరస పోషణము గలదు.

ఉపసంహారము

ఈ విధముగా 'యజ్ఞఫల' మను నూతన భాసనాటకము నవరస సంపదలకు మనోహరాలంకార సుభాషితములకు భాసుని ప్రతిభా విశేషములకు నాలవాలమైన దనుటలో నత్యుక్తి లేదు. కాలగర్భమున లీనమైయున్న ఆ మహా కవీశ్వరుని యితర నాటకములు నితర గ్రంథములు బయలువడి సంస్కృత వాఙ్మయాకాశమున ధ్రువతారలై వెలుఁగొందు సుముహూర్తము త్వరలో విచ్చేయుఁగాక !

కృతజ్ఞత

ఈ నాటకము తొలుత "భారతి" ఫిబ్రవరి, మార్చి, ఏప్రిలుసంచికలలోఁ బ్రకటించితిని. పలువురు దీనిని గ్రంథరూపమునఁ దెమ్మని తొందర చేసిరి. మూలముతో సరిచూచుటలో

నటీ నటుఁ జక్కనిసూచనలు చేయుటలో నా కెంతయో తోడ్ప డిన మిత్రులు శ్రీ గొట్టుముక్కల రామకృష్ణశాస్త్రి గారి మేలు మఱవఁ జాలను. ఉత్తమనాటక మగు దీని నెల్ల 'రాదరింతు రని విశ్వసించుచున్నాను.

కాకినాడ,
౧౫-౭-౫౨.

ఇట్లు విధేయుఁడు,
బులుసు వేంకటేశ్వరులు.

ఓం

శ్రీ గురుభ్యో నమః

యజ్ఞఫలము

ప్రథమాంకము

[నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును]

సూత్రధారుఁడు

రాముండు కృపాళుఁడా భరత సు
శ్రీమంజులాత్ముండు వి
స్ఫార శ్రీశుభలక్ష్మణ ప్రథితుఁడున్
శత్రుఘ్నవీరుండు వి
స్తారి ప్రాభవమానిచంద్రకృతయ
జ్ఞత్రాత, కోదండహ
స్తారూఢుండు ప్రసన్నమూర్తి నిరతో
త్సాహుండు మిమ్మోముతన్ !

(తెరవంకఁ జూచి) ఆర్యా ! ఒకసారి యిటు రమ్ము.

నటి:—(ప్రవేశించి) ఆర్యపుత్రా ! వచ్చితిని. ఏమిపని ?

సూత్ర:—సఖీ ! ఈసభాసదులు మనము ప్రయోగించునాటకముఁ జూడఁగోరుచున్నారు. వీరిసంతోషముకొఱకై వసంతఋతువునుగూర్చి నీ వొకపాట పాడుము.

నటి:—సరే. (పాడును)

ఉత్సాహ. క్రొంజివుళ్లశోభ మిగులఁ
గోమలంబు లౌలతల్
మంజులంబు లగుచుఁ దీయ
మామిడుల్ సుగంధులై
రంజిలంగ నుపవనంబు
రమ్యమై ప్రసన్నమౌ
సంజవేళ మల్లెపూలు
సరసమౌడ నవ్వులన్. ౨

సూత్ర:—బాగు! బాగు! నీపాటవలన నందఱును సంతోషించు
చున్నారు.
(తెరలో) ఏమి? ఏల సంతోషింపరు?

సూత్ర:—(విని) ఓహో!

గీ. పుత్త్రజననోత్సవంబున భూవిభుండు
తనర, నుత్సవదానసత్కారములను
వారు లెల్లర సంతోషపఱిచి మిగుల
నిదె సుమంత్రి సుమంత్రుఁ డీ క్లేఁగుదెంచె. 3

(నిష్క్రమింతురు.)

ఇది స్థాపన.

యజ్ఞఫలము

ప్రథమాంకము

[ప్రవేశము:—సుమంత్రుఁడు]

సుమం:—ఏమి? ఏల సంతోషింపవు?

ఉ. పౌరులఁ దృప్తిఁ గూర్చితిని బ్రాహ్మణజాతిని భోజనార్థవి
స్తారసుఖాబ్ధిఁ దేల్చితిని దన్పితి శ్రోత్రియసంతతిన్ యథా
చారము, వాంఛితార్థములు సర్వజనంబుల కిచ్చినాఁడ స
త్కారపరంపరన్, జనవితానము తోషము నందకుండునే! ౮

కంచుకి:—(ప్రవేశించి) అమాత్యా! పురజనులను జానపదులను నందఱను యథేచ్ఛము లబ్ధకాములను గావింపు మని నీకు రాజాజ్ఞ. ఒక్క-యర్థియైనఁ గోరికతీరనివాఁ డుండరాదు.

సుమం:—మహారాజుమనసు తెలిసి నేనే యవి యన్నియు నొనరించితిని.

కంచు:—మంచిది. అమాత్యా! మంచిది. నృపతియింగితమెఱిఁగి ప్రవర్తించినమంత్రి శుభప్రద మగుభవిష్యత్తును ధర్మమార్గమున స్వర్గమును జూఱఁగొనఁగలఁడు. ప్రాడ్వివాకులతీర్పు ననుసరించి కారాగృహబద్ధు లయినవారి నెల్లరిని విడిపింపు మనియు నీకు రాజాజ్ఞ.

సుమం:—దొంగలు కాని, శఠులు కాని, వేదవణిజులు కాని, పరస్త్రీకాములు కాని, జూదరులు కాని, త్రాగుఁబోతు

లు కాని, రాజదాసీప్రియులు కాని, లేక స్వర్గతుల్యముగా నున్న మన రాజ్యమునఁ గారాగృహబద్ధు లెవరున్నారు? ఇంతవఱకుఁ బిత్రృణమున బద్ధుఁడై యున్నవాఁడు మన మహారాజొక్కఁడే. కొడుకులఁ గని యాయనయు విముక్తుఁడై యున్నాఁడుకదా !

విదూషకుఁడు—(ప్రవేశించి) మహారాజుపుత్త్రికామేష్టి యిప్పుడే సఫలమైనది. ఇన్నాళ్లు నేను మోదకములు మెక్కుటలో నాజఠరముపై నేమాత్రము జాలి చూపలేదు. ఇటువంటియజ్ఞములు నాలుగైనవా నే నప్రతిరఘుఁడ నగుమోదకవైరి నగుదును. నావంటివిప్రులు భోజనము చేసి తుష్టు లగుచో నేయజ్ఞకర్మము సఫలము కాదు ?

సుమం:—ఓయీ ! సుందరకా ! నీకు సువర్ణము చాలినంత లభించినదా ?

విదూ:—ఏమి ? తినుటకుఁ గాని త్రాగుటకుఁ గాని కట్టుకొనుటకుఁ గాని పనికిరానిపాడుబంగారముతో నాకుఁ బని యేమి ? బంగారము ప్రియు మగుటకు నేను రాజు నను కొంటివా కోమటి ననుకొంటివా ?

కంచు:—ఓమహాబ్రాహ్మణా ! మఱి నీ కేది ప్రియము ?

విదూ:—మోదకభోజనము.

కంచు:—నీ వెన్నిమోదకములు తినఁగలవు ?

విదూ:—మహారథుఁ డగుమహారా జెన్నివేలమందిశత్రువులను జంపఁగలఁడో యన్నివేలు.

కంచు:—పదివేలమందిశత్రువులను జయింపఁగలవాఁడే మహారథుఁడు.

విదూ:—అయిన, నేను పదివేలమోదకములఁ దినఁగలమహారథుఁడను.

కంచు:—ఏమి! ఒక్కదినమున నెవ్వఁడైనఁ బదివేలమోదకములఁ దినఁగలఁడా ?

విదూ:—ఏమి ! ఒక్కదినములో నేమహారథుఁడైనఁ బదివేల మందిని జంపఁగలఁడా ?

కంచు:—పదివేలమందిలోఁ గొంతమంది చనిపోదురు. కొంత మంది పాఱిపోదురు. కొంతమంది చెల్లాచెద రగుదురు. కొంతమంది శరణుచొత్తురు. వీరిని మహారథుఁడు రక్షించును.

విదూ:—నేనును గొన్నిమోదకములను మ్రింగుదును. కొన్ని టిని జెదరఁగొట్టుదును. కొన్నిటిని జిదుకఁగొట్టుదును. కొన్నిటిని దాఁచుకొందును.

సుమం:—బాభ్రవ్యా ! వైతండికుఁడు హేతువాదమున కొప్పు కొనఁడు. వీనితో నేమి ? నేను నాపని చూచుకొని మహారాజు నభినందింప నేఁగుదును.

(ముందు చూచి) ఓహో ! మహారాజు సపరివారముగా నిటు వచ్చుచున్నాఁడు.

కంచు:—నేను నాపని చూచుకొందును. (నిష్క్రమించును.)

విదూ:—నేను తినఁగా మిగిలినమోదకములను దాఁచుకొనఁ బోవుదును. (నిష్క్రమించును.)

సుమం:—ఆహా ! మహారాజు వార్ధకదశయం దైన నెంతరమణీ యాకృతితో నొప్పుచున్నాఁడు ! నిత్యము రాజకార్య ముల నిర్వహించుచున్నను నీతఁడు శ్రమ మెఱుఁగక

ప్రసన్నుఁడుగానే యుండును.

చ. సవనశతంబొనర్చు నొకచాయను, జూచుకొను స్వకార్యము
ల్వివిధము లొక్కవంక, నరిపీరుల నుక్కడఁగించు నొక్కటఁ,
మిపులఁ బ్రసన్నుఁడై నొకట మిత్త్రుల, గొల్చువేఁటకేఁగు, ని
ట్లవిరళకార్యభారమున నంపఁడు దుఃఖ మొకింతయేనియున్.

నిజకర్మకరణముపట్ల నాతఁ డతియుఁవకుఁడు. ముదిమి పైఁబడినను మహాతేజ మాతనిని వీడదయ్యె. ప్రజ లాతని పేరు విన్నమాత్రముననే పాపదూరులై స్వధర్మనిర్వాహు లగుచుందురుగదా!

[సపరివారము రాజు ప్రవేశించును.]

రాజు:—ఆహా! రాజ్యమునకు శత్రుభయమనునే లేదాయె. ప్రజలా ధర్మసంపద్యుతులై పరవస్తువాంఛయే యెఱుఁగరు. దుర్భిక్షము కాని చాపమరణము కాని లేనేలేవు.

గీ. కాలవర్షంబుఁ గురియు మేఘంబు లెపుడు
ఈతిబాధలు లేక సస్యేందిర కృషి
ఫల మనంత మొసంగెడు; నలఘుపుణ్య
కలితదైవానుకూల్యంబు కలుగుకతన. ౬

వేదములా యధీతము లైనవి; రిపులా నిరస్తులైరి; ప్రజలా పుత్త్రసములుగాఁ బరిపాలితులైరి; ఇష్టధనకీర్తులా సంప్రాప్తించినవి. ఇపుడు నేను జేయఁదగినపని యేతోఁపదయ్యెను. దేవతలు పితరులు విప్రులు దీనులు శరణాగతులు యథావిధిఁ గులాచారానుసరణిఁ బూజితులైరి. ఇంతేకాక—

గీ. పుత్త్రజననంబుచేఁ బరిపూర్ణ మయ్యె
మన్మనోరథ, మన్వయమహిమ మొప్పె
నెట్టిలోపంబు లేకపోయిన, నికామ
తృప్తిఁ గనదయ్యె నాచిత్త మేమొ కాని. 8

సుమం:—(చేరి) మహారాజా! జయము. ప్రజాపాలనయోగ్యులగుపుత్త్రులపై రాజ్యభారము నిడి నీవు మహాసంతోషము నొంద నున్నావుకదా!

రాజు:—రమ్ము. సుమంత్రా! నీవు వెంటనే సర్వార్థిజనమును సఫలాశాచిత్తులఁ గావింపుము.

సుమం:—మహారాజా! కావించితిని.

రాజు:—శ్రోత్రియులను గోహిరణ్యాదానములచే సత్కరింపుము.

సుమం:—సత్కరించితిని.

రాజు:—బద్ధు లగునరులను విడిపింపుము.

సుమం:—మహారాజా! నీవు ధర్మపరిపాలనమున భూమి నేలుచుంటివి. ఈభువిపై దివియే సాక్షాత్కరించినది. ఇఁక, నిట బద్ధు లెవ రుందురు?

రాజు:—ఏమి! ఇంతవిశాల మైనరాజ్యమున నధర్మ మాచరించి బద్ధదండము విధింపఁబడినవాఁడే లేఁడు! పూర్వపుణ్యప్రభావము!

సుమం:—

గీ. రాజసింహుఁడ వై నీవు రాజ్య మేల
దుష్కృతం బొనరింపఁగాఁ దొడఁగు నెవఁడు?
సూర్యుఁడు నిరభ్రగగనాన శోభిలంగ
దారి కడ్డము వచ్చునే తమము తలఁప? ౯

బద్ధులే లేనికారణమున బద్ధమోక్షణప్రశంసయే లేదు. పితౄణవిషయమున బద్ధుఁడ వైనవాఁడవు నీ వొక్కఁడవే యుండెడివాఁడవు. కాని, నీవును బంధవిముక్తి నందియుంటివి.

రాజు:— ఔను. నిజమే. పితరులఋణము తీర్పఁ గంటిని. బద్ధముక్తి నందితిని. కాని, మఱియొకదృఢతరబంధమే కలిగినది. దానినుండి విముక్తిఁ గనఁజాలను.

సుమం:— ఏమది ?

రాజు:— ఏమందువా ? అధ్యయనము చేయించి, వినయమును నేర్పి, శ్రుతుల నొనరించి, వాసిష్ఠధర్మాన్వితనృపగుణముల నలవఱిచి, ప్రజారక్షణయోగ్య మగు రాజద్వేషవివర్జితమనస్సును బెంపొందఁజేసి, శత్రువులకు భీతి పుట్టించి పాఱిపోఁజేయునస్త్రసంపదల నారితేఱఁజేసి, నలువురుపుత్త్రులను బోషింపవలయునుగదా ! ఇట్లు చేయలేనినాఁడు నేను ధర్మనాశకుఁడ నగుదును. అందుచేఁ బుత్త్రోదయమువలన నే నెన్నిధర్మబంధములకు లోనైతినో కనుము. సుమంత్రా ! ఇంతకు

గీ. దృఢతరంబుగ నన్ను బంధించెఁ బుత్త్రి
రాగపాశంబు కట ! త్రెంపరాదు దీని
బ్రతికియున్నంతకాల మీబంధనంబు
నుండి వెలువడ వాంఛింప కుండువాఁడ. 5

ప్రతీహారి:— (ప్రవేశించి) మహారాజా ! జయము. పుత్త్రోత్సవమైనపిదపఁ గౌసల్యాదేవి మహారాజును జూడ వేడుక

పడుచున్నది. తాను పెద్దభార్య గాన మొదటఁ దన్నే సంభావింపఁ గోరుకొన్నది.

రాజు:—విజయా! ఆమె సద్వంశప్రభవ. పాణిగ్రహణలాలిత. ఆలంబభూత. ఆమెను యష్టివలె మన్నింపవలయును.

చేటి:—(ప్రవేశించి) మహారాజా! జయము. సుమిత్రాదేవి మహారాజుకృపచేఁ గుశల మనియుఁ దా నిద్దఱుకుమారులను గన్నతల్లి యగుటచే ముందుగాఁ దన్నే సంభావింపఁ గోరుకొన్న దనియుఁ జెప్పుమన్నది.

రాజు:—వినయవతీ! సర్వంసహ యగుసుమిత్రాదేవి మిత్రతుల్యురాలు. మన్నియోఁగవర్తిని. వశంవద. ఆమెను పేక్షింపఁజాలను.

[అంత మంథర, విదూషకుఁడు ప్రవేశింతురు.]

మంథ:—మహారాజా! అభిజనానురూపాదరయు రాణులలోఁ గనిష్ఠ యయ్యు గుణములలో జ్యేష్ఠయు, తన్వి యయ్యు సగౌరవయు, మహారాజబహుమతయు, అప్రతిరథుఁడగు కేకయరాజుకూఁతురును నగుదేవి తానే ముందు సంభావింపఁదగిన దని నివేదింపు మన్నది.

విదూ:—(తనలో) అమ్మో! ఈరండవచనోపన్యాసము తర్జనసహితము! (ప్రకాశముగా) వయస్యా! ఉపేక్షించినచోఁ గనిష్ఠ యగుదేవి యేమిచేయునో కొంచెము తెలిసికొని పిమ్మట సమాధాన మిమ్ము.

రాజు:—(తనలో) ఈమె ప్రతిజ్ఞాతసుతాభిషేక. సింహివలె దుర్వారమహాప్రకోప. ఈమెను రాణులతో సమానముగా ననునయింపవలయు. (ప్రకాశముగా) మంథరా! ముఖ్య

రను క్రమముగాఁ బిలిచెదను. ఏలన, బుద్ధిమంతులు ధర్మార్థకామములను సమభావముననే సేవింతురుగదా! అట్లే, నేను సపుత్రిల ముగ్గురను సమముగా సంభావింతును. కాన, మధ్యమమందిరమున నందఱు నారాక నిరీక్షించుచుండుఁ డంటి నని చెప్పుఁడు.

మంథ:—(తనలో) ఏమి! మారాణిని ముందు గౌరవింపఁడా? (ప్రకాశముగా) మహారాజు సెలవుప్రకారమే.

[ప్రతీహారి, చేటి, మంథర నిష్క్రమింతురు]

విదూ:—వయస్యా! నీకు ముగ్గురు దేవులయందు సమానాదరము కలదు. సుమిత్రయొద్దఁ గొడుకులమీఁద • కైకేయి పుత్త్రునిపైఁ జూపునాదరములో సగముమాత్రమే చూపుదువు!

రాజు:—వయస్యా! చతుర్విధపురుషార్థములలో భేదము లేనట్లే నాకు నలువురుకుమారులలోను భేదభావము లేదు. నాలుగు వేదములలో నొక వేదము తక్కువ మఱియొకటి యెక్కువ యన్నతఁడు విప్రుఁడు కాఁడు.

విదూ:—(తనలో) ముగ్గురు రాణులు త్రివర్గతుల్యలు. నలుగురు కొడుకులు చతుర్వర్గతుల్యులు. ఐదుగురు సమకూడిన చో నేమనునో? (ప్రకాశముగా) పురుషార్థములు వేదములు నాలుగే కనుక పుత్త్రులతో సమానముగాఁ బోషణీయుఁడ నగుకనిష్ఠవయస్యుని నన్ను నీవు ప్రేమించుట లేదు. అవునా?

రాజు:—(నవ్వి) పంచమహాయజ్ఞములు విప్రులకు సమానములు. ఈయైదిటితో మీరు మించెదరు. నీ కింక సంశయమేల?

విదూ:—(తనలో) ఆఱుగుసు లేదు. ఉన్న నీమాటకారితనము తెలిసిపోయెడిదే! (ప్రకాశముగా) కొడుకులు పుట్టినదిన మన్నయుత్సాహముతో నీ వాఁకలి సైతము మఱచితివి. సూర్యుఁ డస్తమించుచున్నాఁడు చూడుము.

రాజు:—ఓహో! సంధ్యాసమయ మైనది.

చ. శరణ మొసంగు చెట్ల ద్విజసంతతి చేరెఁ గిలారవంబులన్
గిరణములన్ నభస్థలిని నింపెను నర్ధశశాంకుఁ డప్పుడే
యరుణగభస్తిబింబ మది యస్తము; మిక్కిలి భాసమానమై
పరగెను దీపికాసుచిక్షపావదనోజ్జ్వలభూషణం బనన్. ౧౦

మఱియు:

ఉ. అల్లదె భూమికిన్ దిగినయట్లు విధుండు సరోజలంబులన్
ఫుల్లనవోత్పలప్రసవపుంజములన్ బ్రతిబింబ మొప్ప రం
జిల్లు విధేయులై విమలచిత్తులు నెన్నృపు లెల్లఁ గొల్వఁగా
నల్లన వారికిన్ దగిన యాజ్ఞ లొసంగెడి రాజరాజనన్. ౧౧

(నిష్క్రమింతురు.)

ఇది ప్రథమాంకము.

విష్కంభము i

[ప్రవేశము : కాంచుకీయుఁడు]

కాంచు:—మహారాజు నాకిట్లాజ్ఞాపించెను. "ఓ బాభ్రవ్యా! ధారాగృహముకడ నున్న గ్రీష్మోద్యానమున కేఁగి యచటఁ బరిజను లెవ్వరు నుండరాదని యాజ్ఞాపింపుము." మహారాజు రాణులతో నటకు విహారమునకు

వచ్చునఁట. పరిజను లుండరా దని యేల యనెనో ? ఏదైన రహస్యాలోచనము కలదా ? రాజులతో రహస్యాలోచన మాతఁ డెప్పుడును జేసి యుండలేదే ! నాకీగొడవ యేల ? న న్నేమి చేయుమన్న నదే చేయుదును. రాజకర్మ మంతయు నిగూఢభావవిలసితము. అది సుమంత్రులకే కాని మావంటివారికిఁ దెలియదు. రాజు లతిగుప్తకృత్యులై శంకితస్వాంతు లయియే యుందురు. వారు కన్నులు మూసికొనియు జాగ్రదవస్థలోనే యుందురు.

[చేటికలు ప్రవేశింతురు]

చేటి:—ఆర్యా ! నలుగురుకుమారులకు నాలుగుకుసుమజవనికలను మేము సూత్ర మక్కఱ లేకయే తయారు చేయుచున్నాము.

కాంచు:—మంచిదే. కాని, మఱియొకయుద్యానమున కేఁగి విూ రీపని చేయుఁడు.

ఇంకొక చేటిక:—ఆర్యా ! ఇంకొకయుద్యానమున నిన్నిరంగులు నింతపరిమళము కలిగినపువ్వు లిన్ని లభింపవు.

కాంచు:—ఐన నే నేమి చేయఁగలను ? ఇపు డెవరు నిట నుండరా దని మహారాజాజ్ఞ.

చేటికలు:—ఐన చోఁ బోవుదుము. (నిష్క్రమింతురు.)

కాంచు:—ఈయుద్యానమున నీఁగ యైనను లేకుండఁ జేసితిని. మహారాజుకడ కేఁగి యీవిషయము నివేదింతును.

(నిష్క్రమించును)

ఇది విష్కంభము.

యజ్ఞఫలము

ద్వితీయాంకము

[పరిజనులు సేవించుచుండ మహారాజు ప్రవేశించును.]

రాజు:—(స్వేచ్ఛగా నడచి) ఆగ్నవిధి ననుసరించి యజ్ఞము లెన్నో యొనరించితిని. అర్థుల కెందఱకో ధనము లొసంగితిని. ప్రజలకు సుఖము లొనగూర్చితిని. రిపులకు యుద్ధభీతి కలిగించితిని. ఇన్నాళ్ళ కిప్పుడు కొంచెము జరాభరాయాసము కలిగినది. ఐనను,

ఉ. కంటి స్వకీయసౌఖ్యమునకంటెఁ బ్రజాసుఖ మెక్కుడంచుఁ, గై
కొంటిఁ గులానురూప మనుకూలయశస్సముపార్జనంబు, నే
నుంటి స్వకర్మముల్ విడువ కున్నతభోగము లెల్ల నంది, చే
కొంటి జనానురాగ మనుకూలల మొనర్చెద వేగ శిష్టముల్.

(ఆలోచించి)

గీ. రాణులను మువ్వురనుగూడ రంజిలంగఁ
జేసి రాజగుణాన్విత శ్రీఁ జెలంగు
రామచంద్రుని రఘువంశరత్నసదృశు
యౌవరాజ్యాభిషిక్తుఁ జేయం దలంతు. ౨

ఎవ రక్కడ?

ప్రతీహారి:—(ప్రవేశించి) మహారాజా! జయము. ఏ మాజ్ఞ?

రాజు:—విజయా! మంత్రి సుమంత్రుని బిలువుము.

ప్రతీ:—చిత్తము. (నిష్క్రమించి సుమంత్రునితోఁ బ్రవేశించి) ఆర్యా!

ఇటు. ఇటు. ఇదిగో ! మహారాజు. సమీపింపుము.

సుమం:—(చేరి) మహారాజా ! జయము.

రాజు:—అమాత్యా ! స్వాగతము. రమ్ము. కూర్చుందము.

(ఇరువురు కూర్చుందురు.)

రాజు:—విజయా ! నీవు పొమ్ము. (పరిజనులను జూచి) మీరును బోయి విశ్రాంతి నందుఁడు.

పరి:—చిత్తము. (నిష్క్రమింతురు.)

రాజు:—అమాత్యా ! నేఁడు నామనస్సు చింతాజాగరణపరవశమై యున్నది.

సుమం:—(తనలో) ఏమి ! ఈతఁడు మహాయశస్వి. రిపుభయప్రదుఁడు. ప్రజలను గన్నబిడ్డలవలెఁ బాలించువాఁడు. ఈతని కెట్టిచింత కలిగెనో ? (ప్రకాశముగా) మహారాజా'

మ. స్థిరధర్మవ్రతముఁ బ్రజాప్రియమహాదృష్టమ్ము నిశ్శత్రుతా
గురుతఁ గాంచినరాజసింహుఁడవు నీకుఁ బీరులై పుట్టి న?
ల్వురుపుత్త్రుల్వినయాన్వితుల్ప్రజల కెప్పుం బ్రేమపాత్రంబులై
పరఁగ న్మానసికవ్యథాభరము దేవా ! యెట్లు కల్గెం గటా !

మఱియు సంస్కృతులు వినయోపేతులు ప్రజారంజనతత్పరులు నగునలువురుకొడుకులను గాంచి చింతలు విడిచిపెట్టవైతివా ? లేక, పెద్దకుటుంబము గలగృహమేధి కెట్లనవరతము నేదోయొకచింత కలుగుచునే యుండునో యట్లీ యీవిశాలరాజ్య మనుకుటుంబబాహుళ్యమున నీకుఁ జింత కల్గినదా ? పోనిమ్ము. చింతాప్రతీకార మూహింపలేదా ?

రాజు:—అందులకే నిన్నుఁ బిలిచినది.

సుమం:—సెల విమ్ము.

రాజు:—కైకేయీతనయుఁడే నాసకలరాజ్యము ననుభవింపఁ గలఁడని యవివేకినై తొలుత కైకకు వర మిచ్చితిని.

సుమం:—ఐన ?

రాజు:—క్షత్త్రిగుణాకరుఁ డగురాముఁడే రాజ్యపాలనయోగ్యుఁడు. ఆతనికి యువరాజపట్టము గట్టుటే నా కోరిక. ఇది సులభమా ?

సుమం:—మహారాజా! అది దుష్కరము కాదు.

రాజు:—ఎట్లు ?

సుమం:—మహారాజా !

చ వినయనయప్రవర్తనవివేకగుణాదికపూర్ణుఁ డైనరా
ముని ముగురమ్మలున్ దమదుముద్దులబిడ్డని గాఁగఁ బ్రేమపెం
పునఁ గనుఁగొంద్రు; జ్యేష్ఠునిఁగ భూరిగుణంబులఁ దేజమందునా
తని కభిషేకమన్నను ముదంబును గాంతురు రాణులందఱున్.

అందుచే నీవు చింతింపవలసినపని లేదు. ఇంతకుఁ గుమారు లుపనీతు లైరి. శస్త్రశాస్త్రాధ్యయనపూర్ణు లైనపిదపఁగదా యభిషేకము. ఇప్పటినుండియ నీచింత యేల ?

రాజు:—అనాగతము విప్రకృష్టము నగుభావిని గూర్చి చింతించువానికిఁ గష్టము కలుగదు. వచ్చి పైఁబడ్డవిషాదమును స్మరించుకొనునరున కనూన మగుకష్టము కలుగును. కావున, పుత్త్రరాజ్యాభిషేకవివాదహేతువు నిప్పటి నుండి యాలోచించిన నప్పటి కేయుపాయముచేనైన దానిని దొలఁగించుకొనవచ్చును గదా !

సుమం:—సరే నాకేమి యాజ్ఞ ?

రాజు:—

చ. పరిజనభృత్యమంత్రిజనపౌరజనంబులు రాణులున్ నిరం
తరమును రామమానసు లనారతరామవిధేయచిత్తు లా
కరణి నొనర్పు మాభరతు గాఢతరాగ్రజభక్తియుక్తిసం
భరితు నొనర్పు మియ్యది సుమంత్ర ! తలంచు మదాత్మ
శల్యమున్. ౫౭

సుమం:—(తనలో) ఆహా! మహారాజు దూరదృష్టి! (ప్రకాశముగా) నీ విపు డన్నట్లే సర్వము రామపరవశ మగును. దాని కధికముగనే కూడ జరుగఁగలదు. (ముందు చూచి) మహారాజా ! రాణులు మువ్వురు సపరివారముగా నిటకు విచ్చేసి యున్నారు.

రాజు:—నీ వేఁగి రమ్ము. నేను చెప్పినది మఱచిపోకుము.

సుమం:—చిత్తము. (నిష్క్రమించును.)

రాజు:—సపరివారముగా మువ్వురు రాణులు నిటకు విచ్చేసి యున్నారు. ఇపు డీగ్రీష్మోద్యానమునకు వా రందఱును రాఁదగినదిగాఁ జెప్పియుంటినిగదా ! (నిరూపించి) ముందు కౌసల్య

మ. రమణీయద్యుతిరత్నధారణమహారమ్యాంగి, జ్యేష్ఠాంగనా
రమ, దివ్యప్రసవాభ పూజ్యయగు నీ రామన్ గణింపందగున్
సమదం బౌసుకుమారదేహ యయిన న్బాలించునాజ్ఞన్ హృద
బ్జములో నన్నను నిల్పు నెప్పుడుమహాభావాత్మయూహింపఁగన్.

తరువాత సుమిత్ర

మ. వ్రతనియమావళీకృశశుభంయులతాలలితాంగి, సర్వస
న్నుత సుగుణాఢ్య యెంతయు మనోహర మావదనేందుబింబస
ద్యుతి నిజ దేహయష్టిపయిఁదోఁపఁగఁ జేయుమహాభ, శాంతిదే
వత, మృదుభాషిణీమణి శుభప్రద దేవి సుమిత్ర చూడఁగన్.

ఇఁకఁ గైకేయి

చ. కమలవనంబుమధ్యమునఁగ్రమముగా వెలుఁగొందుసూర్యబిం
బముఁ బురుడించునీమె, తలఁపం గడఁగున్ నిరతంబు మద్వర
క్రమమును, సన్నిధానమునఁ గన్పడునట్టిసపత్నులన్ దృణో
పమముగఁ జూచు, సింహగతి వర్తిలు జీరికిఁగోక లోకమున్.

వీరిలో,

క. తొలిమహిషి రామజననియు
విలసచ్ఛుభలక్షణాంగి విశ్రుతనయసం
కలిత సగర్వయు నగుకో
సలరాజాత్మజయె నిత్యసమ్మాన్య యగున్. ౯

కాని,

గీ. దురభిమానరోషములు మందునకుఁ గానదు
సర్వమిత్ర సుమిత్ర యా సత్య మరయ,
ఆత్మకామానుసారిణి యహరహంబు
నాయెడంద జయించిననాతి యామె. ౧౦

కైకేయియో,

క. ఏకరణి వచ్చుచుండునొ
యీ కాంతకు ముక్కునందె యెసఁగును రుష యం
తే కాని విక్రమాన్విత
నాకష్టముఁ బాపి కాచినది మున్ను నన్నున్. ౧౧

అందుచే,

గీ. ఈమెకోపము పరిగణియింపరాని
దగును శౌర్యప్రణామశీల యగుట; నిదియుఁ
దలఁప ఛందోనుబద్ధవృత్తంబురీతి
శీఘ్రమునవే ప్రసాదసంసిద్ధిఁ గూర్చు. ౧౨

[అంత ముప్వురురాణులు పరిజనులతోఁ బ్రవేశింతురు]

అందఱు:—జయము మహారాజా!

రాజు:—రాణులకు స్వాగతము. రండు. ఈమణిఖచితశిలాతలమునఁ గూర్చుండుఁడు.

అందఱు:—(కూర్చుండుదురు)

రాజు:—పరిజనులారా! మీరు మీగృహముల కేఁగి విశ్రమింపుఁడు.

పరిజనులు:—(నవ్వుచు) చిత్తము. మహారాజా! (నిష్క్రమింతురు)

రాజు:—ఈమండువేసవిమట్టమధ్యాహ్నమం దైన, ఈయుద్యానమెంత చల్లగా నున్నదో చూడుఁడు.

చ. భవనమృగంబు లెల్లఁ దరుపంక్తులనీడలఁ గూర్కు-వెట్టెడున్
బ్రవిమలవాపికాస్థిమితవారిని హంసలు కృత్రిమంబు లా
పవిదినిదోఁచుఁ; గోఁతులిటుఁ బాదపశాఖలఁ జక్రమించు, దా
దవులఁ గలట్టిపక్షు లిటుఁ దారసిలున్ సమశైత్య మందఁగన్.

కౌస:—ఈయుద్యానము నేత్రానందదాయకముగా నున్నది. ఇచట నే నిపు డనుభవించుచున్న సుఖము నిదివఱ కెన్నఁడు ననుభవింప లేదు.

రాజు:—కాలము ననుసరించియే సుఖము కాని దుఃఖము కాని కలుగును.

క. చన్నిటఁ జ్ఞానము సం
పన్నము చేసవిని, కాని మఱి సీతున నా
పన్నము కావునఁ గాలమె
యెన్నఁగ సుఖదుఃఖవితతి నిచ్చు నరులకున్. ౧౭

కై కే:—ఆర్యపుత్రా! ఈకాలమున నేమి చేయవలయు నని మీ కోరిక ?

కౌస:—(తనలో) బాగుగా నున్నది. ఈమెమాట లాజ్ఞలవలెఁ దోఁచును.

రాజు:—ఈయుద్యానవనమునందలియతం దిలకింపఁజేయుటకే నేను మి మ్మిటకు రప్పించితిని. ఈచెట్టునీడను జల్లగాఁ గూర్చుండి స్వేచ్ఛగా మాటాడుకొందము.

రాణులు:—సంతోషము.

రాజు:—బిడ్డల కుపనయనములు చేసితిమి. వివాహసందర్భము వచ్చినవి.

కై కే:—ఔను.

రాజు:—అందఱును గుణాశ్రయు లగుచున్నారు లే.

కౌస:—(తనలో) రాముఁడే సర్వగుణాకరుఁడు; రాజ్యయోగ్యుఁడు.

కై కే:—పితృకులమునకు గూడఁ దక్కువది కాదుకదా !

రాజు:—నిజమే. కాని

చ. ఎవఁడు స్వకీయసద్గుణసుకృత్యములన్ బితృవంశదీపకుం
డవు నతఁ డే నసింద్యుఁడు మహాత్ముఁ డెవండు నట్టిసత్పుత్ర
ప్రవరుఁ డొసంగఁజాలుఁ బితృవంశ్యులకున్నుగతుల్ దనన్యుఁడిం
కవును భరాయమానతనుఁడాతఁడగున్సగుణుండుచుండఁగన్.

ఇంతకు పీ రందఱు నుత్తములే. అందుచే నందఱి
యందును మీకు సమాన ప్రేమము గలదు.

కౌస:—(తనలో) నాకుమాత్రము రాముఁ డన్న నే యెక్కువ
మక్కువ.

సుమి:—జన్మక్రమమునుబట్టియే నా ప్రేమభేదము.

కై కే:—నాకు గుణాధికునిపై నెక్కువమక్కువ.

రాజు:—గుణాధికుఁ డెవఁడు ?

కౌస:—(తనలో) రాముఁడే.

కై కే:—అవసరమైనపుడు చెప్పెదను.

రాజు:—అందఱు నాదాయభాగమున కర్హులే.

సుమి:—దాయవస్తువులలో శ్రేష్ఠ మేదో యది జ్యేష్ఠునికే
రావలయు నని మనువు చెప్పినాఁడు.

కౌస:—(సంతోషమునఁ దనలో) మహారాజు దాయవస్తువులలో
రాజ్యమే శ్రేష్ఠము.

రాజు:—ఆచారవిషయమున మనువు ప్రమాణము. రాజధర్మ
విషయమున వాసిష్ఠ మెక్కువప్రమాణము.

కై కే:—వాసిష్ఠ మేమనును ?

కౌస:—(తనలో) రామునికే రాజ్య మిమ్మని.

రాజు:—వాసిష్ఠమున నిట్లు కలదు.

చ. ధనకనకాదుల న్సుతులు తాము సమానతఁ బంచుకోఁదగు
న్వినయగుణాకరాత్ముఁడు కనిష్ఠుఁడునయ్యు గురుండుకాఁదగుఁ
అనుపమశౌరుఁడే కొనఁగనౌను చమూపతిత న్వయోగుణం
బున నది కాదు, యోగ్యుఁ డగుపుత్త్రుఁడె రాజ్యముఁ
గైకొనం దగుఁ. ౧౬

కై కే:—యోగ్యత ప్రతిపురుషునిదృష్టిని భిన్నముగా నుండును. ఒకని మనసునకు యోగ్యముగాఁ దోఁచునదే మఱి యొకని కయోగ్యముగాఁ దోఁచును.

రాజు:—(తనలో) ఏదోవ్యాజమున నాకోరికకు విరుద్ధభావమును బైకిఁ జూపి కార్యసిద్ధి నందుదును. (ప్రకాశముగా) కుమారులు నలువురు యోగ్యులే. రాజ్యమును నాలుగుభాగములుచేసి యొక్కొక్కని కొక్కొక్కభాగ మిచ్చెదను.

కౌస:—(తనలో) రాజ్య మంతయు రామునికే యీయఁదగును.

కై కే:—ఏమి ? ఇదికూడ వాసిష్ఠమతమే యగునా ? ఇట్టి దేదైన ననాప్తవచన మున్న దానికి వాసిష్ఠము ప్రమాణము కాఁజాలదు. మఱియొక కుమారుఁడు కలిగిన మరల సామ్రాజ్యవిభాగమా ?

రాజు:—మఱి రాజ్య మెవ్వరి కీయఁదగును ?

కై కే:—యోగ్యతమునకు.

రాజు:—(తనలో) ఇప్పుడే సర్వము చెప్పుదును. (ప్రకాశముగా, కైకేయితో) మనవివాహకాలమున నేను నీ కిచ్చినవాగ్దానముమాట జ్ఞప్తి యున్నదా ?

కై కే:—అంతయు జ్ఞప్తి యున్నది.

రాజు:—అందుచే భరతుఁడే రాజ్యదాయాప్తుఁడు.

కై కే:—ఏస్త్రీయుఁ బుత్రునకు రాజ్యలాభ మన్న సంతోషింపక పోదు.

కౌస:—(తనలో) ఈమాట వజ్రపాతసదృశము. (మూర్ఛిల్లును)

సుమి:—మహారాజా ! రక్షింపుము. రక్షింపుము. కౌసల్య మూర్ఛిల్లినది.

[రాజు పైబట్టతో విసరును. కైకేయి పుష్కరిణినుండి జలము తెచ్చి ముఖముపైఁ జల్లును. సుమిత్ర కాలుసేతులు రాయును.]

సుమి:— దేవీ! ఊరడిల్లుము.

(కౌసల్యకు స్పృహ వచ్చును.)

రాజు:— దేవీ! ఏల మూర్ఛిల్లితివి?

కౌస:— మధ్యాహ్నవేళ యిటకు వచ్చుటచే నెండదెబ్బ తగిలినది.

రాజు:— (తనలో) రాణిదుఃఖకారణము. కౌశలముకూడ బోధపడినది.

సుమి:— మహారాజా! వివాహకాలమునఁ జేసినప్రతిజ్ఞ ననుసరించి భరతుఁడు రాజగును. జ్యేష్ఠుఁడగుటవలన రాముఁడు రాజగును. వారిరువురకుఁ జెరిసగము రాజ్య మీఁదగును.

రాజు:— నీపుత్త్రులకే మిమ్మందువు?

సుమి:— ఏమియు వలదు.

ఉ. రాముఁడు రాజ్యమేల గుణరత్నము లక్ష్మణుఁడేను గొల్తుమా
భూమిపు, బిడ్డలిర్వురును బొందుదురున్నతసౌఖ్యసంపదల్,
భూమిపుఁ డంపు శత్రుభయముక్త జనపాలనభార మందుచే
మేము శమంబె కోరుదుము మిక్కిలి సేవకు సత్ఫలంబుగన్.

రాజు: కైకే:— ఆహా! దేవి మహాత్యాగము! సంతోషము! లౌల్యరాహిత్యము!

కౌస:— (తనలో) ఈమె యసంతోష మేమియనర్థము కలుగఁజేయునో యెఱుఁగను. (ప్రకాశముగా) సపత్ని యెంత మహానుభావురాలు!

రాజు:—తల్లిగుణములు కొడుకులకు వచ్చునందురు. ఇట్టి యీమెపుత్రులే భ్రాతృసేవాదక్షభూతులగుపుత్రులు. ఈమె ధన్యురాలు.

సుమి:—నాకుఁ గావలసినది లభించినది.

గీ. మానినియుఁ గాదు వ్యవహారమహిత కాదు
వాక్చతుర కాదు సత్యశీలవతియుఁ గాదు
ధన్య యగుకాంత, తలఁప భర్తయు సతులయు
సవతులయు మెప్పు నందెడుసతియె కాని. ౧౮

రాజు:—ఇంతకు రాజ్యయోగ్యుఁ డెవఁడు?

కైకే:—నామాట పాటించునో రాముఁడే రాజ్యార్హుఁడు.

కౌస:—(హర్షముతో) సంతోషము. సంతోషము.

సుమి:—నామనసున నెట్లున్నదో కైకేయి యట్లే పలికినది.

రాజు:—వివాహకాలమున నేను జేసినప్రతిజ్ఞగతి యేమి?

కైకే:—శుభగతియే.

రాజు:—ప్రతిజ్ఞాహాని పాతక మనియే యెల్లరిసంప్రదాయమును.

కైకే:—నీవంటిరాజర్షులకుఁ బ్రతిజ్ఞాహాని యనర్థకరమే.

గీ. స్వసుఖనాశంబుఁ గల్గుపక్షమునఁగూడ
తప్పఁగారాదు ప్రతిన యెంతటివనకు
ఉత్తములమార్గ మిది యగు నూహసేయ
నీవు నామార్గమును వీడఁ బోవుకాదె! ౧౯

కౌస:—(తలలో) అయ్యో! వజ్రపాతము!

రాజు:—నిజమే.

గీ. ప్రజలసౌఖ్యంబుకోసమే ప్రతిన నీవు
దాఁటఁ జూతువు కాని స్వార్థమునఁ గాదు

ప్రతిన తప్పుటవలన లవంబుకూడఁ
బాప మంటదుగద ! మహాభాగ ! నీకు. — ౨౦

మఱియు,

గీ. గుణములలోపల రాముఁడే గుణివరుండు
పాలనార్హుండు శతమన్యుపగిది నతఁడె,
భువనసంరక్షణార్థమై యవతరించె
విష్ణుపగిదిని విఖ్యాతపేరుఁ డతఁడు. ..౨౧

ఒకకార్యమును విచారించునపుడు కారణప్రాధాన్యము నుపేక్షింపరాదు. నన్ను సంతోషపెట్టుటకే నాకుమారునికే రాజ్యదాయ మిత్తు నని నీ వానాఁడు పలికితివి. రామునికి రాజ్యదానము చేయుటవలన నేను ప్రసన్నగుదును. భరతునికి రాజ్య మిచ్చిన నా కెంతయో రాముని కిచ్చిన నంతయే.

రాజు:—భరతుఁడును గుణవంతుఁడు రాజ్యార్హుఁడు కదా !

కైకే:—ఔను. కాని,

గీ. అగుణవంతునికంటె మే లగును సుగుణి
గుణుల గుణవత్తరుఁడు మేలు కోటిరెట్లు
భాస్వరం బయి వెలుఁగు దీపంబు రాత్రి
కాని యది యెంత మధ్యాహ్నభానుముందు. ౨౨

వేయేల ?

క. భరతుఁడు గుణి యగు గుణవ
త్తరుఁ డగు రాముండు కానఁ దగు నతఁడే రా
జ్యరమం గైకొన సుగుణా
భరణుం డతఁ డతనికన్నఁ బరముఁడు కలఁడే ? ౨౩

కౌస:—సంతోషము. సంతోషము.

సుమి:—ఆహా! సపత్ని కైకేయి మహానుభావయు నీతిజ్ఞయు.

రాజు:—మేఘములు గర్జించిననే కాని యమృతవృష్టి కలుగదు.

కైకే:—ఆర్యపుత్రా! ప్రణయసమయమునన్నైన నిర్వ్యాజముగా నేను సత్యమే చెప్పుదును. అదియే ఘనగర్జనము. అయుక్తమున్మాత్ర మెన్నఁడును బలుకను. అదియే యమృతవృష్టి. ఏలన,

గీ. అమృతవర్షము కురిసెడునట్టిమేఘ
మెపుడు వర్తించు సహజమహావృత్తితోడ
దానిమార్గనిరోధంబు తనరె నేని
అశనికూడను వర్షించు నది నిజంబు. ౨౮

రాజు:—(తనలో) ఈమాటవలన నెవ్వరికైనను భయమే కలుగును. ఐనను, ఈదేవి క్షణకోపప్రసాదముల నెఱిఁగిన నాకెట్టి శంకయు లేదు. (ప్రకాశముగా) సమయము వచ్చుసరికి నాయాత్మజులలో నొకఁడు రాజగును. ఆతఁడుత్తమముగా రాజ్యమేలుచుండ సర్వము సర్వసుఖావహము కాఁగలదు.

కైకే:—ఆర్యపుత్రా! ఇప్పుడు మనము నిశ్చయించుకొన్నట్లే జరుగఁగలదు. మన మట్లే తప్పక యొనరింతము.

కౌస:—మహారాజా! సాయంక్రీడల కేఁగినకుమారులు నలువురు జ్యేష్ఠ నగునాకు నమస్కరింప వచ్చియుందురు. వారిని సంభావింప నే నేఁగి వచ్చెదను.

సుమి:—కుమారు లందఱు తల్లు లెల్లరకు సాయాహ్నమున నమ

స్కరింతురు. వారి మనస్సులలో జ్యేష్ఠకనిష్ఠభావము లేనే లేదు.

కైకే:—నేనును బోయి వచ్చెదను.

రాజు:—మంచిది.

రాణులు:—(రాజునకు నమస్కరించి నిష్క్రమింతురు.)

రాజు:—

చ. ముదిమిఁగలంగుమానసము మోదమునందు నొకొక్కవేళ ని
మ్ముదితల వేఱువేఱుగుణముల్ కన; లోకలు భిన్నమానసు
ల్పదుగుర కుండ దొక్కరుచి; వర్తిలు జ్యేష్ఠకు జ్యేష్ఠపుత్త్రుపై
మది; కడు నీర్ష్య కైక; కిటుఁ మాటికి దుఃఖము కల్గు నింటిలో.

క. బహుభార్యాత్వము నరునకు
బహుదుఃఖావహము; ప్రేమభావము సమమై
విహరించుచున్నఁ గానీ
బహుమానసరుజ లొసంగి బాధించు నరున్. ౨౬

ఎవ రక్కడ ?

ప్రతీహారి:—(ప్రవేశించి) మహారాజా ! జయము. ఏమి సెలవు ?

రాజు:—విజయా ! సుమంత్రుని బిలువుము.

ప్రతీ:—చిత్తము. (నిష్క్రమించి సుమంత్రునితోఁ బ్రవేశించి) ఆర్యా ! ఇటు. ఇటు.

సుమం:—మహారాజా ! జయము.

రాజు:—అమాత్యా ! స్వాగతము. రమ్ము. కూర్చుండుము. విజయా ! నీవు బయటి కేఁగి కూర్చుండుము.

ప్రతీ:—చిత్తము. (నిష్క్రమించును.)

సుమం:—ఏమి సెలవు ?

రాజు:—నే నిపుడు కైకేయి మహానుభావత, సుమిత్ర యుల్లోలు
పత తెలిసికొంటిని.

సుమం:—ఎట్లు ?

రాజు:—కైకేయితనయునికే రాజ్య మిచ్చెద నన్న నాప్రతిజ్ఞ యున్నను, ఆమె గుణవత్తరునకు రాజ్య మీఁదగు నన్న న్యాయముచే రామునికే దానిని విడిచిపెట్టినది. ఇఁక, సుమిత్ర తనసుతులతో రామసేవామగ్నతఁ గోరు కొన్నది. వీరిమహానుభావత పరమాశ్చర్యకరముగదా!

సుమం:—ఔను. కాని,

ఉ. భావిసుఖావహం బయినభంగి మనీషులు మంచిచేష్టలన్
భావనచేసి న్యాయముగ వర్తిలి కాంతురు సర్వసౌఖ్యముల్;
దైవవశంబు సర్వమును దాఁటఁగఁజాలరు దాని నెవ్వరున్;
జీవి పురాకృతంపుఫల సిద్ధి నిటన్ గుడుచున్ విధిక్రియన్.

అందుచే,

ఉ. పుత్త్రులు నల్వురున్ సుగుణపుంజము లద్భుతశూరశేఖరుల్
గాత్రము లన్నవే అయినఁ గాని మనస్సులు చూడ నొక్క టే
మాత్రము ప్రేమభంగమునుమాత్రము కల్గఁగనీదు రాజ్యమీ
పుత్త్రుల; కెంతవాఁడి యగుముల్లును నీళులఁ జిల్లుపుచ్చునే ?

కనుక, నీవు రాజ్యప్రదానచింతను విడువుము. రాముఁడు రాజైనచో రాఁజులుమాత్రము సంతసింపరా ?

రాజు:—నిజము. నా కిఁక నెట్టిచింతయును లేదు.

సుమం:—వసిష్ఠభగవాను లిట్లు విన్నవించిరి.

రాజు:—గురుభగవాను లే మని సెలవిచ్చిరి ?

సుమం:—ఇట్లని. కుమారులు

ఉ. వేదము లెల్ల నేర్చిరి వివేకమునన్ శుభవిద్య లెల్ల స
త్యాదృతి నభ్యసించిరి కుశాగ్రమతుల్ మఱి వీరి కెల్ల నీ
మీఁదట నస్త్రశస్త్రము లమేయనృపోచితసర్వధర్మముల్
మోదము మీఱ నేర్పవిధమున్ ప్రపచంద్రమ! చూడఁగాఁదగున్.

విదూ:—(తొందరగాఁ బ్రవేశించి) ఓయీ వయస్యా! ప్రతీహారులు నన్ను రానీయకపోఁగా వారితోఁ బోరాడి నీ కొకప్రియ విశేషము చెప్పుటకై యిట వచ్చిపడితిని.

రాజు:—ఏమి ప్రియము?

విదూ:—రామునకు రాజ్యాభిషేక మగు నని కౌసల్య నా కెన్నో మోదకములు పెట్టెద నని వాగ్దానము చేసినది. ఈసంగతి యంతయు నీకు నివేదించుటవలన నాహృదయభారము తగ్గి తేలిక యైనది.

రాజు:—ప్రతిదినము నీవు మోదకములే తిందువులే. రాముఁడు రాజైనను భరతుఁడు రాజైనను నీకు మోదకములకు మాత్రము లోటుండదు. చింతిల్లకు.

విదూ:—ఏల చింతింపను? రాముఁడు రాజైనచో, కౌసల్యాదేవి బహుమోదకములచే నన్నుఁ బ్రీతునిఁ జేయును. భరతుఁడు రాజైనచో కైకేయి బహుతరమోదకములచే నన్ను సంతుష్టునిఁ జేయును.

సుమం:—వసిష్ఠభగవానులతో నేమని నివేదింతును?

విదూ:—(జనాంతికముగా) అమాత్యా! నావయస్యునికిఁ గోపము తెప్పించుటకై నేను గొంచెము మాటాడెదను. నీ వేమియుననుకొనకుము. (రాజుతో) నేను మోదకముల తో సంతోషింపనంతవఱకు నభిషేక విధి ప్రారంభింప

రాదని వసిష్ఠులతోఁ జెప్పెదను.

రాజు:—సుమంత్రా! భగవానులు గురుపాదులు నగువసిష్ఠులతో శీఘ్రమే తాము సెలవిచ్చినప్రకారమే చేయుదు నని నివేదించి రమ్ము.

విదూ:—(అపవారించి) వయస్యునకు క్షోభ కలిగింతును. (ప్రకాశము) నాకుఁ దెలియనివిషయము మీరు మాటాడుచున్నారు. నాకు మీరు చెప్పరు. ఐనను, నా కిప్పు డది తెలిసినది. భరతుని కీయవలసినరాజ్యము నాచెలికాఁడు రాముని కిచ్చుచున్నాఁడు. నే నంతఃపురమున రాణులకు బయట నన్నదమ్ములకుఁ బోరాటము కల్పింతును. లేనిచో, ప్రాయోపవేశము చేయుదు నని యందఱను భయపెట్టెదను.

రాజు:—అమాత్యా ! నేను జెప్పినది భగవానులతోఁ జెప్పిరమ్ము.

సుమం:—చిత్తము. (నిష్క్రమించును.)

విదూ:—ఈకపటపండితుఁ డిప్పటికి వెళ్ళినాఁడు.

రాజు:—(తనలో) చపలుఁ డగునీవటువు కలహప్రియుఁడు. ఆకలహమువలనిఫల మెఱుంగఁడు. మూర్ఖజనిత మైనను, ఇట్టిక్షోభము శంకను గలిగించును. కానిమ్ము. (ప్రకాశముగా) సఖా ! సుందరకా ! ఏదోకథాప్రసంగమున రాజ్యదాయవిచారము కలిగినది. ఈప్రసంగమున నెవ్వరి మాటలుకూడ యథార్థములు కావుసుమా !

సీ. అధికవిప్లవకర మైనయానృపత్వ
మేడ ? సుకుమారచేతస్కు లీమదీయ
పుత్త్రు లేడ ? పరిహాసపూర్వకోక్తి
యిదియె సత్యంబెకా మది నెంచకయ్య !

విదూ:—మీరు నిత్యము నిట్లే మాటాడుకొనుచుందురా ?

[తెరలో]

ఉ. శక్రపురిన్ జయించి సురసంఘముఁ ద్రోలి నలంచి వీరరా
ట్చక్రము రావణాసురుఁడు శాంతిగడించియు నేఁడు వెండియు
న్విక్రమశీలబాలరఘువీరకథన్ విని శంకమానఁడై
వక్రగతిన్ నిగూఢుఁ డయి వచ్చెడి నేమఱ కుండుఁ డెల్లరున్.

రాజు:—(విని) ఓహో ! ప్రధానచారుఁ డగుసుబుద్ధిస్వనమువలె నున్నది. సుందరకా ! నీవు పోయి నావచనముగా నాతనితో "నీమాట వింటిమి. సంగతి తెలిసిన" దని చెప్పి రమ్ము.

విదూ:—బాబో ! నేను వెళ్ళను. దారిలో నేనే రాముఁడ ననుకొని యీరావణుఁడు నన్ను మ్రింగివేయఁగలఁడు.

రాజు:—సరే. నేనే వెళ్ళెదను. (తనలో)

క. ఒకశంక నివృత్తం బిం
కొక టుద్భూతంబు నయ్యె నొకదుఃఖమె నా
కకటా ! కొడుకులు లేమిన్
వికలత హృది కయ్యె నిపుడు వేయివిధములన్. ౩౨

ఆహా !

చ. సుతులు జనించినారు వరశూరు లటంచును వ్యాప్తి చెందె ది
క్తతి నపుడే విరోధులును దావపులన్ దలయెత్తఁ జొచ్చి రీ
సుతు లతిబాలకుల్; తలఁప శూరుఁడ నయ్యును వృద్ధునైతి నే
నతిబలవంతు లుద్ధతు లహా! యరు, లింక శరణ్య మీశుఁడే.

(నిష్క్రమించును.)

ఇది ద్వితీయాంకము.

విష్కంభము ii

[సరయూతీరమునఁ గ్రీడించుచు నిరువురు గంధర్వులు ప్రవేశింతురు.]

చిత్రకేతువు:—చిత్రపదా! నీ వీజలముల స్నానము చేయు నుత్సాహమున నీకర్తవ్యమునే మఱచితివి. మన మిట కేల వచ్చితిమో తెలియునా?

చిత్రపదుఁడు:—తెలియ కేమి? అంతయుఁ దెలియును. రావణుఁడు రామునకు కీడైన నపిష్టము చేయుటకు నిగూఢరూపచ్ఛాయతో నయోధ్యాప్రాసాదసమీపమునఁ దిరుగుచున్నాఁడు. మహేంద్రునియాజ్ఞను రాముని సంరక్షింపఁ గుబేరునిపంపున మన మిటకు వచ్చినారము. కాని,

చ. హిమగిరినీరసౌఖ్య మొకయింతయు దీటగునే? తలంప ను
త్తమదివిజాపగాజలము తక్కినదివ్యజలంబు లింతయుఁ
సమమగునే కనుంగొనఁ బ్రశస్తము నౌ సరయూజలంబుతో?
సుమహిత మిందు స్నాన మొటుచూచిన నాకు మహాసుఖంబగున్. (౧)

చిత్రకే:—హిమాధికప్రదేశమునుండియే మనము వచ్చితిమి కదా! పోనిమ్ము. ఇది నిదాఘకాల మగుటచే స్నానము సుఖావహమే. మఱి స్వామినియోగము మఱవఁ గూడదుకదా!

చిత్రప:—ఔను. కాని,

గీ. నిఖిలఋతువుల బహురమణీయ మగుచు
సకలదేవర్షి మనుజప్రశంసితంబు
నైనసరయూజలంబు పాపౌఘ మడఁచు
గ్రీష్మశిశిరర్తువుల సమక్షేమ మొసఁగు. ౨

ఏమైనను నేను స్వామినియోగము మఱవ లేదు. అపరాహ్ణమునకుఁ బూర్వమే రావణుఁడెట్లయోధ్యకు రాఁగలఁడు? పుష్పకమున వచ్చిన నంతత్వరగా రాలేఁడుకదా! ఇంతకు సింద్రాదులే తమభార్యలను రక్షించుకొనుటకైనను శక్తులు కానపుడు రావణుని బారినుండి రాముని రక్షింప మనకు సాధ్యమా? అట్లని ప్రభునియోగ ముపేక్షింతు మని కాదు. గూఢదేహులమై యీప్రాసాదోపవనమున నిరీక్షింతము. రమ్ము.

చిత్రకే:—అట్లనకుము. రావణుఁడు దశరథునికంటెబలవత్తరుఁడే యైననాఁ డేల యాతఁడు నిగూఢముగా వచ్చును? కావున, రామునికుపద్రవము సంభవించు నని తోఁచిన వెంటనే మనము దశరథునకుఁ దెలుపుదము.

చిత్రపః:—కాదు. కాదు. రావణుఁ డద్వితీయబలవంతుఁడు. మఱి,

క. చోరులు శత్రులును వ్యసనులు
ధారుణి బలవంతు లయ్యుఁ దగ నిర్భయులై
యూరక ప్రత్యక్షముగాఁ
గ్రూరము లగుపను లొనర్పఁ గోరరు మదిలన్. 3

చిత్రకే:—ఏమైనను, అనిష్టప్రతీకారోపాయ మున్నదికదా!

చిత్రపః:—సరే. రమ్ము. పోదము.

(నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

యజ్ఞఫలము

తృతీయాంకము

[ఆకాశమార్గమున రావణుఁడు ప్రవేశించును]

రావ:—ఆహా!

గీ. పుట్టినాఁడఁ బులస్త్యర్షి పూతకులము
నందు, నందితి శివుఁ గొల్చి యమితబలము,
సురల గెల్చితిఁ, గొంటి దాసులుగ నసుర
వల్లభుల, దుర్జయుండ రావణుఁడ నేను. ౧

గీ. సాటిలేనిది కులబలశౌర్యగరిమ
దుర్గమై యొప్పు నబ్ధియందునఁ బురంబు
ఇట్టిభాగ్యాన్వితునకు నా కిలను బరుల
పౌరుషాటోపములు సైఁపవచ్చు నెట్లు? ౨

సీ. దశరథావనిపాలుతనయుఁ డంట ప్రసిద్ధ
రామాభిధానవిభ్రాజితుఁ డఁట
శస్త్రాస్త్రవిదుఁ డంట సమరంబునందు సు
రాసురగణముల నైన లీల
గెలువ శక్తుం డఁట తలఁప బాలుం డైన
నుత్తమయోధుఁడై యొప్పు నంట
అని జనంబులు చెప్ప విని యాతఁ డెట్టిఁడో
చూడంగ వచ్చితిఁ జోద్యము గను

గీ. అట్టిమిత్రుఁడు బలవంతుఁ డైనవాఁడు
నరులలోపలఁ గలఁడె ? ఉన్నట్టియెడల
నతని జీవింపనిత్తునే యవనిపయిని ?
అంతకొఱకైనదే మదీయాగమంబు. 3

చ. ధారకైనయేని నాకోరులతోడను నేల క్షణంబులోన నా
పురమున కాదు రాత్రిఁగొనిపోవుదు నక్కడఁ జూడఁగందునా
నరునిబలంబుపెక్కువ యనంతర మాతనిబంధనంబొ దు
ష్కరవధయో విమోక్షమొ తగన్నచరింతు యథోచితంబుగన్.

మంత్రప్రభావమున నిగూఢరూపముతో నాకాశజల పర్వతతుల్యగతిని జరించునారథము నెవ్వరును గనఁ జాలరు. దీని నిట నుంచి ప్రాసాదమున కేఁగి చూచెదను. (నిష్క్రమించును)

[అంత విశ్వామిత్రుఁడు ప్రవేశించును]

విశ్వా:—

మ. మును శ్రీరాఘవార్చిత తేజమందఁబరమా మోఘాస్త్రసంఘాతము
ల్నను నిర్జింపఁగఁజాలవయ్యె నిపుడు బ్రహ్మాస్త్రముంగాంచ దే
వనికాయాస్త్రము లెల్లవమ్మె యగు నాపై నట్టిన న్బల్మిరీ
హుని దేజస్విని శక్తియుక్తుఁ గననా నాక్లో జగంబందునన్?

గీ. అతిబలోపేతజృంభకాస్త్రాదు లెల్ల
నెవ్వఁ డెఱుఁగును ధరణిలో నేను గాక
ఈమహాస్త్రమ్ములను గ్రహియించుసుకృతి
యబ్బునే యని చింతింతు నహరహంబు. ౬

చ. అతిబలవీరుఁడున్ దశరథాత్మజుఁడున్ రఘురామనాముఁ డు
న్నతబలశాలి యయ్యును ఘనం బగుదాంతి గలాఁ డటన్న సం

గతి విని వచ్చినాఁడఁ గనఁగా నతనిఁ గని సత్యమేని స
న్నుతముగ నొజ్జనై యొసఁగుదు రఘురాముని కస్త్రవిద్యలన్.

క. ధరణీపతి వృద్ధుండు ద
శరథుని యాచించి రామచంద్రుని గొని పం
బరమున నాశ్రమపదమున
కరిగి మదీప్సితఫలంబు నందెదఁ బిదపన్.

(ముందు చూచి) ఏమి ? రావణుఁ డాకాశమునుండి భూమికి దిగుచున్నాఁడు! చూచుచుండఁగనే వీఁడు తిరస్కరిణీవిద్యవలన రథముతోఁ గూడ నంతర్హితుఁ డయ్యెను. తిరస్కరిణీపిహితుఁ డయ్యును వీఁడు నాకుఁ గాన్పించుచునే యున్నాఁడు. కానిమ్ము. ఈదుర్మార్గుఁ డేమి చేయఁ దలఁచెనో నిగూఢదేహుఁడనై కనిపెట్టెదను. వీఁడు వచ్చినచోటఁ దప్పక యకార్యమొనరించి తీరును.

రావణుఁడు:—(ప్రవేశించి) ఏమి ? విశ్వామిత్రుఁ డిటకు వచ్చినాఁడే ! ఈతఁడు బ్రహ్మక్షత్త్రతేజోరాశి. నాకోరిక నీతఁడు సాగనీయఁడు. నేనును దుర్ధర్షుఁడ నగురావణుఁడ నగుటచే నతఁడు నా కేయనిష్టమును జేయలేఁడు. నావలె నీతఁడును నిగూఢరూపముననే చరించుచున్నాఁడు. కానిమ్ము. నాప్రభావమున నీతని నిగూఢరూపమును జూడఁగలను.

విశ్వామిత్రరావణులు:—(ఎవరికి వారే తమలో) నేను జూచుచున్నాను. కాని, యీతఁడు నన్నుఁ జూచుట లేదు. (ముందు చూచి) వసిష్ఠునితోఁ గూడి కుమారు లిటకే వచ్చు

చున్నారు.

[అంత వసిష్ఠుఁడు నలుపురుకుమారులు ప్రవేశింతురు]

వసి:—దీర్ఘాయుష్మంతు లగుకుమారులారా!

చ. కఱపితి నెల్లవిద్యలను గంటిరి మీరు యథాక్రమంబుగా
మఱపొకయింత లేక శ్రుతమాత్రముచే గ్రహియించియాత్మలన్
స్థిరపడునట్లు చేసికొని; చెందెను ధన్యత మద్గురుత్వముల్;
బరమసుఖప్రదంబు లగుఁ బాత్రుల కిచ్చెడు జ్ఞానసంపదల్.

క. దీపం బెట్టులు వేఱగు
దీపంబుల వెలుఁగఁ జేయఁ దేజము సమమౌ
నాపగిదిని నస్మద్వి
ద్యాపరిణతి నాసమాను లైతిరి మీరున్. ౧౦

ఉ. నేను జనించి యున్నయల నీరజసూతికులంబురత్నముల్
పూనివతంసులై పరమమాన్యత నేర్పఁగ సర్వశాస్త్రముల్
వాసిఁ గ్రమమ్మునం బడసిపాత్రులు మీకు నొసంగినాఁడ నో
శ్రీనిధులార! రాజ్యసుఖసిద్ధి యొసంగును మీకు దీనిచే. ౧౧

కుమారులు:—భగవానునివలన సంస్కారము లందినమాకు సర్వము శుభోదర్కమగుట కెట్టిసందియమును లేదు. గురూత్తమా! ఇపుడు నగరబహిర్భాగమున కేఁగి మేము నేర్చినరీతి ధనుర్వేదవిద్యాభ్యాసము చేయఁ గుతూహలపడుచున్నాము. అనుగ్రహింతురుగాక!

వసి:—నేఁడు పాడ్యమి. కాన, అనధ్యాయము. మీయిష్టము వచ్చినచోటి కేఁగుఁడు. నే ననధ్యాయకరణీయముల నిర్వర్తింతును. (నిష్క్రమింతురు)

రాము:—వత్సలారా! మనము పురమునకు దక్షిణముగా,

బోయి ధనుర్వస్త్రలాఘవము నేర్చినరీతి నభ్యసింతము.

భర:—పార్శ్వానుచరులను పిలువనంపనా?

రాము:—వలదు. నలువుర ముంటిమిగదా! అడవి కేఁగ నలవాటు లేనివారము గాము. ఇంతను దూరముగాఁ బోవుట లేదు. చేతులలో నస్త్రము లున్నవి. క్షత్రియోత్తము లాత్మశౌర్యసంరక్షితులుగదా!

(అందఱు నడతురు.)

శత్రు:—(తెరవంకఁ జూచి) మనము చెప్పకపోయినను మనగమనము నెఱిఁగి పార్శ్వానుచరులు మనవెంట నంటి వచ్చుచున్నారు.

లక్ష్మ:—(తెర కెదురై) ఓపార్శ్వానుచరులారా! మేము ధనుర్లాఘవ మభ్యసించుటకై వెళ్ళుచున్నాము. మీరు శ్రమపడి రా నక్కఱ లేదు. వచ్చినదారినే పొండు.

(అందఱు నడతురు)

రాము:—(వెనుదిరిగి చూచి) వీరు వెనుక కేఁగుట లేదు.

లక్ష్మ:—మీరు వెనుకకుఁ బోకుంటో నేను బాణము వేసి మిమ్ము వెనుకకుఁ బంపుదును. (విల్లెక్కుడును)

రాము:—వత్సా! శాంతింపుము. వీరు స్నిగ్ధహృదయు లగు నాత్మీయులు. దండనార్హులు కారు. (తెర కెదురై) అనుచరులారా! మీరు వచ్చినచో నాపై నొట్టు. రావలదు. మరలి పొండు.

భర:—అందఱును వెనుదిరిగి పోయినారు.

(అందఱును వడల నడతురు)

రాము:—ఇంకను నడచి యేమిలాభము? ఇక్కడనే మన ధాను

ష్కృతి నారంభింతము. (అందఱు కూర్చుందురు)

శత్రు:—(లేచి)

మ. అదిగో! పిప్పలవృక్షమందుఁ జలపత్రావళిన్ సమస్తంబు నా
పొదిలో నున్న మహాశరంబొకటి సొంపుల్లుల్లు మంబోయి ఛి
ద్రదశన్ బొందఁగఁ జేసి తత్క్షణమె చేరన్ వచ్చు స్వస్థాన మి
య్యది మీ రందఱుఁ గన్గొనుండు పరమాశ్చర్యంబు రేఁ
కెత్తఁగన్. ౧౨

(బాణము విడుచును)

రామభరతలక్ష్మణులు:—సెబాస్! వత్సా! సెబాస్!

భర:—దీర్ఘాయుష్మంతుఁడవు శత్రువిమర్దను నగు శత్రుఘ్నుఁడవు చేసి నట్లే నే నింకొకవృక్షము నాకులఁ జేసెదను. (బాణ మేయును.)

రాము:—సెబాస్! వత్సా! సెబాస్! నీధను ర్వేదకౌశలముఁ జక్కఁగాఁ జూపితివి.

లక్ష్మ:—(విల్లెక్కిడి)

శా. ఆమూలంబుగ వృక్షముం బెఱికి యత్యాశ్చర్యదం బౌచు నె
న్నో మిక్కిల్ ల్పొనరించి వైచి దిశలందుం జిమ్ము నాయమ్ము మీ
రామార్గంబునఁ జూచు మండుఁడిదె నాయస్త్రమ్ము వెన్వెంటనే
భీమప్రౌఢిఁ గృతస్వకార్య మయి వేవేఁ జేరు మత్తూణముల్.

మఱియు నింకొకబాణమున,

క. చలియించుచున్న మోదుగు
నిలువుదు స్తబ్ధంబు గాఁగ; నెఱి నున్నతమై
వెలసినపాషాణమ్మును
జలియింప నొనర్తుఁ దృణముచందము కాఁగన్. ౧౪

(బాణములు విడుచును) ఆహా ! చూచితిరా ?

క. వనమునఁ బక్షిగణంబులు
ఘనమృగసంఘములు భీతిఁ గని దాఁచవుల౯
జనుచున్నవి గతిలాఘవ
మునఁ గడురమణీయరూపములఁ గన్పడుచున్. ౧౫

భరతశత్రుఘ్నులు:—ఆహా ! మహాభాగుని బాణక్షేపకౌశల మద్వితీయము.

రాము:— సెబాస్ ! వత్సా ! సెబాస్ !

గీ. కడఁగి దైవతదానవగణము నేని
నిర్భయమ్ముగ గెల్చెద నిన్నుఁ గూడి
యెపుడు నాచెంత వసియింతు వేని నీవు
భీమమృత్యువు నేని నిర్భీతి నడఁతు. ౧౬

లక్ష్మణభరతశత్రుఘ్నులు:—(బద్ధాంజలులై) ఆర్యా ! నీవు జ్యేష్ఠుఁడవు. గుణాకరుఁడవు.

చ. గుణములచేత విద్య ననుకూలత మాన్యత మించునట్టి స
ద్గుణములు నైజశక్తులను దాఁచి నుతింతు రలంతివారల౯

రాము:—
గుణములె శ్లాఘ్యముల్ వయసు గొప్పకు రాదిల వృద్ధవృద్ధము
ల్మిణుఁగురు లార్పఁజాలునె తమిస్రము బాలఖగుండు లేనిచో?

భరతలక్ష్మణశత్రుఘ్నులు:—

క. నయమున విద్యల గుణమున
వయసునఁ దలపోయ నీవె వరణీయుఁడవై
ప్రియ మొనరింతువు మాలోఁ

రాము:— ప్రియబంధువులందు గుణమె వెదకుదురు జనుల్.

భరతలక్ష్మణశత్రుఘ్నులు:—ఆర్యా! మాధనుర్వేదకౌశలమును జూచి మమ్ము స్తుతించితివి. నీనిపుణతను మేము కనఁ గోరుదుము.

రాము:—వత్సలారా!

గీ. జన్మసంస్కారవిద్యల సముల మైన
మనకు నెట్టులు గుణభేద మొనయుఁ జూడ

భర:— జన్మమాత్రంబుచేతను సమము లైన
ముత్యముల నత్తిగుల్లలు పోలునొక్కొ? ౧౯

రాము:—సరే. మీరు నియోగింప నేను జూప నేను నెట్లు? (తనలో) వత్సలప్రయోగనైపుణ్యమునే నేనును జూపుదును. అంతకంటె నెక్కువ చూపిన వారిని జిన్నఁబుచ్చిన ట్లగును. (ప్రకాశముగా) వత్సా! శత్రుఘ్నా! నీవు చూపిన ధనుర్వేదకౌశలము నేను జూప యత్నింతును. (విల్లెక్కిడును.)

విశ్వామిత్రరావణులు:—(దూరమునఁ బ్రవేశించి ఎవరికి వారే తమలో) ఇతఁడే రాముఁడు.

చ. పరమవిశాలముల్ దృఢము వక్షము; నున్నత మంసభాగము
న్సురుచిరమాముఖాంబుజము; శోభిత మానయనద్వయంబు; భీ
కర మరికోటికెన్న విలుకానితనం బది; దేవదేవుఁ డౌ
హరియవతార మీతఁ డని యంటకు సంశయ మున్నె
చూడఁగన్. ౨౦

నే నీనిగూఢదేహముతోడనే నాబాణములతో రామబాణములు లక్ష్యమును జేరుటకుఁ బూర్వమే నడుమ ఖండించెదను. అతఁడు కోపిష్ఠియై యేమి చేయునో

చూచెదను. ఆతని పరాక్రమ మంతయు నపుడు పొడ
కట్టును.

గీ. అతనియస్త్రపరంపర నడఁచినంతఁ
జండరూపముఁ గొని తనశక్తిఁ జూపుఁ
గ్రీడయం దున్న శయనించి నీడ నున్న
సింహ మాత్మీయసౌగుణశ్రీలఁ గనునె? ౧౨

(నిష్క్రమింతురు.)

రాము:—వత్సలారా! చూడుఁడు. ఆవృక్షపత్రము లన్నిటి
నొక్కమాఱుగాఁ జిల్లులుపుచ్చెదను. (బాణము విడిచి
యాశ్చర్యముతో) ఏమి? గుఱి తప్పి నాబాణము మార్గ
మధ్యమున రెండుముక్కలై పడిపోయినది!

శత్రు:—అది ప్రాఁతబాణ మేమో?

లక్ష్మ:—అది విఱిగినబాణ మేమో?

భర:—దారిలో సుడిగాలి కల దేమో?

రాము:—కానిండు. మరల బాణము విడుతును. (శరము సంధిం
చును)

విశ్వామిత్రరావణులు:—(దూరమునఁ బ్రవేశించి తమలో) ఏమి! ఈ
రాముఁడు.

చ. అమలశరాపరాధజనితామితచండరుషావశాత్ముఁడై
కమలదళోపమంబు లగుకన్నుల నగ్నికణాళి రాల్చుచుఁ
శమము దొఱంగి భీకరదశఁ గనుపట్టెడుసింహ మట్లు లో
కములకు భీతిగొల్పు నధికంబుగ; వీని కసాధ్య మున్నదే?

రాము:—(మరల బాణము విడుచును)

అందఱు:—మరల నష్టమైనదే!

రాము:- కానండు. మహారాజు నా కనుగ్రహించినవాయవ్యా
స్త్రమును సమంత్రకముగా విడిచి యావృక్షమును వ్రేళ్ల
తోఁ బెకలించి దూరముగాఁ బాఱవైచెదను.

విశ్వామిత్రరావణులు:_(దూరముగాఁ బ్రవేశించి) ఏమి! వాయ
వ్యాస్త్రమునుగూడ భగ్నము చేయవలయునా? అట్లే
యగుఁ గాక! (నిష్క్రమింతురు)

రాము:_(ధ్యానించి బాణము విడుచును)

అందఱు:_ఏమి! ఆచెట్టుఆకైనను గదలలేదే?

రాము:_సీ. ఔర! యీమారుతాస్త్రరహస్యములను
మున్ను పరికించి యుండ లే దెన్నిమాఱ్లు!
వ్యర్థ మయ్యెను నేఁటి కిప్పగిది దైవ
వంచితుం డగువానిప్రాభవమువోలె. _౨౩

(కోపముతో) కానిమ్ము.

మ. అమితం బైనప్రకాశముం గలుగునీయాగ్నేయదివ్యాస్త్రము
త్తమభంగిన్ దనుసంతతిన్ క్షణములో దగ్ధంబుగాఁ జేయుతన్
విమలాస్త్రం బెఱు చేయలేనియెడలన్ వెన్వెంటనే నాశరీ
రము భస్మం బొనరించు నైపుఁజన దస్త్రవ్యర్థభావం బికన్.

రావణుఁడు:_ దూరముగాఁ బ్రవేశించి తనలో) ఆహా!

గీ. సింహమును రెచ్చఁగొట్టి వీక్షించి యుంటి
నరసినాఁడ ధనుష్పాణి హాను మహోగ్రు
స్వాంతము చలించి యెఱుఁగ దీసజ్జశస్త్రి
బాలకుని జూడ గడగడ వడఁకు పుట్టె. _౨౪

ఆగ్నేయాస్త్రప్రయోగోపసంహారములు నాకుఁ దెలిసి
నవే యైనను నాయుత్సాహము పోయి క్రుద్ధుఁ డగు

రాముని జూచినకొలఁది నేలొకో భీతి జనించు చున్నది. కావున, నేనిట నుండి వేగముగాఁ బోవుదును. ఆహా! రావణుఁడు భయపడుట కిదియే మొదటిసారి.

(నిష్క్రమించును.)

విశ్వా:—(దూరముగాఁ బ్రవేశించి తనలో) ఆహా!

చ. పరబల మెంతయైన ననుఁ బాయదు సాహస మెన్నఁ డుస్మహో
ద్ధురత గృహీతచాపుఁడయి దుర్భ్రమసత్కృతి నొప్పుచున్నయీ
ఖరశరవంశమండనుని గాంచినయంతన చిత్త మేలొకో
గురుతరభీతిచేత వడఁకున్ బరమాద్భుతభంగిఁ జూడఁగన్.

గీ. అతివిఘాతుకములు పరశ్శతము లగుచుఁ
గలవు వనముల మృగములు; కాని, యందు
సింహ మొక్కటియే వనసీమ నెల్లఁ
గలఁచివైచును గాదె విక్రమము మెఱయ. ౭౮

ఆహా! తులితాఖిలదేవాసురబలుఁడు, అవిగణితనిఖిల భువనవిదారణక్షమ మహాశైలభిద్భిదురశక్తి మహాప్రభావుఁడు, విదితసర్వాస్త్రసంహారుఁడు, మహాద్రివలె నకంప్యశరీరుఁడు నగురావణుఁడే కుపితుఁ డగురాముని జూచి భయకంపితుఁడై మృగేంద్రదర్శనమాత్రమున మృత్యుశంకఁ బాఱిపోవులేడివలెఁ బాఱిపోయెను! ఈదురాత్ముఁడు రథ మెక్కి లంకాపురి కేఁగునపుడు నేను వీని ననుసరించెదను. లేనిచో సీతఁ జిక్కి యే యనిష్టము చేసిపోవునో. (నిష్క్రమించును)

రాము:—(కొంతసేపు ధ్యానించి బాణము విడువఁ జూచును.)

భర:—ఆర్యా! శాంతింపుము. ఈవృక్షములు దగ్ధమగుటవలన

నిరపరాధము లగుపక్షిగణములు నిరావాసములై బాధ
పడఁగలవు.

చ. వలదు శరంబు నిట్లు విడువన్ గృపసేయుము పక్షు లెల్లఁ బి
ప్పలతరు వాశ్రయించి తమభార్యల బిడ్డలఁ గూడియుండెఁ జం
చలములు దుర్బలమ్ము లగుచక్కనిపక్షుల నేను లేడ ను
జ్జ్వల మగునీశరం బశనిపాతసదృక్ష మదేడ? చూడఁగన్.

క. శరణాగతరక్షణ మరి
హరణం బపరాధిశిక్ష నాయుధములతో
నరపతు లొనరించెద రీ
శరమును నుపసంహరింపు చయ్యన నార్యా! ౨౯

రాము:—(లజ్జితునివలె) సరే. ఈవాయవ్యాస్త్రమున నామహా
శిలను దూరముగాఁ బాఱవేయించెదను.

(అస్త్రము విడుచును.)

లక్ష్మ:—ఇదియు వ్యర్థ మయ్యెను.

రాము:—ఈయస్త్రము సాపరాధము.

భర:—(ముందు చూచి) ఆర్యా!

క. అపరాధం బొనరించియు
నుపకారక మయ్యె నస్త్ర మొగి స్త్రీహననా
త్యపచారము నీయెడఁ దా
నుపకల్పింపకయె కాచె నోగుణమూర్తీ! 30

రాము:—(చూచి) ఔనౌను. వారు మన ప్రాసాదచేటికలు.
ఓహో! మంథరకూడ.

[అంతఁ జేటికలు మంథర ప్రవేశింతురు.]

మంథ:—ఓసీ! ఒడలు మఱచి తిరుగుచున్నమీరు దాసికలే

యగుదురు. మీరు మీపనులు విడిచి యిట నాట
లాడుదు రేల? వచ్చినదారిని బొండు.

మధురిక:—మేము చేయవలసినపని యంతయుఁ జేసితిమి. మఱి
కొందఱు పరిచారిక లట నున్నారు. మేము విశ్రాంతి
తీసికొనుచున్నాము. మరల మాపని వచ్చినప్పుడు
పోయెదము.

మంథ:—మూర్ఖురాలా! ఎప్పు డేపని చేయవలసియుండునో నీ
కేమి తెలియును? రాణులసేవ యన్న మాట లను
కొంటిరా? పొండు.

చతురిక:—నీవును దాసివే. మేము మా రాణులపను లెట్లు
చేయుదుమో కైకేయిపనులు నీవు నట్లు చేయుదువు.

మంథ:—కాదు. కాదు. కైకేయి నాపుత్త్రిక. సఖీసమాన. నే
నామెను సేవింపను. సాయముమాత్రము చేయుదును.
మీరు గర్భదాసు లిది యెఱుఁగరు.

చతు:—ఏమే! నీవు దాసివి కావా? దాసివలెనే మాటాడితివే?

మంథ:—(కోపముతో) ఊఁ? దాసివలెనే మాటాడితినా? నన్ను
మా రాణి తల్లిగాఁ బరమదైవముగాఁ జూచును.

మధు:—దాస్యము చేయుచున్నను నీవు నీరాణికిఁ దల్లివైనవో
మేమును మా రాణులకుఁ దల్లులమే.

మంథ:—నేను సంస్కృతము మాటాడుదును.

చతు:—నీవు సంస్కృతము మాటాడినను నీయవినయము,
ఆత్మస్తుతి, నీదాసీత్వమును జెప్పక చెప్పుచున్నవి.
గొప్పవా రెప్పుడును దమ్ముఁదాము పొగడుకొనరు.

మంథ:—మీ రిక్కడనుండి లేచి పొండు. మిమ్ము నాజ్ఞాపించు

చున్నాను.

అందఱు:—(నవ్వి) ఏమి! దాసికిఁ గూడ నాజ్ఞాపించు నధికారమే?

మంథ:—(తనలో) ఈగర్భదాసులు న న్నవమానించినారు. నాయవమానము కైకేయి యవమానమే. భరతుఁడు దగ్గఱలోనే యున్నాఁడు. రామానురక్తలగునీగర్భదాసికలు వాని కేమియప్రియము చేయుదురో? రహస్యముగా నుండి కనిపెట్టెదను. (ప్రకాశముగా) నేను వెళ్ళి మీయవినయము రాణులతోఁ జెప్పి యేమిచేయించెదనో చూడుఁడు. (నిష్క్రమించును)

చతు:—కురూపమునకుఁ దగినట్లు కుటిలభావము కలమంథర పోయినది. ఇట్టికురూపముతో నున్నను, ఈమె గర్వమునకు మితి లేదు. నిజముగా నందగత్తెయే యైన నింకె ట్లుండునో? మధురికా! గౌరీమండపము నలంకరించుటకై పిప్పలపలాశపల్లవములఁ గోయుటకు మన మిచటికి వచ్చితిమి. రాజప్రాసాదము చాల దూరమున నున్నది. త్వరగాఁ గోసికొని పోవుదము రండు.

పుష్పలతిక:—(పైకిఁ జూచి) ఈరావియాకు లన్నియుఁ జిల్లులు పడినవే! ఎందుచేతనో? (అందఱాశ్చర్యముతోఁ జూచెదరు)

చతు:—(భూమిపైఁ జూచి) ఇక్కడఁ జాలఁ గాలిగుర్తులు కలవు. గుఱ్ఱపుడెక్కలగుర్తులు రథచక్రములగుర్తులు కనఁబడుచున్నవి.

మధు:—రథములోఁ గుమారు లిటకు వచ్చి రనుకొందును.

చతు:—ఈగుర్తులే కాని రథము వచ్చివెళ్ళినజాడ లేదే!

మధు:—ఏదో భూతము వచ్చిన ట్లున్నది. భయ మగుచున్నది

పోదము. రండు. (నిష్క్రమింతురు)

భర:—భయపడి చేటికలు పరుగిడుచున్నా రేలొకో? అక్కడ వారి కేదియో భయము కలిగియుండును.

శత్రు:—అక్కడే యాగ్నేయాస్త్రము మొక్కవోయినది.

రాము:—ఎవఁడో యట మఱుఁగుపడి మనల నెదిరించి యుండ వచ్చును. యోగప్రభావమువలన మాయాశక్తివలన నదృశ్యముగా నుండవచ్చునని వింటిని. యోగులు మనల నెదిరింపరు. కానిమ్ము. భావగామి యైన నాయస్త్ర మదృశ్యుల నైనఁ బ్రహరించును. దానితో నాయస్త్ర కౌశలమును బ్రదర్శించెదను. (బాణము సంధించును.)

[అంత దూరమున వసిష్ఠుఁడు ప్రవేశించును.]

భర:—(చూచి) అయ్యో! ప్రమాదము. భగవానులు, ఆర్య గురుపాదులే నీబాణమునకు లక్ష్యముగా వచ్చినారు. బాణ ముపసంహరింపుము.

రాము:—(బాణ ముపసంహరించి) ఏరీ గురువులు? యోగప్రభావ పిహితదేహులై నాచికీర్ష గాంచియుందురు. వీరివలననే నాయస్త్రము మొక్కవోయి యుండును. పూజార్హు లగువీరు నాబాణమునకు లక్ష్యమైరి. ఇట్లే తెలియమిచే దేవతలుకూడ పరిభవింపఁబడుచుందురు.

క. శిరముల నిప్పుడె సద్గురు
చరణంబుల నిలిపి పరమసంభావ్యముగా
శరణంచు క్షమాభిక్షము
త్వరగాఁ గోరుదము రండు ధన్యుల గురులన్. 30

అందఱు:—రండు. (వసిష్ఠునిపాదములపైఁ బడి)

క. మము మన్నింపుఁడు కడు దో
షమునకు గుఱియైతి మిట్లు సంయమినాథా! 32
క్షమఁ దమ బాలకు లపరా
ధము నొనరించినను బ్రోవఁ దలఁపరె పితరుల్.

సీ. సుతులు శిష్యులు నపరాధశతము చేయ
గురులు క్షమియింత్రు వాత్సల్యపరవశు లయి
బాలురము నేము తెలియక పాలుపడిన
దోషమును విస్మరింపు సంతోష మొదవ. 33

వసి:—ఇది యేమి? మీకు దోషము లేదు. నాకుఁ గోపము లేదు. దీర్ఘాయుష్కులారా! లెండు.

రాము:—మహాశిల నైనను బిండిపిండి చేయునది నాబాణము. మీరు మిక్కిలి వృద్ధులు. మహాత్మా! నాదోషము చెప్పలేకుంటిని. క్షమింపుఁడు.

వసి:—వెట్టివాఁడా! నీ వెంతశస్త్రాస్త్రజ్ఞుఁడ వైనను నింకను బాలుఁడవే.

గీ. ఏశరీరమ్మునందు మున్ గౌశికాస్త్ర
వితతి నిర్వీర్యమై కడు వితథ మయ్యె
నట్టిదేహమ్మునందు నీయస్త్ర మెట్లు
వికృతిఁ గల్గించు నోబాలవీర! నేఁడు. 34

మఱియు;

మ. కవచం బౌచు శమంబె బ్రాహ్మణవరుల్ గాపాడుఁ జక్రాశని
ప్రవిఘాతంబులబారినుండి భయ మావంతైన లే దందుచే
భవదీయాస్త్రమున స్ఖలింప యమసంపన్నంబు లౌ యోగివృం
గవదేహమ్ములనస్త్రశస్త్రములు తాఁకంజాలవొక్కింతయున్.

నన్ను లక్ష్యించి విడిచినబాణములు ప్రతీపగాములై యాధనుర్ధరునే బాధించును. ఐనను, నీవు నే నచ్చట నున్న ట్లెఱుఁగక ప్రయోగించితివి కాన, నీయస్త్రములు నిన్ను బాధింప లేదు.

రాము:—(నమస్కరించి)

క. గురుదేవులు భగవానులు
వరమంత్రద్రష్ట లైనబ్రహ్మర్షులు స
త్కరుణ మముఁ బ్రోచుచుండఁగ
నిరతము, మా కేల కష్టనిచయము కలుగుఁ ?

భర:—భగవానులు మా కేమంగళ మొసఁగఁగోరి యిటు లను గ్రహించి విచ్చేసిరోకదా !

వసి:—నేనును వనసంచారకుతూహలమున నిటకు వచ్చి యీ ప్రాంతమున నొకకమండలు వుండుట చూచి యటఁ గూర్చుంటిని. పిదప నది విశ్వామిత్రుని దని తెలిసి కొంటిని.

రాము:—ఏమి ? విశ్వామిత్రులుకూడ నట నున్నారా ?

వసి:—ఆయన రావణునితో వెళ్లి యుండెను. మహారాజు నేదో యడుగఁ గోరి తేపు వచ్చెద నని చెప్పెను.

రాము:—ఐనచో, తేపు విశ్వామిత్రులను జూచి ధన్యుల మయ్యెదము. కాని, యామహర్షి యింతవఱకు వచ్చి మమ్ము దీవనలతో నేల యభినందింప లేదో ? రావణుఁ డేల వచ్చెనో ? ఆతఁడు మహాబలుఁ డనియు సురాసుర జేత యనియు వర్చస్వి యనియు సర్వవిద్యాపారదృశ్వుఁ డనియు వింటిమి కాని, కేవల మధర్మపోషకుఁడఁట.

వసి:—రావణుఁడు వత్స లగుమీకు కష్టము చేయుటకే వచ్చినాఁడు. ఆతనిరథముతో నాతఁడు తిరస్కరణీవిద్యవలన నిగూఢముగా నుండెను. విశ్వామిత్రుఁడు కూడ మీప్రభావము విని చూడవచ్చెను. ఆతఁడును రావణునుదంత మెఱుంగుటకు యోగప్రభావముచే నిగూఢుఁడయియే వచ్చెను.

రాము:—తరువాతఁ దరువాత ?

వసి:—రావణుఁడు మిమ్ముఁ జూచి వచ్చినదారినే వెడలి పోయెను. ఆపాపి దారిలో నేమైనఁ బాపకృత్య మొనరించునేమో యని తపోవనాంతముదాఁక విశ్వామిత్రుఁడాతని ననుసరించెను. ఈసంగతి మీకుఁ జెప్పుటకే నే నిటు వచ్చుచుంటిని.

రాము:—ఐన, విశ్వామిత్రులను మేము ఱేపు చూచెద మన్నమాట.

వసి:—ఆ. నేను మీకుఁ జెప్పినట్లు వినయనియమములతో నాతని మనస్సున కెక్కునట్లు పాదస్పర్శపురస్సరముగా నమస్కరింపుఁడు.

రాము:—ఆయన క్షత్రియుఁ డని వింటిమి ?

వసి:—ఐన నేమి ?

రాము:—బ్రాహ్మణచరణములనువలె క్షత్రియచరణములను మాశిరములకుఁ దగులనిత్తుమా ?

వసి:—ఆతఁడు మిక్కిలి తపశ్శాలి.

రాము:—తపమే బ్రాహ్మణత్వ హేతువా ?

గీ. తపము శ్రుతమును గులము నీత్రయముఁ గూడి
యుగును బ్రాహ్మణాకారక మందు రట్టి
త్రయము నెవ్వని కమరు నాతండె ధరణి
బ్రాహ్మణోత్తముఁడై విశ్వవంద్యుఁ డగును. 32

వసి:—ఆమాట సామాన్యతపోవిషయమున. మహాతపఃఫల మలోకసామాన్యము.

రాము:—ఎట్లు ?

వసి:—ఈతపఃప్రభావమువలన విశ్వామిత్రుఁడే కాదు. ఆతని తండ్రితాతలు కూడ ఋషిత్వము బ్రహ్మత్వము నందిరి.

భర:—ఆతఁడు బ్రాహ్మణుఁడో యబ్రాహ్మణుఁడో మన కేల ? గురువులయాదేశమే మనకు శిరోధార్యము. మనము క్షత్రియులము. వయసుచే విద్యచేఁ దపముచే నాతఁడు మనకుఁ బూజార్హుఁడు. దీని కాలోచన మేల ?

రాము:—ఔనుకాని కర్తవ్యమును గూర్చి గురువుల నడిగి తెలిసికొనుట మంచిది.

వసి:—నేను జెప్పినమాట మఱవకుఁడు.

అందఱు:—గురువులయాజ్ఞ నిర్వర్తింతుము.

(అందఱు నిష్క్రమింతురు)

మంథర:—(ప్రవేశించి) కపటపండితుఁ డగువసిష్ఠునిసంగతి కంటిని. వింటిని. ఆతఁ డెప్పుడును రామునితోడనే మాటాడును గాని భరతుని లక్ష్యపెట్టఁడు. దాసీపుత్రు లగుపరిజను లందఱు రామానురక్తులే. రావణుఁ డిక్కడకు వచ్చి నట్లు చెప్పుచున్నారు. వానిపనులు చాల ననార్య జాతివఁట. ఆతఁ డప్రతిరథుఁడఁట. వృద్ధుఁ డగురాజు

రాముని కే రాజ్య మీయఁ దలఁచుటయు వింటిని. రావణుఁడు రామవిరోధియై యతనిఁ జంపివేయుచో నిఁక భరతుఁడే నిష్కంటకముగా రాజ్య మేలఁగలఁడు. ఆహా ! నాభర్తృదారిక యగు కైకేయికిసైతము రాముఁడన్న నే యిష్టము. భరతునికి రాజ్యము రానిచో నా పేరు మంథర కాదు. అనార్యులు, అసురులు, పిశాచములు వీరిని రామునికి మహారాజునకు శత్రువులుగాఁ జేసి నేను భరతునే మహారాజును జేయుదును. వృద్ధ వసిష్ఠుఁడు కాని కపటసుమంత్రుఁడు కాని యేమి చేయఁగలరో చూచెదను. అమ్మో ! సుమంత్రుఁడు వచ్చుచున్నాఁడు. (నిష్క్రమించును.)

సుమం:—(ప్రవేశించి) ఇపుడు విశ్వామిత్రమహర్షి వచ్చెను. మరల వచ్చునఁట. రావణుఁడు వచ్చి పోయినాఁడు. తన యాతిథ్యమును గైకొనకయే యేల రావణుఁడు వెడలి పోయెనో యని మహారాజు ఖేదపడుచున్నాఁడు. రావణుఁడు క్షత్త్రియవైరి యైనను, ఆతిథ్యమున కర్హుఁడు.

మ. తరుమూలంబున వాఁడిగొడ్డలిని జేతంబూని ఖండింపఁగా
దొరకొన్నట్టివిరోధి కాతరువె సంతోషంబుతో నీడ ని
చ్చి రుచిన్మించెడుపండ్లొసంగి మఱియున్ జల్వారు పుష్పంబుల
న్గరుణామేయత నిచ్చు నీవిధములోఁ గాదే ధరన్ మాన్యతల్.

(తెరలో)

గీ. ఇపుడు రావణుఁ డిచటికి నేఁగుదెంచె
నన్నసంగతి విని విస్మయమ్ము తోడ,

రాత్రి పురరక్షణమ్మును శ్రద్ధమీఱఁ
జేయుఁ డని రక్షకులను శాసించె నృపుఁడు. ౩౯

సుమం:—(విని)సరే. నేను రక్షకుల కిది తెలుప నేఁగెదను.
(నిష్క్రమించును.)

[గంధర్వులు ప్రవేశింతురు]

గంధ:—ఓ ధనాధిప దేవాధిపులారా!

మ. తతశస్త్రాస్త్రవిదుండు నిష్ఠురతపోధన్యప్రభావాతికం
పితదేవేంద్రుఁడు కౌశికర్షి కృప తోడ్తో రాముఁ గొంపోవు ను
ద్ధతశాపమ్మునకో శరమ్మునకొ ప్రత్యస్త్రమో సీతం జే సం
హతి నొందించును మీకు భీతి యిఁక నేలా! రామరక్షావిధిన్.

క. రాముఁడె బలుఁడగు వీరుఁడు
రాముఁడె సర్వాస్త్రశస్త్రరాజితహస్తుం
డా మహనీయుఁడె చంపును
దా ముదమున రావణాదిదనుజుల నెల్లన్. ౪౦
(నిష్క్రమింతురు.)

ఇది తృతీయాంకము

ప్రవేశక i

[ప్రవేశము నలుగురు వైతాళికులు ప్రాసాదముపై]

మొదటివాఁడు:—ఓరీ! భషకా! కటుకంఠా! నే నీగీతము చాలసారులు విన్నాను. నీవు నాగీతము విను. నీగీతము భజ్యమానశుష్కవేణుశబ్దము రా.

రెండవవాఁడు:—ఓరీ! మాళవకా! విను. నీస్వరము గార్దభస్వరము రా.

మూఁడవవాఁడు:—మీ యిరువురకు గీత మన్న నేమియో తెలియనే తెలియదు. వాద్యములతోఁ గూడిన నా గీతము వినిన మీరు చావవలసినదే.

నాలవవాఁడు:—నేను సంస్కృతగీతము పాడుదును. మీకు సంస్కృతము రాదు. అందుచే నాగీతము మీకు రుచింపదు. ఒక్కసారి నాగీతము విన్న రాజు మరల వినఁడు. అదే నాగీతజ్ఞత.

మాళవకుఁడు:—భావ! గోపిలుఁడు సంస్కృతమునఁ జదువును. అందుచే మహారాజతనిగీతమును వినును. మహారాజు నాగీతము వినెనా యింక మీగీతము వినఁడు.

భషకుఁడు:—నే నిపుడు ప్రత్యూషకాల మగుటచే మహారాజును లేపుట కేఁగుదును. గోపిలుఁడు పాడుట కనుమతి లేదు.

మాళ:—ఓరీ! నీగీతమువిన్న మహారాజునకు నిద్రపాఱిపోవును రా! అంతే కాదు. సర్వభూతములును భయపడి పరుగెత్తును.

దంతిలుఁడు:—భావ! గోపిలా! వాద్యములేని నీగీతమును మహారాజెట్లు వినును? నన్నుఁగూడఁ గొనిపొమ్ము. నావాద్యము వాయించెదను.

గోపి:—సమయము వచ్చినపుడు చెప్పెదను లే.

విదూ:—(ప్రవేశించి) మీ రిక్కడేమి చేయుచున్నారు?

గోపి:—సుందరకా! నీకు స్వాగతము.

విదూ:—ఇపుడు విశ్వామిత్రమహర్షి వచ్చినాఁడు. మన మాతనిఁ జూడవలయును.

గోపి:—ప్రతిదినము మహారాజుప్రాసాదమునకు ఋషులు వచ్చుచునే యుండుట మనము చూచితిమి. విశ్వామిత్రునిపై

నీ కింతపక్షపాత మేల ?

విదూ.—ఆయనకు రెండుముఖములు నాలుగుచేతులు నున్నవి. వీపు లేదు. రెండుప్రక్కల ముఖమే కనఁబడును.

గోపి:—రెండుప్రక్కల ముఖమా ? ఇది యెట్లుండును ?

విదూ:—ఓరీ ! ఆయన బ్రాహ్మణుఁడు. క్షత్రియుఁడు. రాజ ఋషి. అక్షమాలాధారి. ధనుర్ధరుఁడు. ముందు వెను కలు చూడఁగలఁడు. ఉభయతోముఖుండు కానిచో నెట్లు చూడఁగలఁడు ?

గోపి:—రెండుముఖములతో నాయన యేమి చేయును ?

విదూ:—ఒకదానితో వేదము చదువును. రెండవదానితో శాపము లిచ్చును.

గోపి:—నాలుగుచేతులతో నేమి చేయును ?

విదూ:—రెండింటితో బ్రహ్మకర్మ. రెండింటితో యుద్ధకర్మ.

గోపి:—కేవలనారాయణునికే నాలుగుచేతు లుండు నని చెప్పుదురు.

విదూ:—భగవంతుఁ డగునారాయణునకు నాలుగుచేతులునొక్క ప్రక్కనే యుండును. ఒక్కముఖము మాత్రమే యుం డును. ఈయనకు రెండుముఖములు. రెండుప్రక్కల రెండురెండు చేతులు.

గోపి:—ఆయనను నీవు చూచినావా ?

విదూ:—ఓరీమూర్ఖా ! వేతే చూడవలెనఁటరా. విన్నాను. ఎప్పుడుచూచినదానికన్న విన్న దే యెక్కువప్రమాణము.

గోపి:—ప్రత్యక్షముగాఁ గనఁబడుదానివిషయము నదృష్టప్రమా ణమే మిన్న.

విదూ:—ఓరీమూర్ఖా! ఒకప్పుడు కన్నులకుఁ బొంగరోగము, ఎండ దెబ్బ, మున్నగువానిచే వైకల్యము రావచ్చును. చెవులకు వైకల్య మెప్పుడును రాదు.

గోపి:—సరే. నీవు విశ్వామిత్రునిఁగూర్చి విన్నావు. నే నిప్పుడే చూచెదను.

విదూ:—నీవు జాగ్రత్తగాఁ జూచి చూచినది చూచినట్లు నాతోఁ జెప్పు.

గోపి:—నీవుకూడ నచటికి వచ్చెదవు గాదా? స్వయముగా నాయవను దర్శింపుము.

విదూ:—అబ్బో! నే నాయనను జూడలేను. ఆయనకుఁ గోప మెక్కువఁట. ఆయన దండకాష్ఠముతోఁ నాబుఱ్ఱ పగులఁ గొట్టునేమో. దూరమునుండియే చూచెదను.

(తెరలో)

మ. మును శస్త్రంబుల నెవ్వఁ డుద్ధతుల నిర్మూలించె; నెవ్వండుశ
క్రుని భీతిల్లఁగఁజేసె నిష్ఠురతపోరూఢిన్ మహర్షీంద్రుఁ డా
యనదృ్యం డగుకౌశికప్రభువు బ్రహ్మక్షత్రతేజోమయుం
డనలాగారమునన్ వసించె నృపపీఠస్థాతిత్వరన్ జూపుమన్.

అందఱు:—విశ్వామిత్రులు వచ్చినారు. రండు. పోవుదము.

(నిష్క్రమింతురు)

ఇది ప్రవేశిక.

యజ్ఞఫలము

చతుర్థాంకము

[ఆసనస్థుఁడై విశ్వామిత్రుఁడు ప్రవేశించును]

విశ్వా:—క. క్రతురక్షణ మనియెడునొక
కృతకపు హేతువున రాము ని మ్మని రాజున్
బతిమాలెద నాయస్త్రము
లతిపాత్రున కతని కిచ్చి యానందింతున్. ౧

సుమంత్రుఁడు:—(ప్రవేశించి) భగవానులకు నమస్కారములు.

విశ్వా:—యశోవంతుఁడ వౌదువుగాక!

సుమం:—భగవానుఁడా! నీయాశీర్వచనమునఁ గృతకృత్యుఁడగుటకు మహారాజిదే యిటకు విచ్చేయుచున్నాఁడు.

విశ్వా:—నేను రాజురాకకే యెదురుచూచుచుంటిని.

[మహారాజు, వసిష్ఠుఁడు, కుమారులు, విదూషకుఁడు, ఇతరులు ప్రవేశింతురు.]

రాజు:—తపోధనులు, మహామహులు నగువిశ్వామిత్రులకు సూర్యవంశజుఁ డగుదశరథుఁ డిదే నమస్కరించుచున్నాఁడు. (నమస్కరించును)

విశ్వా:—(లేచి)అనామయము, యశస్సు నీకు లభించుఁగాక!

రాజు:—భగవానుఁడా! కూర్చుండిమే ఆశీర్వర్షము కురిపింతురుగాక!

విశ్వా:— గీ. ప్రథితదైతత్వపాలకత్వములు నీకు
వజ్రలు నిత్యము రాజత్వవర్తనమున;
ఏల నిలుచుండరాదు నీపాల నేను ?
ప్రియవయస్యుని నిను గౌరవింప వలదె ? ౨

రాజు:— దేవా !

గీ. నాగుణమ్ములకును గారణంబు మీరు
క్షుద్రుడను నేను విశ్వసంస్తుతులు మీరు
ఇట్టిమిముఁ గొల్వ నింద్రుని కేని తగును
వసుధ నే నెంత నావైభవమ్ము నెంత ? 3

మఱియు,

గీ. అధిక మైనతమోవృత్తి యందు మెలఁగు
మమ్ము మన్నింపఁ గలపూనిమండను లయి
నిలిచియుండిన నింకఁ బై నిలిచిపోవె
అవని మామకసర్వకార్యములు దేవ ! ౪

భగవానుఁడా ! కూర్చుండుఁడు.

విశ్వా:—(వసిష్ఠులతో) మహర్షి ! నమస్తే !

వసి:— క. తపమున బ్రహ్మత్వముగో
న్న పరమఋషివి లభించె ననంతమహాత్వం
బపుడే నీ కిదె చేయుదుఁ
గృపఁ గొను ప్రతివందనంబుఁ గృతకృత్యుఁడవై. ౫

కూర్చుండుము. (కూర్చుందురు)

కుమా:—సావిత్రుల మగుమేము భగవానులకు నమస్కరించు
చున్నాము. (పాదములుముట్టి విశ్వామిత్రులకు నమస్కరింతురు.)

విశ్వా:—అప్రతిరథులు, దీర్ఘాయుష్కులు, లోకప్రణయభాజులు

సోదుముగాక ! అందఱకు భద్ర మగుఁగాక ! కూర్చుం
డుఁడు. (అందఱు కూర్చుందురు)

రాజు:-తమతపక్రియ లేయాతంకములు లేక జరుగుచున్నవి కదా !

విశ్వా:- గీ. నీవు రాజయి యుండ సర్వేంద్రధర్మ
యుక్తిఁ బ్రజ లెల్ల సుఖయించు చున్నయట్లు
అంతరాయము లేక మాయాశ్రమమున
సాగుచున్నది తాపసాచార మధిప ! ౬

వసి:-ఇది సహజమేకదా !

గీ. పరమనృపులు స్వధర్మంబుఁ బాటిసేయ
సౌఖ్య మబ్బుట ఋషుల కాశ్చర్య మగునె ?
చమురు చాలినయంతగా నమరె నేని
దీప మాఱునె నిర్వాతదేశమందు ? ౭

విశ్వా:-(సగర్వముగా)

గీ. రాజ్యమును నిర్వహింపఁ బురందరాదు
లైన రాజులసాహాయ్య మభిలషింతు
రేసహాయుఁడు లేక మునీంద్రు లాత్మ
మహిమచే నిర్వహింత్రు కర్మమ్ములెల్ల. ౮

(ఆలోచించి లోపల) ఇది నాకోరికకు విరుద్ధ మగుమాట కదా ! ఇట్లందును. (ప్రకాశముగా) ఐనను.

గీ. అఖిల మగుతపోవిఘ్నమ్ము లపలఁద్రోలు
నిన్ను నొక్కటి యాచింతు నేను నిపుడు.

రాజు:- ఆజ్ఞ సేయుఁడు మీయాజ్ఞ లవధరింతుఁ
బరమమహానులపాదసేవకుఁడ నేను. ౯

విశ్వా:—(వసిష్ఠునితో) భగవానుఁడా! అనంతరబ్రహ్మకులా! ఈదాశరథులు నలుఁవురు యథావిధి నీచే నుపవీతులైరా యని యడుగ నక్కఱలే దనుకొందును.

వసి:—ఔను.

విశ్వా:—వీ రెవరికడ శాస్త్రములు శస్త్రములు నభ్యసించిరి?

వసి:—శాస్త్రము లన్నియు నాకడ.

విశ్వా:—ఏయే శాస్త్రములు?

వసి:—మంత్రద్రష్టృత్వమునఁదక్క నన్నివిద్యలలో వీరు నిష్ణాతులు.

విశ్వా:—ఈవయసు వచ్చుసరికే వీ రిన్నివిద్యలు నేర్చుట యలౌకసామాన్యవిషయము. ఇది నీమహిమయే కాని వేఱు కాదు.

వసి:—ఇంతకు,

గీ. స్నిగ్ధ మగువర్తి దీపంపుశిఖ గ్రహింప
నర్హ మగుఁగాని మృత్పిండ మర్హ మగునె?
ధీగుణమ్ముల స్నేహసందీప్తవృత్తిఁ
గొనును విద్యల శిష్యుఁడు గురునివలన. ౧౦

విశ్వా:—హాయిగా మేడలో నుండి యనుభవజ్ఞానము లేక వీ రేక్రమమున నిన్నివిద్యలు నేర్వఁగలిగిరి?

వసి:— గీ. విమలమతితోడ గురుబోధనముల వినుచు
శ్రద్ధతో మననంబును జలిపి యెఱుఁగ
వలయు నిద్యాది శాస్త్రసంకలనమునకు
సమ్మతం బైనప్రాక్తనాచారసరణి. ౧౧

విశ్వా:—ఎప్పుడైన నెవరైన వీరిని బరీక్షించిరా? ఏలన,

గీ. ఎన్నఁడు గురుండు సుస్నిగ్ధహృదయుఁ డగుట
శిష్యుఁ దలపోయు జ్ఞానవిశిష్టునిగను
సర్వమున సంతతంబు నిసర్గమైన
ప్రణయ మరయు గుణాధికత్వమ్ము నిజము. ౧౨

వసి:—వీరిని బరీక్షింప నీకంటె సమర్థు లెవరు? (కుమారులతో) దీర్ఘాయుష్మంతులారా! విశ్వామిత్రభగవానులు మిమ్ముఁ బ్రశ్నింతురు. మీరు మీచదివినట్లుగా సమాధాన మిండు.

కుమా:—చిత్తము.

విశ్వా:—కుమారులారా! అప్రతిమానశాస్త్రవిదులు గురువులు, భగవంతులు నగు వసిష్ఠులవారు మీ కే మేమి నేర్పిరి?

రాము:—(లేచి నమస్కరించి) అన్నిటికంటె ముందు గురువుల యెడ వినయము, స్నేహితులయెడఁ బ్రణయము, దీనుల యెడ దయ, శత్రువులయెడ నిర్భయత్వము, మాకు గురువులు నేర్పిరి. పిదప, భగవానులు నాలుగు వేదములు, సమస్తార్థసంగ్రహముగా వ్యాకరణము, అర్ష పదనిర్వచనము, గ్రహచారము, పతంజలియోగ శాస్త్రము, మానవాచారశాస్త్రము, చతుర్వింశతి వ్యవహార నిర్ణయము, వాసిష్ఠరాజశాస్త్రము, మేధాతిథిన్యాయ శాస్త్రము, కాసకృత్స్న మగుమీమాంసాశాస్త్రము నిట్లే యితరము లగునుపయోగిశాస్త్రములు, గజాశ్వ రత్నపరీక్ష, శకునజ్ఞానము, కావ్యకళ మున్నగునవి నేర్పిరి. నాతమ్ములు వానినెల్ల బాగుగా గ్రహించిరి. నేనును జదివితిని. జ్ఞాపక మున్నవి.

భరతలక్ష్మణశత్రుఘ్నులు:-ఆహా! ఆర్యునిమహానుభావత్వము !

గీ. సజ్జనుం డన్యగుణము లేశంబునైనఁ
గాంచు నుత్కర్ష భరితంబు గాఁగ నటులె
స్వీయగుణము లత్యుత్తమశ్రేణి వయ్యు
స్వల్పములు గాఁగ నెపుడు చెప్పం గడంగు. ౧౩

విశ్వా:-సంతుష్టుఁడనైతిని. ఇఁక, శాస్త్రాగమము మెవ్వారివలన నేర్చితిరి ?

లక్ష్మ:-(రామునితో) ఆర్యా! నా బాలచాపలము క్షమింపుఁడు. దీనికి సమాధానము నేను జెప్పెదను.

రాము:-సరే.

లక్ష్మ:-(విశ్వామిత్రునితో) భగవానుఁడా !

గీ. ఆర్యుఁ డీతఁడు సర్వశస్త్రాస్త్రవిదుఁడు
జ్యేష్ఠుఁడును శ్రేష్ఠుఁడును మాకు నితఁడె గురుఁడు
అస్త్రముల శాస్త్రముల సన్న్యాలరయనట్టి
ఘనరహస్యంబు లితఁ డొక్కఁడె యెఱుఁగు. ౧౪

మఱియు,

గీ. జనకపాదారవిందప్రసాదమునను
అస్త్రశస్త్రాదివిద్యల నారితేఱి
నార మయ్యవి విజయసేనాపతికడ
నిత్యమును సాధనము చేసి నెగడినాము. ౧౫

విశ్వా:-గీ. శాస్త్రశస్త్రంబు లెఱుఁగువిజ్ఞాని కెన్న
సర్వమును వశ్య మన్న నాశ్చర్య మున్నె ?
కుంభజుఁడు వార్ధిజలములఁ గ్రోలె నన్న
వాక్యమే నిర్ణయించు నవ్వానిశక్తి. ౧౬

లక్ష్మణా! నీకుఁ గలరామభక్తికి ని న్నెంతయు నభినందింతును. ఎచ్చట స్నేహము, భక్తి ప్రకాశించునో యచ్చటనే గుణము నుండును. మీశాస్త్రాస్త్రానుభవము నె ట్లెచ్చటఁ బ్రదర్శించితిరి? ఏలన,

గీ. అనుభవము లేనిశ్రుతము కాసంత యైన
నరుల కుపకారకము కాదు తఱచి చూడ
దధిని వర్తిలి యుండి మథనముఁ గనక
శ్రేష్ఠనవనీతసంసిద్ధి చేకుఱు నెటు? ౧౭

విదూ:—పెరుగు నాకు మిక్కిలి యిష్టము. దధి తిన్న నెయ్యి తిన్న ట్లేకదా?

రాము:—ఆర్యా!

గీ. ఆకృతియొ ద్రవ్యమో వస్తు వనఁగ? మఱియు
పదమొ వాక్యమొ శక్తిసంపదకు నెలవు?
గురులతో సుంత వాదింపఁ గోరుచుంటి
శాస్త్రవిజ్ఞానదృఢత లక్ష్యంబు గాఁగ. ౧౮

మఱియు,

గీ. చలితవృక్షచ్ఛదము లేక శరముచేత
గ్రుచ్చి పెనుతాలఁ జూర్ణించి, క్షోణిజముల
నిలువున దహించి యస్త్రముల్ నేర్చినట్లు
భక్తిఁ జూపింతు మీపురీప్రాంతమందు. ౧౯

విశ్వా:—కుమారులారా!

గీ. వినయవిస్పష్టతాధికవిలసితములు
మీరు పలికినపలుకులు మిమ్ముఁ జూడఁ

దెలియు మీశాస్త్రపాండితీదివ్యశక్తి
సంశయము లేదు నా కయ్యె సంతసంబు. ౨౦

కాని, శస్త్రవిద్యాభ్యాసపద్ధతిమాత్ర మిట్లు కాదు. ఏమి చేసినను నెదురొక్కనిచెట్లును, ఆకులను గొట్టుట వలన మీధనుర్ధరత్వ మెట్లు ప్రకటిత మగును?

విదూ:—నిజము. నిజము. పచ్చనిచెట్లను, ఆకులను గొట్టిన నే మగును? ఎండిపోయినచెట్టుకొమ్మలు విఱుగఁ గొట్టినఁ బొయ్యిలోనికైన వచ్చును.

రాజు:—విశ్వామిత్రభగవానులు నిజము పల్కినారు. కనుకనే నేను వీరి నపుడపుడు వేఁటకుఁ గొనిపోవుచుందును.

విశ్వా:—వనములందలి కేసరిగజమహిషాదు లగుమృగములు రాజుల కేమి యపకారము చేయును?

రాజు:—అవి యావులను సస్యములను హింసించును.

విశ్వా:—అవి బలిష్ఠములై ప్రజాపీడ కల్గించిన దండింపఁదగినవే కాని, ప్రకృతిజనులను బీడించుచు ధర్మలోపమును గలిగించుచు, మహాబలవంతులై వివిధాస్త్రకుశలులై యున్న దుర్మార్గుల నెవ్వరు చంపుదురు? మహారాజా! రాక్షసు లనేకులు బలవంతులై ధర్మప్రజాపీడ గలిగించుచున్నారు. నీ వెఱుఁగవా? కుమారులను నీతో నడవికిఁ దీసికొని పోయినంతమాత్రమున వీరికి రాక్షసులతో యుద్ధము చేయు ననుభవ మెట్లు కలుగును?

రాజు:—(ఆశ్చర్యముతో) మునీంద్రా! ఎవ్వ రాదుర్మార్గులు? నారాజ్యమునఁ గూడ ధర్మప్రజాపీడయా? ఆబలవంతు లెవ్వరో నాయెదుటఁ బ్రజాపీడ యొనరించిన క్షణ

ములో వారిని సంహారించి యుందును.

విశ్వా:—రాజా! నీవు కన్నులు మూసికొని కూరుచుండిన నీకు దుర్మార్గులు కనిపింతురా? వారిని గనిపెట్టి చంప వలయునే కాని వారు నీతో యుద్ధము చేయ నీయింటి కరుదెంతురా?

రాజు:—గ్రామవాసులు, కృషీవలులు, గోపాలురు, వణిజులు, సార్థవాహులు నెవ్వరును రాక్షసపీడనుండి కాపాడ నన్నుఁ గోర లేదే!

విశ్వా:—అసురు లన్న ధనలుబ్ధులు కారు. అందుచే వారు కృషీ వలులజోలికి వణిజులజోలికి రారు. తపోవనములందు యజ్ఞములు చేయుతాపసులకు విఘ్నములు కలిగింతురు.

రాజు:—ఋషులు కాని తపస్వులు కాని నన్నిసాయము చేయుమని కోరనే లేదు.

విశ్వా:—ఋషులు, తపస్వులు, స్వతపోరక్షణకై క్షత్త్రియ సాహాయ్యమును యాచింపరు.

రాజు:—నన్నెవరును గోరకుండఁగనే నాకుఁ దెలియనిశత్రువుల నెట్లు రూపుమాపుదును?

విశ్వా:—

ఉ. ఎవ్వరుకోరఁగాఁదమము నెప్పుడుఁబాఱఁగ ద్రోలుసూర్యుఁడ
డెవ్వరు కోర వాయు వది యెల్లెడ వీచు జగంబులోనఁ ద
న్నెవ్వరు కోర శేషుఁడు మహిన్ దలపై నిలుపున్ దలంపఁగా
నవ్విధి రాజు పాపుల నయాచితభంగి నణంపఁగాఁ దగున్.

ఇంతకును నేను క్షత్త్రియుఁడనై యున్నప్పుడు భగవానుఁ డగువసిష్ఠుని శస్త్రాస్త్రములతో హింసింపఁ బూనుట

మీా కందఱకును దెలిసినదేకదా ! నాఁడు వసిష్ఠుఁడు తనశిష్యులు, అప్రతిరథవీరులు, నగుమిమ్ము సాయపడఁ గోరియుండెనా ?

రాజు:—పాపులను శాపముచే ఋషు లేల నివారింపరాదు ?

విశ్వా:—శపించుటవలనఁ బుణ్యము క్షీణించును. అందుచేఁ దాపసులు తఱచు శపింపరు.

గీ. తాపసజనంబు కర్మకలాప మెల్ల
ఘోరశాపంబులనె తీర్చుకొనునెడల
నున్నతంబగునీకీర్తి కుగ్రశౌర్య
మునకు ఫలమేమి చెప్పుమో భూతలేంద్ర! ౨౨

రాజు:—ధన్యుఁడను. మహాత్మా ! మీాచే సూచింపఁబడితిని. నేఁడు నాకర్తవ్య మేమో సెల విప్పింపుఁడు.

విశ్వా:—ఒకేక్రియ కలిగిన కార్యద్వయమును జెప్పుచున్నాను.

రాజు:—ఆద్వయ మేమి ? శీఘ్రముగా నాజ్ఞాపింతురుగాక !

విశ్వా:—గుణవయోజ్యేష్ఠుఁ డగునీకుమారునకు దివ్యాస్త్రజ్ఞాపన మొకటి.

రాజు:—నానేర్చినదివ్యాస్త్రము లన్నియుఁ గుమారుల కొసంగితిని. రాముఁ డవి యన్నియుఁ జక్కఁగాఁ బ్రయోగింపఁ గలఁడు. నాకు రెండస్త్రములే తెలియనివి.

విశ్వా:—ఏ వవి ?

రాజు:—జృంభకాస్త్రము, బ్రహ్మాస్త్రము.

విశ్వా:—బ్రహ్మాస్త్రవిదు లగువసిష్ఠులవా రిచటనే యుండిరి గదా ?

వసి:—నేను బ్రహ్మాస్త్రముతో సర్వాస్త్రసంహారము చేయఁ

గలను. కాని, ప్రయోగింప లేను.

విశ్వా:—బ్రహ్మాస్త్ర మందినపిదప నే నా రెండిటి నెఱింగితిని.

రాజు:—జృంభకాస్త్రములును దమకుఁ దెలియునా?

విశ్వా:—చక్కఁగా.

రాజు:—అగుచోఁ గొంతకాలము తా మిట నుండి కుమారుల కాయస్త్రము లుపదేశింప నర్థించుచున్నాను.

విశ్వా:—నీమాట క్రమవిరుద్ధము.

రాజు:—ఎట్లు?

విశ్వా:—సీ. అర్థి యనుపంపు దాతృగృహంబునకును
అరుగఁ జెన్నగు నర్థిగృహమ్ము దాత.
దప్పిఁ జెందినవాఁడె వెదకును సరసి
సరసి వెదకదు తృషితుఁ డౌనరునికొఱకు. ౨౩

రాజు:—నాగృహ మంతయుఁ దమదే. మేము నమస్కారములతో నిర్బంధించి మి మ్మిక్కడ నాఁపెదము.

విశ్వా:—రాజగృహము నానావ్యవహారాకులము. సౌధసౌఖ్యములను విడిచి వన్యఫలాశనులము, వ్రతపరంపరాసితులము, బ్రహ్మవిచారనిహితమనస్కులము నగుమావంటి వారికి రెండుమూఁడుదినములకన్న నిట నుండఁ దగదు. గృహస్థుల యావాసములు వివిధవ్యాపారసంకులములై బ్రహ్మపరుల కేకాంతసుఖము కలిగింపఁజాలవు. నిర్జనములగు పర్ణశాలలయందే నివసించు తాపసులను గృహస్థు లెంత యైశ్వర్యముతో నైనను బరిచరింపఁజాలరు. రాజసంపదలు విరాగు లగు తాపసులను బంధింపఁజాలవు.

రాజు:— మహాత్మా! క్షమింపుఁడు. తమయిష్టము నిట నెవ్వరును గాదనువారు లేరు. భగవానుఁడా! పుత్త్రిలు, భృత్త్యులు, సచివులు, సైన్యములు, నాసర్వప్రాసాదములు, ప్రియమగునుపవనములు, వాహనములు, ధనము, కోశము, నన్నియు మీవే. వేయేల, నాకిరీటము వలన లభించిన సమస్తము మీదయావిశేషమునకే యెదురుచూచును గాని యేసమయమున నడ్డు రాదు.

విశ్వా:— రాజా! రుద్రస్వేదము, మునిమనము, వీరపాణి, రామారుచి వీనిని బలవిత్తాదిసంపదలు బంధింపఁజాలవు.

వసి:— యుక్తిచే వీనిని బంధింపవచ్చును. ఎట్లన, గంధాశ్మముచే రుద్రస్వేదమును, భక్తిచే మునిమనస్సును, నమస్కారముచే వీరపాణియును, దాక్షిణ్యముచే రమణీసౌందర్యమును బద్ధము లగును.

విశ్వా:— కావచ్చును. కాని, ప్రాసాదవాసము సర్వప్రకృతులకును సుఖకరము కాదు. దేశకాలపాత్రములే వస్తుగుణవికాసహేతువులు. ఎట్లన,

గీ. సరసున సరోజతతి వికాసంబు గాంచు
మలయపర్వతమందున నెలయుఁ జందనంబు; వస్తువు లట్లు స్థానమును బట్టి
వర్ధిలుచునుండు నశియించు వ్యత్యయమున. —౨౮

మఱియు,

గీ. చెట్లు చిగురించు మధుమాససిద్ధితోడ
నమిలి నర్తించు వర్షర్తునం గడంగి

హంస శరదాగమమునఁ గూయం దొడంగుఁ
గాలమున సర్వమున్ గుణకలితము లగు. ౨౫

రాజు:—అయినచోఁ గుమారు లాయస్త్రద్వయమును నేస్వీకరియే
నావలె యుద్ధము నెఱపుదురు.

విశ్వా:—అట్లనుట మంచిది కాదు.

రాజు:—మఱి యెట్లు ?

విశ్వా:—నాయాచన వ్యర్థము కాకుండఁ దీర్పుచో ని న్నొకకోటి
యడిగెదను.

రాజు:—గీ. చరము నచరము నాసర్వ మిపయు మీఁద
నాది యునఁ దగునది మునినాథ ! లేదు.
ధన్యుఁ జేయుము కొని యీప్సితంబు లెల్ల,
నర్థులకుఁ గానిసంపద వ్యర్థముకద ! ౨౬

విశ్వా:—నేను ని న్నేది కోరుదునో యది తీసికొని వెంటనే వన
మున కేఁగుదును.

రాజు:—ఆజ్ఞాపింపుఁడు.

విశ్వా:—రాముని యాచింతును.

రాజు:—ఎందుకొఱకు ?

విశ్వా:—ఈయుఁదలఁచినవా రిచ్చెడుదానిఫలము పుచ్చుకొను
వారి నడుగరాదు.

రాజు:—అది ధనాదులవిషయమున.

విశ్వా:—మాదృశు లగుబుఋషులు ధనాదులు కోరరు.

రాజు:—రాముఁడు నాప్రాణముకదా ?

విశ్వా:—ఐన నేమి ? మహాత్ము లడిగినచోఁ బ్రాణ మీయఁ
గూడ దని యెచట నున్నది ?

రాజు:—రాముని కే నన్నను దీసికొని పొండు.

విశ్వా:—నీ విచ్చినది మరల మఱియొకని పేర్లయముగ నిషేధింపఁ జూచెదవా ?

రాజు:—గీ. కారణము లేకయే రాముఁ గాననమున
కంపి తమతోడ నొంటి నేకరణి గృహము
నందు నివసింతు ముదివగ్గనై మహాత్మ !
జీవితము నెట్లు నిల్పుదుఁ జెప్పు దేవ ! ౨౭

విశ్వా:—కారణము లేకయే యనుట పాడి కాదు.

రాజు:—ఐనఁ, గారణ మేమి ?

విశ్వా:—పదిదినములలోఁ బూర్తి యగుయజ్ఞ మొకటి నేను జేయుచున్నాను.

వసి:—ఈకాలమున యజ్ఞ మేమి ?

విశ్వా:—గీ. యజ్ఞదానతపంబుల ననవరతము
చేయుటయె ధర్మ మెల్లను శీఘ్రగతిని;
సర్వదా వీనిఁ జేయఁగాఁ జాలనట్టి
వారికై కాల మన్న దేర్పడియె నిజము. ౨౮

ఆనాయజ్ఞము శస్త్రసాహాయ్యము లేనిది విజయాసంతము కాదు. సర్వశస్త్రవిదుఁ డగురాముఁడే యజ్ఞము నిర్విఘ్నముఁ గావింపఁగలఁడు.

రాజు:—మీయజ్ఞమునకు విఘ్నము లెట్లు కలుగును ?

విశ్వా:—మారీచసుబాహుప్రముఖు లగు రాక్షసులనుండి.

రాజు:—నేను సైన్యసహితుఁడనై వచ్చి వారిని సంహరించెదను.

విశ్వా:—రాముఁడు తక్క నొరు లందులకు సమర్థులు కారు.

రాజు:—గీ. రాక్షసులు నిర్దయులు బలరాజితులును
రాముని పదంబు లేద మృదురమ్యము లగు
నెటులు రక్షించు యజ్ఞంబు నితఁడు కట్ట
నసజము వనాగ్ని నార్ప సంభవమె ? దేవ ! ౨౯

విశ్వా:—రాజా !

శా. బాలార్కుండు త్రిలోకసంవృతతమోభంగంబు గావించు; ను
ద్వేలం బైనమృగేంద్రపోతమె వనిన్ బీభత్సముం జేయఁగాఁ
జాలున్, రాముఁడునట్టి రాక్షసదవజ్వాలాయితుండై భువిన్
బాలించున్ వయ సెన్న నేల తలఁపన్ శౌర్యప్రభారాశికిన్.

మఱియు,

గీ. తొలుతఁ దెల్పినదివ్యాస్త్రములను రెంటి
రామునకుఁ దెల్పెదను నేను క్రతుసమాప్తి
యైనపిదపఁ బ్రియంబున నందువలన
నుత్తరోత్తరసత్ఫల మొదవు నమ్ము. ౩౦

రాజు:—అట్లైన గురువు లగువసిష్ఠభగవానుల నడుగుదును.

(వసిష్ఠునితో)

గీ. దేవ ! సెలవిమ్ము నేఁ జేయుతెఱఁ గదేమి ?
తావకాజ్ఞను బాలింతుఁ దక్షముగను
ధర్మహానియు సుతపరిత్యాగ మదియు
రెండు దుస్సహములె నాదునిండుమదికి. ౩౧

విశ్వా:—రాజసింహా ! ప్రతిజ్ఞాహాని మహాపాతకము. నాతో
రాముని బంపుట పుత్త్రత్యాగము కాదు.

ఏలన;

గీ. ఎంతప్రియుఁడో రాముఁడు నీకు నంతకంటె
నెక్కుడు ప్రియుండు నాకును; నింత కతఁడు
నూతనాస్త్రమహావిద్యఁ బ్రీతిఁ గాంచి
సత్వరంబుగ వచ్చు నీసన్నిధి కిట. 33

వసి:—విశ్వామిత్రుని వెంట రాముఁ డరిగినచో నెట్టియనిష్టము కలుగ దని నాకుఁ దోఁచుచున్నది. నీకుఁ బ్రతిజ్ఞాభంగము కాఁగూడదు. రాముని బంపుము. సందేహింపకుము.

రాజు:—అట్లే చేయుదును. (రామునితో గద్గదముగా) వత్సా! రామా! భగవానునితోఁ బోయి రమ్ము.

రాము:—(నమస్కరించి) తమ సెలవు.

లక్ష్మ:—(లేచి) తండ్రీ! గురుదేవా! భగవానుఁడా! నే నార్యు ననుగమింతును.

మ. జననీస్తన్యము లాను వేళలను దత్సాన్నిధ్యమందే ప్రియం
బునఁ గేళీగతులన్ జెలంగు నెడలన్ బూతాస్త్రవిద్యాదికం
బును నేర్వంగను వేళ నాశిషములన్ బొల్పొందు వేళన్ సదా
యనువర్తించితి నార్యు నేఁడడవి కేలా? యొక్కఁడే పోవఁగన్.

విశ్వా:—గీ. గడియ యైనను రాముని విడువ వీవు
రమ్ము రామునితోడ వనమ్మునకును.

భరతశత్రుఘ్నులు:—
మమ్ము విడనాడి మీరు వనమ్మునకును
బోవ నేమును వత్తు మాపూతవనికి. 34

రాజు:—(కన్నీటితో) ఏమి? అందఱును వెళ్ళుదురా?

వసి:—విశ్వామిత్రునితో రామలక్ష్మణులు లేఁగుదురు. ఇతరు

లియువురు వృద్ధుఁ డగుతండ్రికి సేవ చేయుచు నిటనే యుందురుగాక !

రాజు:—(కన్నులు మూసికొని) అట్లగుఁగాక ! లక్ష్మణుఁడును బోయి వచ్చును.

రామలక్ష్మ:—నే మిపుడే భగవానునితోఁ బోవలయునా ?

విదూ:—(అపవారించి రాజుతో) ఈదీర్ఘకూర్చు నిపుడే పోనిండు. ఇంకను నున్నచో రాణులను గాని నన్నుఁ గాని కొనిపోఁగలఁడు. రాణులను గొనిపోవుచో నాకు మోదకతృప్తి చేకూరదు. నన్నుఁ గొనిపోవుచో రాక్షసులు నమలివేయుదురు.

విశ్వా:—కుమారులారా !

గీ. తల్లులను మిత్రులను నూఱడిల్లఁ జేసి
యపుడు ప్రస్థానమంగళ మాచరింపఁ
జేయుఁడీ మీరు మనములఁ జేర్చి శాంతి
యుదయమున వని కేతేర నుండవలయు. 36

రామలక్ష్మ:—చిత్తము.

రాజు:—అమాత్యా ! వీరి నందఱను విశ్రమింపఁజేయుము. నాహృదయము పర్యాకులముగా నున్నది. అంతఃపురమున కేఁగుదును. విజయా ! దారి చూపుము.

ప్రతీహారి:—మహారాజా ! ఇటు, ఇటు.

(విశ్వామిత్రుఁడు తక్క నందఱు నిష్క్రమింతురు.)

విశ్వా:—కోరినకోరిక సిద్ధించుటచే మనసు కుదుటఁ బడినది.

గీ. చేయుదును రాము నే నద్వితీయుఁ గాఁగ
నస్త్రవిద్యల నసురుల నణఁగఁగొట్టి

రావణునిశక్తి మంద మౌటేవఁ గాంచి
తోఁప మందెదఁ గార్యసిద్ధుండ నగుచు. 32

(నిష్క్రమించును)

ఇది చతుర్థాంకము.

విష్కంభము iii

[ముగ్గురు ఋషిశిష్యులు ప్రవేశింతురు]

మొదటి:-గీ. బ్రహ్మఋషి యైనకౌశికుక్రతువు నేఁడె
పూర్తి యైనది కామ్యసంపూర్తి నొసఁగి
తత్ఫలంబుగ నిర్భయత్వంబుతోడ
మనుచు నుంటిమి సత్తపోవనమునందు.

రెండవ:—మిత్రమా! శాలంకాయనా! ఈయజ్ఞఫలము శుభప్రదమే యైనది. ఈపాడ్యమినాఁడు వనములో నిర్భయముగా మనము తిరుగఁగలము.

శాలం:—గాలవా! ఈతపోవనమున మారీచుఁడు మున్నగు రాక్షసులు విశ్వామిత్రాదులజోలికే కాని మనవంటి వారిజోలికి రాకపోయినను మనకు మిక్కిలి భయముగా నుండెడిది.

మూఁడవ:—విశ్వామిత్రాదులనే కాని యన్యులను వా రేల పీడింపరైరి?

గాల:—తామ్రాయనా! విశ్వామిత్రుఁడు పూర్వము క్షత్రియుఁడు. తపముచే నతఁడు బ్రాహ్మణత్వము నందెను. అప్పటినుండియు నతనిబ్రహ్మత్వమును బ్రాహ్మణులు

సహింపఁజాలరైరి.

తామ్యా:—ఐన, రాక్షసులు తపోవిఘ్నము కలిగింపఁ గారణ మేమో?

గాల:—రాక్షసరాజైన రావణుఁడు విశ్వామిత్రుని తపోభంగమునకు వారిని నియమించియుండెను.

తామ్యా:—రావణునకు విశ్వామిత్రునిపైఁ గోప మేల?

గాల:—విశ్వామిత్రుఁడు బ్రహ్మత్వమున నెంతవఱకుండఁగలఁడని.

తామ్యా:—అనఁగా?

గాల:—ఏదోరీతిని విశ్వామిత్రునకుఁ గోపము రప్పించినచో శమప్రధాన మగు నాతని బ్రహ్మర్షిత్వము పొల్లుపోఁగలదని.

తామ్యా:—ఆయన శాపముచే రాక్షసుల నివారింపలేదేమి?

గాల:—కోపించినఁగాని శాపము రాదుకదా!

తామ్యా:—ఎందఱో ఋషులు శపించినవారు గలరు. వారి బ్రహ్మర్షిత్వమునకు లోపము రాలేదే?

గాల:—పరంపరాప్రాప్త బ్రహ్మర్షిత్వమున కప్పుడప్పు డిచ్చిన శాపములవలన లోపము కలుగదు. ఇతని దచిరప్రాప్త బ్రహ్మర్షిత్వము. కావున, లోపము కలుగ వచ్చును. అందుచే విశ్వామిత్రుఁడు రాముని సహాయునిగాఁ దీసికొనివచ్చినాఁడు.

తామ్యా:—ఏమో. ఇతరసాహాయ్యాపేక్ష యగుట నితని తపశ్శక్తి బ్రాహ్మణునకువలెఁ బరిపూర్ణము కాదనుకొందును.

శాలం:—అది సరి కాదు. ఏలన,

గీ. యజ్ఞసంరక్షణంబున కనెడుమిషను
రామచంద్రుని గొనితెచ్చె నీమహర్షి

దివ్య మగునస్త్రముల మంత్రదీపితముగ
నతని కుపదేశ మొసరింప నభిలషించి. ౨

ఇంక,

చ. గమనముచే మృగేంద్రుని, మొగమ్మునబాలమరీచిబింబముం౯
సుమధురవాక్కులం౯ సుధను, శుద్ధగభీరతచే సముద్రు, న
త్యమలినరూపసంపద ననంగుని, నున్నతిచే హిమాద్రి, ను
త్తమతరశూరతం౯ హరిని దప్పక రాముఁ డధఃకరించెడిన్. ౩

గీ. ఇతఁడు వచ్చిన దాదిగా నీతపోవ
నము నొనర్చెను సుతపోవనమ్ము గాఁగ;
కాంచఁగంటిమి కన్నులు గలఫలంబు
నితనిపూర్ణాకృతిని గాంచి యింపు మీఱ. ౪

గాల:— ఔను. రాముఁ డలోకసామాన్యబలశాలి. రాక్షసులు మాయారూపధరులై రాత్రివేళ రాఁగా నాతఁ డొంటరిగా నిలిచి వారి నెల్లరఁ జంపి యజ్ఞమును సంరక్షించినాఁడు. మారీచసుబాహులు రావణాసురుని యనుచరులలో మహాబలవంతులు. వారు నిత్యము విశ్వామిత్రుని దృణసమానముగాఁ జూచెడివారు.! రాముఁడు వారిలో నొక్కని జంపి రెండవవానిని బాణములతో నెగురఁ గొట్టఁగా వాఁడు పోయి పోయి సముద్రమునఁ బడెనఁట.

తాపస్యా:— ఈతఁడు తాటకి యనురక్కసిని జంపినట్లు చెప్పుదురు. నిజమా?

గాల:— నిజమే.

మ. కుసుమంబుల్లతనుంజిత్రితంపఁ గడుసంకోచించునీయుత్తముం
డసమాస్త్రంబులఁ జంపెఁ దాటకను హాహాకారముల్సేయఁగా
వెసఁ గించిచ్ఛ్రమ మైనస్వేదకణికావిస్తార మూనేన రా
క్షసశస్త్రక్షతినస్త్రముల్గురియఁ నిష్కంపప్రభావాఢ్యుఁడై.

ఇట్లు మహానుభావులు

క. మృదుభావకఠినభావము
లెదలందునఁ దాల్చుచుందు రేకాస కడుఁగ
వెదకినను దోఁపనీయరు
కద ! యార్యులు గూఢభావకలితులు ధరణిన్. ౬

శాలం:—రామలక్ష్మణులు పూజనీయు లగుట కేవలము దయచేతను శౌర్యముచేతనే కాదు. ఋషిగణవినుతమైన శాస్త్రపరిజ్ఞానముచేతను వారు మనల నెల్లరిని మించుచున్నారు.

తామ్యా:—ఏల యిట్లు స్తుతింతువు? వారు రాజపుత్రులనియా? వారి కెప్పుడును జక్కని కమ్మని భోజనము, దాసులసేవ, తలిదండ్రులలాలనము, వైద్యుల యుపచారములు, ప్రేమతోఁ గొట్టక తిట్టక చదువు నేర్పు గురువులు, ఇఁక వారికిఁ జదువు వచ్చుటలో వింత యేమి? మనము రోగమువచ్చినను మానక గురుసేవ నిత్యమును జేయుదుము. భిక్షకుఁ బోవుచు నేయుందుము. దానంతట నది యెంత లభించిన, దానితోడనే జీవయాత్ర గడపుదుము. గురువులకు భయపడుచుందుము. నేలమీఁదనే పరుందుము. పాఠము చదువుకొనుటకే మన కవకాశము కుదురదు. ఇట్టిమనయల్పవిద్య వారి

యధికవిద్యకంటెఁ బ్రశస్తమైనది. మనగురువులు వారిని నుతించుట రాజపుత్త్రులనియే కాని విద్యఁ జూచి కాదు.

గాల:—ఓరీ! మూర్ఖా! గురువుల నాక్షేపింప రాదు.

తామ్యా:—నిజమైనమాట చెప్పితినే కాని యాక్షేపింప లేదు.

శాలం:—గురువులకు నిందకలిగించువచనము సత్యమైనను బలుక రాదు. వినరాదు. గురువు లనాలోచితముగా నే పనియుఁ జేయరు.

తామ్యా:—ఐనదో, గురువులు స్వలాభ మపేక్షింతురే కాని గుణ మపేక్షింప రన్నమాట.

శాలం:—ఓరీమూర్ఖా! నీవచనములలో నాస్తిక్యము తోఁచుచున్నది. నే మిఁక వినఁజాలము.

తామ్యా:—సత్యవచనములకు సమాధానము చెప్పలేక నాస్తికవచనములుగాఁ ద్రోసివేయుదురు.

శాలం:—అజ్ఞానచేతస్కులు హేతువుఁ జూపినను శాంతింపరు. (చూచి) ఆహా! రామలక్ష్మణులు తన్ననుసరింప విశ్వామిత్రు లిటకే విచ్చేయుచున్నారు.

గాల:—(చూచి) ఔను. విశ్వామిత్రభగవానులే.

గీ. రాజపుత్త్రులతోఁ గూడి పూజితు లగు
బ్రహ్మమయులు విశ్వామిత్రపరమఋషులు
వచ్చుచున్నారు శ్రుతతపోభరిత మైన
వేద పిట్టులు మూర్తీభవించె ననఁగ. 2

(నిష్క్రమింతురు)

ఇది శుద్ధవిష్కంభము.

యజ్ఞఫలము

పంచమాంకము

[అంత రామలక్ష్మణులతో విశ్వామిత్రుఁడు ప్రవేశించును]

విశ్వా:—వత్సలారా! రామలక్ష్మణులారా! విద్యాస్త్రములు మీరు నాకడ గ్రహించి యజ్ఞమును రక్షించినారు. రక్కసు లుక్కడఁగిరి. నా కెంతో సంతోష మైనది.

గీ. ఎంతసుక్షేత్రమున నైన నిడినధాన్య
మొక్క నెలనైన సుఫలంబు నొసఁగలేదు
ఇపు డొసంగినయస్త్రమ్ము లిపుడె నాకు
నుత్తమఫలంబు నొసఁగె శుభోదయముగ. ౧

రాము:—నేము మీయాజ్ఞఁ బాలించి మీబహుమాన ఘందితిమి ధన్యులము. ఉత్సాహమును బురికొల్పుటకు గురువులు శిష్యు లెంతసామాన్యు లైనను వారిని నుతింతురు.

విశ్వా:—ఓయీ! రామా!

గీ. ప్రబలరాక్షసఘాతశౌర్యప్రసిద్ధ
వీరుఁడవు; రావణశ్రీవికారహేతు
భూతుఁడవు; నేను జాలకపోయినట్టి
పని యొనర్చితి వాసురభంజనమున. ౨

రాము:—దేవా! మీతపోబలముచేతనే నేము రాక్షసులఁ జంపఁగలిగితిమి. లేనిచో, మహాబలవంతు లైనను

జయింపఁజాలని రక్కసు లెక్కడ? కసుఁగందుల మగు నే మెక్కడ?

గీ. అరుణకాంతులు చీకట్లు నణఁచు ననుచు
జనులు తలపోయుదురు గాని సత్య మరయ
నరుణబాలకు ముందుంచి యాత్మతేజ
మట్లు ప్రసరింపఁ జేయుఁగాదా? యినుండు. 3

విశ్వా:—వత్సా! నిజమే. కాని,

మ. మొలచునస్త్రాళి మహాతపఃఫలమరసంబుల్మెఱఁగొంగొంగఁ గాసిభూ
స్థలి కల్పించునె యోషధీతతికి నిష్టం బౌరసం బెన్నఁడేఁ?
వెలయుం దీయఁదనంబె యిక్షువున నావేశించి ప్రత్యేకమై
యిలని ట్లోగురుప్రమోల శిష్యమహిమంబే మిన్నయై చెన్నగున్.

నే నస్త్రముల నిచ్చితిని. మి మ్మాశ్రయించి యవి మీమహిమవలన రాక్షసవినాశసమర్థము లైనవి.

రాము:—నిజమునకుఁ దమయస్త్రములను జక్కఁగా నుపాసించినవాఁడు లక్ష్మణుఁడు. తటస్థుఁడనై యున్నను నాకాతనిగౌరవము తక్కినది.

లక్ష్మ:-భగవానుఁడా! మాయశమునకు హేతుభూతు లగు మీరు దయతో నల్ప మగుమాయుద్ధమును గౌరవించుచున్నారు. సర్వరాక్షసనాశనము చేసినయార్యుఁడు నన్నభినందించుచున్నాఁడు. కానిండు. బాలుఁడనైననే నొనర్చినయుద్ధమును ప్రశంసించు నెడ నది మీ వాత్సల్యమునకు ఫలమే కాని యన్యము కాదు.

రాము:—దేవా! శ్రావణశ్రీ విరూపిత మైనట్లు చెప్పితిరి. సుబాహుమరణముచేతను, మారీచపరాజయముచేతను

నది యెట్లు సంభవించును ?

విశ్వా:-వత్సలారా ? వివిధాస్త్రశస్త్రప్రభృతులు, మాయా రూపులు, మహాబలులు నగుసీమారీచసుబాహులు వైవస్వతక్షత్త్రిశాసిత మగుసీప్రదేశమునం దపోవనము నందు సేనానివేశము కల్పించుకొనిరి. ఈయిరువురం నెవ్వరు చంపుదురో వారివలననే తనకు మరణ మగు నని రావణునినిశ్చయము. నేఁడు సుబాహుఁడు మరణిం చుటచే రావణశ్రీ విరూపిత మైనది. మారీచపరాజయ మువలన రావణరాజ్యలక్ష్మికి వైధవ్యసూచక మగు పాణిరేఖ జనించినది.

రాము:-రావణుఁడు మహాబలుఁ డని వింటిమి. ఆతనితోఁ గూడ యుద్ధము చేయవలసియుండు ననుకొందును.

విశ్వా:-నిజము. ఆతఁడు మహాబలుఁడే కాని, యల్పుఁడు.

గీ. త్వాదృశులకీర్తి వీరులు దాంతులు నగు
వారు మెత్తురు సైఁప రల్పజ్ఞు లెపుడు
తనకు నొకనాఁడు నీకు నాతనికి యుద్ధ
మిలను నిలుచు విరుద్ధశక్తుల నొకండె. ౫

రాము:-మే మొకరి నొక రెప్పుడును జూచియుండ లేదు. పర స్పరాపకారము లెఱుఁగము. మఱి మా యిరువురకు విరోధ మెట్లు కలుగును ?

విశ్వా:-గీ. ఏల పంచాస్య ముఱుము సహింపకుండు
నదియె యేనుగుల నేల చెండాడు నడవి ?
ప్రకృతి యిది వీరు లన్యప్రభావ మింత
సైఁప నొల్లరు కానిచోఁ జత్తు రిలను. ౬

రాము:—వానికి నాకు యుద్ధ మేల వచ్చును ? ఎవరు గెల్తురు ?

విశ్వా:—గీ. ధర్మవైషమ్యహేతువు తనర నెపుడొ
వానికిని నీకు యుద్ధంబు వచ్చు నిజము;
అందు సందేహ మేల విఖ్యాతభంగి
నీకె జయ మగు సాధువినీతభావ ! ౭

రాము:—ధర్మవైషమ్య మెట్లు కలుగును ?

విశ్వా:—రావణుఁ డధర్మరాక్షసాధిపుఁడు. ఇక్ష్వాకువంశజుఁడ వైననీ వాశ్రితధర్మసంరక్షకుఁడవు. ఆతఁడు ఋషిజనాపరాధి. నీవు ఋషిపూజాపరుఁడవు. ఆతఁడు బలగర్వితుఁడు. నీవు వినయశీలివి. ఆతఁడు స్వబలప్రధానుఁడు. నీవు ధర్మప్రధానుఁడవు. ఆతఁడు భ్రాతృశత్రువు. నీవు సౌభ్రాత్రుఁడవు. ఈ వైషమ్యములచే యుద్ధము సంభవించును. స్వయంకృతాపరాధముననే యాతనికిఁ బరాజయము నీవలననే యగును.

రాము:—దేవా ! యుద్ధమే సంభవించినచో మీ రన్నట్లు నాకు విజయము తప్పదు. ఏ మందురా ?

క. గురువులయాశీర్వచనము
పురజనసంప్రీతి మంత్రపూతాస్త్రంబుల్
మఱి లక్ష్మణసాహాయ్యము
దొరకెను నా కింక జయము దుర్లభ మెటులో ? ౮

విశ్వా:—నిజమే. మీయిరువుర నెప్పుడును విజయమే వరించును. మీయుభయులతో రణమునకుఁ దొడఁగిన యముఁడును నిర్బలుఁ డగును. నీకును రావణునకును యుద్ధము కొంతకాలమునకు వచ్చును. రావణుఁడు

కారణము లేక యుద్ధమునకు దిగఁడు. నీవును నయ వినయుఁడ వగుట నల్పకారణమును గణింపవు దీని కేమి కాని, రామచంద్రా! నీచే నెలయింపఁబడిన శాంతి నేఁడు తాపసులయందే కాక, పశుపక్షివృక్షాదు లందును గాన్పించుచున్నది. చూడుము. అదిగో! ఆమునిబాలకులు ప్రసన్నులు నిర్భయులునై మహాబల వంతుఁడు తమకు రక్షకుఁ డయ్యెఁగదా యని నిర్విచార ముగా నాడుకొనుచున్నారు. సరోవరములు ప్రసన్న గంభీరములై యున్నవి. ఆహా! అందలిమీనకిశోరము లెంత మనోహరముగా సంచరించుచున్నవి! ఆసరో వరము ప్రసన్నతరంగహస్తములతో మనల నాహ్వా నించుచున్నది. చూడుము. రామా! [సీయఁగా;

చ. వినమున ప్రత్యవిఘ్నములు పాయఁగ, నింద్రుఁడు వృష్టి
వినుతము నౌసమృద్ధి కనిపింపఁగ సస్యము పండఁగా; సరో
వన మతినిర్మలంబు సుఖవంతము పుష్కలమై చెలంగఁ బెం
పును గను భూమి నీదయినభూరిపరాక్రమరక్షణంబునన్. ౯

రాము:—ఆహా! ఈతపోవనరమణీయత యెంతని కొనియాడ దగును?

గీ. ఫలభరవినమ్రబహుపాదపాళి సస్య
సమితి మును జూచితిని నగరముల దరిని
గాని, యిట్టియపూర్వసౌఖ్యప్రదంబు
రామణీయకముం జూచినామె యెపుడు? ౧౦

విశ్వా:—నగరములందలిరమణీయత కృత్రిమము. సర్వభోగ్యము కాదు. కావున నసహజము. ఎట్లన,

శా. ఆరామంబులుఁ గేళిభూధరము లత్యంత ప్రయత్నంబులన్
బౌరుల్ పెంచి భజింత్రు నట్టివులశోభాహీనభంగిన్ వన
శ్రీరమ్యత్వముఁ గాంచ వయ్యవి; మృగశ్రేణిన్సదా చెంతకున్
జేరం ద్రోలుదు రొక్క యాకయిన వాని న్ముట్టనీకుండఁగన్.

గీ. మృగము లేపంటపొలముల మేఁతకొఱకు
వచ్చినను ద్రోల రిట కృషీవలులు కరుణ;
నగరసంపర్క మెఱుఁగ రన్నంబు నమ్మ
నిచ్చగింపరు ప్రజలు ధనేచ్ఛఁ దవిలి. ౧౨

లక్ష్మ:—భగవానులు సరిగాఁ జెప్పిరి. ఏలన, నాగరకులు,

గీ. పురి మహోన్నతసౌధాదిభోగములను
ననుభవింతురు కళయె ముఖ్యంబు గాఁగ
వైరస్యాన్యంబు సహజసంపద్యుతంబు
విజనవనసౌఖ్య మెఱుఁగ రేవేళనైన. ౧౩

మఱియు,

గీ. పురములోఁ గృత్రిమంబు మత్సరయుతంబు
దుఃఖదం బౌను సర్వ మిందునఁ దలంప
వాస్తవికమును బ్రకృతిశోభామహత్వ
వాసితం బయి వఱలు సర్వము మహాత్మ! ౧౪

రాము:—దేవా!

శా. బాలార్కప్రతిబింబశోభల సరోంభఃపూర మేపారు, సు
శ్రీలంబై యుప మేఘమై విమలమై చెల్వొందు నాకాశ,మా
శాలోభాదివిహీనసన్మునిజనస్వాంతోపమం బీయుగం
బోలిన్ నైజశుభప్రభావినిమయోదోద్యోగంబునం దోఁచెడిన్.

విశ్వా:—వత్సలారా!

చ. విరహిణులట్లు నిర్మలత వీడి యడంగినదిక్కు లెల్ల నే
యమునిరాకకల్మి జలదావరణంబుల వీడి పొంగెడిన్
సరసిజనేత్ర పావనములు ప్రస్తదుకూలముఁ గట్టుపోల్కి సుం
దరచలదూర్మిహస్తములఁ దాఁపుఁ దటంబు నిరంతరంబుగన్.

రాము:— ఇందలిస్వచ్ఛసరోవరజలములఁ దోఁచుసూర్యబింబము
మహామునిమానసమునందలివిజ్ఞానమువలె భాసించుచున్నది.
హింసాహీనములై పక్షులు తీరముల యోగులవలె
శాంతిసుఖ మందుచున్నవి.

లక్ష్మి:— గీ. సరసులోనియగాధంబుజలములోన
నెనఁగు నుత్తమమానసౌకసము లవ్వో
సకలరసపూర్ణకవిచిత్తసద్మమందుఁ
బరగునుజ్జ్వలనూత్నభావములభంగి. ౧౭

రాము:— ఇది చాల యుక్తముగ నున్నది.

ఉ. కేకులు ధూమయోనిక స్వకీయమహోన్నతనృత్తవైభవో
ద్రేకము చూపె స్వాగత ముదీర్ణత నిచ్చె నినుండు ఘన్నుఁడో
వేసవవేళ, మేఘములు విచ్చినవెంటనె దీప్యమానుఁడై
పైకి నినుండు రా నెమిలిపక్షము రాలుట న్యాయ్యమే కదా!

విశ్వా:— వత్సలారా! ఈశరత్కాలశోభ యింకను జూడుఁడు.

గీ. ప్రబలశత్రుఘనాంధకారమ్మునందు
నడఁగి యుఱుముల మెఱుపుల నడలునినుఁడు
నిర్మలాకాశమునఁ బొల్చె నేఁ డతని
గాశవీజసముల శరత్కాంత కొలువు. ౧౮

మఱియు,

ఆ. మేఘపటలి వాయుమింట జిగ్వీజయి యగా
ప్రభుఁడువోలె మించుపద్మహితుఁడు
ప్రజలువోలె నదులుఁ బద్మాకరంబులుఁ
జూచుఁ బద్మనేత్రశోభ నెలయు. —౨౦

ఇట మన కీతపోవనమున శరత్సుషమ సాక్షాత్కరించినది. అతిరమ్య మగుటవలన నిది నిత్యనూతన మగుచున్నది. తపోవనాంతికమున వన్యఘోషమును గనఁదగినదే. నగరసమీపమందలి గొల్లపల్లెలవలె నిందలిపల్లెలు వ్యవహారాకులములు కావు. ఇందలిజనులు మృగసమాన వృత్తులై యాత్మధర్మముల నెఱుంగనివారైనను నధర్మముమాత్ర మాచరింపరు. పరస్పర వైరములు, పరధన కాంక్ష యే ఱెఱుంగరు. గ్రామీణస్త్రీలు నిత్య మాతిథ్య పరలు. అపకారమునైనను వీ రతిశీఘ్రముగా మఱతురు. మిమ్ము వా రభినందింపఁగలరు. చూచెదరు గాని.

రాము:—అట్టివారిని దప్పక చూడవలయును.

లక్ష్మ:—మనస్సులు శరీరములుకూడ వనశోభచే నాకర్షింపఁబడుచుండఁగా మనము చాలదూరము వచ్చితిమి. ఇపుడు నిసర్గము, ఆర్జవానుకృతము నగుతపస్విచరితము భగవాను లన్నట్లు ప్రత్యక్షముగాఁ జూడఁ గందుము.

(అందఱు నడతురు)

లక్ష్మ:—(చూచి) ఆర్యా! చూడుము.

గీ. సస్యభారనతంబులై స్వర్ణకాంతి
నలరుకలమపు కెన్ను లొారార! యిచటఁ

దల్లియగా క్షేత్రభూమికిఁ దగ నుపాయ
సముల్లసిల్లుచున్నయట్లు గన్పట్టుచుండె. —౨౧

విశ్వా:—ఆయెదుటఁ గూర్చుండియున్నకృషీవలులఁ గంటిరా? వారు క్షేత్రములు చక్కఁగా దున్ని చదునుచేసి యాకుమళ్ళు పెంచి దమ్ముచేసి వర్షము కురియఁగా నూడ్చి పిదపఁ గలుపుతీసి రేయింబవళ్ళు కనిపెట్టుకొనియుండి శ్రమఫలము లగుసస్యములఁ గోసికొందురు. ఈక్షేత్రోపజీవు లింద్రభోగములనైనను దృణప్రాయములుగాఁ దలంతురు. వారి కెవ్వరీడు రారు. కష్టఫలమును గను ఘనులు ధన్యాత్ములు నిజముగా వారే. ఈరీతిఁ బండిన సస్యములో

ఉ. దైవతపైతృకక్రియ లతంద్రనృపాతిథిబంధుమిత్రసే
వావిధియుక్తభాగములఁ బంచుచు ధాన్యమునున్న దానితోఁ
బావనభంగి బిడ్డలను భార్యలఁ బెంచుచు భూమినుండియే
భావిఫలంబుఁ గోరుచు శుభస్థితి నుండుదు రీకృషీవలుల్.

లక్ష్మి:—ఈకృషీవలులచరిత్ర మతిశ్లాఘ్యము.

విశ్వా:—నిజము. ఏ మనిన

గీ. శ్రమ గణింపక దైవవిశ్వాసమునను
దొరకినది తృప్తిగాఁ దిని దోషభావ
రహితులై మిక్కిలి సుఖంత్రు రమ్యభంగి
సర్వజీవితహేతువుల్ సజ్జను లయి. —౨౩

అంతేకాదు. వారికి

గీ. క్షేత్రమే కర్మభూమి కళత్రసుతులె
సర్వలోకము సర్వదా సౌమ్యధేను

జాల మది బంధుతతి యథాశక్తి మఱియు
నతిథిపూజయె ధర్మ మీనుతగుణులకు. ౨౮

రాము:-ఆహా!

చ. శ్రమపడఁ గల్గినట్టిఫలసంగతి స్వల్పమె యయ్యు వార లు
త్తమమగుతృప్తితోఁ గొని సదా ముదమందుచు జీవయాత్రని
ర్గమము లయి పుత్త్రు లెన్నఁడుఁ బరస్పరవైరము లేక దాంతులై
యమలినమానసాబ్జులయి యాదుకుపూజ్యులు సర్వరీతులన్.

బహుగుణవంతు లయ్యు వీరు తమ్మధములుగానే తలఁచుచుందురు. వీరిలోఁ గొందఱిని నగరమునకుఁ దీసికొనిపోవఁ దలఁపు కలుగుచున్నది. అట్లు చేసిన యెడల నిజముగా నగరములు నాకపురములను మించి తపోవనతుల్యము లగును.

విశ్వా:-నగరమునకుఁ గొనిపోయినచో వీరికి సర్వగుణములు వినష్టము లగును. వీ రటఁ గృషిమాటయే మఱతురు. ఇచట నిగర్వులై యున్నవీ రచట మహారాజునైనను లెక్కింపరు. అభ్యాగతసేవాపరాయణు లగువీ రచట దాంభికులై తమవారినే మన్నింతురు. అచట వీరికిఁ గ్రమముగా నగరదోషము లంటును. ఎవ రెచట నుండుట సహజమో వా రచటనే యుండుట గుణకరము. తమపనులఁ దాము చేసికొనుచు దురాశావిహీనులై యున్నవీరి నిచ్చటనే గౌరవింపఁ దగును. రాజువలనను నాగరకు లగుపౌరులవలనను నేబాధయు లేక వీరు సుఖించునట్లు మహారాజ వగునీవు యత్నించినఁజాలును.

రాము:-భగవానులు పరిణామదర్శులు. అందఱకు స్థిర మగు

సుఖముఁ గోరుచుందురు.

లక్ష్మ:-భగవానుఁడా! గ్రామీణగుణకర్మవ్యవహారము వన శోభతోఁ గూడ నింకను గనఁ గోరుదును. కన్నుఁ గాని నేత్రములకుఁ బూర్ణతృప్తి లేదు. పర్ణశాలను దాఁటి దూరము వచ్చితిమి. అస్తాద్రిశిఖరమున నస్తపదుఁ డైన దివాకరభగవానుఁడు రేపు మరల నుదయించుటకు నేఁటి చరమప్రభుత్వముఁ జూపించుచున్నాఁడు.

గీ. అస్తమింపఁగ నుండియు నర్కకరము
లస్తగిరిశిఖరంబులయందు నిలిచె
మంద తేజస్కు లయ్యును మహితు లవని
వదల రాత్మీయ మాహాత్మ్యంబు నెపుడు. ౨౬

విశా:—నగరనివాసు లగుమీకు గ్రామ్యశోభ యింకను నూతన ముగనే యుండును. మనము ప్రతిదిన మిచ్చటికి రాఁ జాలము కావున నదిగో! ఆపల్లెయందు సాంధ్య కృత్యములు నిర్వర్తించుకొని గ్రామస్థులయాతిథ్యము స్వీకరించి రాత్రి యచటనే కడపుదము.

లక్ష్మ:—చిత్తము. (అందఱును నడతురు)

రాము:—ఆహా! వనమునుండి గోగణములు తిరిగివచ్చునీదృశ్య మెంతరమణీయముగా నున్నది! ఈగోవులు

గీ. సడల నడవిఁ బవిత్రత నడరఁ జేసి
మేసి వివిధౌషధులఁ దృప్తి మీఱ నింట
బుదుతమూడలకును బాలు గుడువఁ బెట్టఁ
గదలివచ్చెడి మెలమెల్లఁ గదుపుకట్టి. ౨౭

లక్ష్మ:—ఆర్యా! బాగుగాఁ జెప్పితివి.

గీ. వత్ససందర్శనోత్కంఠ వాయ లేక
బహుపుపొదుగుల మోయుచుఁ బర్వు లేక
వ్రజనిహితదృష్టులై యిటే వచ్చుచుండె
ధేనువులు దీర్ఘశృంగసమ్మానితములు. —౨౮

రాము:—

మ. తమకై తల్లులు వేగవచ్చుటను వత్సల్ గంతు లేయంగఁ బ్రే
మను మీఱం గని గోగణంబఱచి యంబాయంచుఁ బాలేపునీ
యమలోద్యత్ప్రణయైకదృశ్యమిటులౌరా! యద్భుతం బేమిలా
భమునాసించునో పుత్రిమాలమున గోవర్గంబులోకమ్మునన్.

విశ్వా:—(ముందు చూచి) అదిగో! ఎవరో వృద్ధురాలగు గోపిక
వేగముగా లేగలకుఁ బచ్చగడ్డిమోసికొనివచ్చుచున్నది.

[వృద్ధగోపిక ప్రవేశించును]

విశ్వా:—(చూచి) వృద్ధా! స్వస్తి.

వృద్ధ:—ఋషీ! దండాలు.

విశ్వా:—ఇంట నందఱును క్షేమమా?

వృద్ధ:—ఆ. మాబిడ్డలతండ్రి కోడలిని దీసికొనివచ్చుటకై
గ్రామాంతర మేఁగియున్నాఁడు. పుత్త్రులు క్షేత్రసస్య
ములు రక్షించుచున్నారు. మనుమ లింటిపనులు చేయు
చున్నారు. మీరు మాలోగిలికి వచ్చి పవిత్రము
చేయుఁడు. ఈకుమారు లెవరు? ముద్దువచ్చుచున్నారు!

విశ్వా:—దశరథమహారాజుపుత్త్రులు.

వృద్ధ:—వీరిపేళ్ళో?

విశ్వా:—(చూపి) ఇతఁడు రాముఁడు. పెద్దవాఁడు. ఇతఁడు

లక్ష్మణుఁడు.

రాము:–(చేరి) వృద్ధా ! సూర్యకులజుఁడగు రాముఁడు నమస్కరించుచున్నాఁడు. (నమస్కరించును.)

లక్ష్మ:–(చేరి) వృద్ధా ! రామానుజుఁడు నమస్కరించుచున్నాఁడు. (నమస్కరించును)

వృద్ధ:–చిరంజీవులు కండు. (చూచి) ఏమి ? ఇరువురును ధనుస్సులు ధరించినారు ?

విశ్వా:–క్షత్రియులు నిత్యము ధనువులు ధరించి ధర్మరక్షణము చేయుదురు. వీరు దుష్టకారకు లగు రాక్షసులను జంపినారు.

వృద్ధ:–ఈగ్రామవనముల మృగములనుమాత్రము చంపకుఁడు.

లక్ష్మ:–ఇవి మీకు సస్యహాని కలిగింపవా ?

వృద్ధ:–ఐనను, చంపకు. బెడ్డలు విసరి మేము వారించుకొందుము.

లక్ష్మ:–నీ కపకారము చేయువానిపైఁ గూడ నీపక్షపాత మేల ?

వృద్ధ:–ఈమృగములు సహవాసముచే మాచుట్టము లైనవి. అవి బెదరి పరుగులెత్తిన నెంతయుందముగా నుండునో !

విశ్వా–(రామునితో) వీరిదయార్ద్రహృదయముఁ గనిపెట్టితివా ? అపకారులయెడ నైన వీరు కోపింపరు. వారిగుణముల నుతింతురు.

రాము:–ఔను. నిజముగా వీరు దేవతుల్యులు.

విశ్వా:–వృద్ధా ! పోయి రమ్ము. మేము సంధ్యవార్చి మీ యింటికి వచ్చెదము.

వృద్ధ:–సరే. (నిష్క్రమించును)

విశ్వా:–వత్సలారా ! మీ కీకృషీవలుల నేల చూపించితిని ?

లక్ష్మ:—అల్పసంపన్ను లయ్యు వీ రత్యంతతృప్తమనస్కు లని.

ధామ:—మాకు వ్యవహారజ్ఞానముకొంచెకు. స్వయముగాఁ జూడకున్న చో వీరివ్యవహారనిర్ణయము చేయఁజాలము. నాగరకు లగుపౌరులు పాటవముచేఁ దమ పక్షము సాధించుకొందురు. నాగరకుల మగుమేము వీరివృత్తము స్వయముగాఁ జూడకున్న వ్యవహారనిర్ణయము కష్టతరము.

విశ్వా:—బాగుగాఁ జెప్పితిరి.

ధామలక్ష్మణులు:—(విశ్వామిత్రునకు నమస్కరింతురు)

విశ్వా:—(తనలో) నేఁటికి వీరిని రావణుని యుద్ధములో జయింప సమర్థు లగునట్లు చేసితిని. వ్యవహారజ్ఞానము నలవఱచితిని. వీరు శ్రమచే డస్సియున్నారు. ఆవల దశరథుఁడు పుత్త్రవియోగమున దుఃఖించుచున్నాఁడు. ఇఁక వీరిని లు చేర్పవలయును. జనకమహారాజు చేయుసాంవత్సరికసత్త్రయాగము నభినందింప నాహూతుఁడ నైతిని. సర్వగుణమనోహర, జనకపుత్త్రి, యగుసీత యాతని దేకదా! ఆతనికడఁ గలశివధనుస్సును రాముఁడు కాక యింకెవఁడు సజ్యము చేయఁగలఁడు ? (ఆలోచించి) రాముఁడే సీతను బెండ్లాడితీరును. ఈరీతిని నేను దశరథునిఋణము తీర్చుకొందును.

రాము:—(నిరూపించి) భగవాను లేదో యాలోచించుచున్నట్లున్నారే ?

విశ్వా:—ఔను. మనము విదేహాధిపునిఁ జూడ నేఁగవలసి యున్నది. ఆయాత్రనుగూర్చి యాలోచించుచున్నాను.

రాము:—అక్కడను రాక్షసబాధ లేమైనఁ గలవా ?

విశ్వా:—ఉన్నను, నీవు వచ్చినమాత్రమున నవి శాంతించును. జనకుఁడు సాంవత్సరికసత్ర మొనరించుచున్నాఁడు. సత్త్రాంతనమునభినందింప రండని నన్నాహ్వానించినాఁడు.

లక్ష్మ:—ఐన మేమును మీతో రావలసియుండునా?

విశ్వా:—తప్పక. మీరాకవలన యజ్ఞసమాప్తి సఫలము కాఁగలదు.

లక్ష్మ:—మరల నయోధ్యకు మ మెప్పుడు తీసికొని పోవుదురు?

విశ్వా:—ఆరాజర్షి యొక్క యజ్ఞఫల మనుభవించినపిదప.

రాము:—ఎట్లు?

విశ్వా:—అట కేఁగినతరువాత మీరే స్వయముగా ననుభవింతురు.

లక్ష్మ:—అట్లే కాని,

గీ. చేయఁబోయిన కార్యసంసిద్ధి ముందు
తెలియ నుత్సాహ మది యత్యుద్దీర్ణ మగును;
ఫలము తెలియనికర్మంబుఁ జలుపు టన్న
మాంద్య మగుఁ గాదె ధరణిలో మానవులకు. ౩౦

రాము:—వత్సా! ఫలము తెలియనికర్మ మందు వేల? అట కేఁగినతరువాత ననుభవింతు రని భగవాను లన్నారు కదా!

విశ్వా:—ఫలస్వరూపము ఫలము లభించినపిదపనే తెలిసికొనఁదగినది.

రాము:—అట్లేయగుఁగాక! భగవానుల యాదేశమునకు వివాదము కుండదు.

లక్ష్మ:—ఔను.

విశ్వా:—(తనలో) రామునకు సీత లభించుటతో నాయుద్దేశ మింతవఱకు సఫల మగును. రాముని కస్త్రవిద్య యొసఁగుట లెస్స యైనది.

శా. కంటిన్ బ్రహ్మఋషిత్వ మీభువిఁ దపఃకర్మంబునన్ నేన చేకొంటిన్ జృంభకసాయకంబులు జగచ్ఛోభన్ నివారింపఁగా నుంటిన్ శాంతిఁ దదస్త్రసంతతి మహార్హంబైనరామునకుఁ చేకొంటన్; గష్టఫలంబు వ్యర్థమగుట న్గోరంతగా యెవ్వఁడున్.

(నిష్క్రమింతురు.)

ఇది పంచమాంకము.

ప్రవేశిక ii

[అంత ముగ్గురుభటులు ప్రవేశింతురు]

మొదటివాఁడు:—ముష్టికా! తపోవనమునుండి వచ్చిన విశ్వామిత్రులవారు కూర్చుండి యున్నారు. మనము వారి పాదసేవ చేయ నియోజితులము కదా! ఆమహర్షి యిచట నెన్నాళ్లుందురు?

రెండవవాఁడు:—ఓరీ! స్థూలాంసా! ఎన్నాళ్లుందురో యెఱుఁగను. ఆమునతో నున్నసుకుమారు లిరువురు రమణీయాకృతులు. విశ్వామిత్రసేవాపదేశమున నాసుకుమారుల నిరువురను జూచి దృష్టి సఫలము చేసికొంటిని.

మూఁడవవాఁడు:—ముష్టికా! వారు యువకులు. కుమారు లందు వేల?

ముష్టి:—దండబాహబా ! వారిని "కుమారులారా" యని విశ్వామిత్రులు మహారాజును బిలుచుచుందురు. అందుచే నేను నట్లంటిని.

స్థూలాం:—జ్యేష్ఠుఁడగు రాముఁడు యౌవనవికారమునఁ జిక్కినాఁడు.

దండ:—ఇది యెట్లు తెలిసినది ?

స్థూలాం:—ఆతఁడు మహారాజకూఁతురు సీత నుద్యానవనమునఁ జాలసేపు చూచినాఁడు.

ముష్టి:—లక్ష్మణుఁడు నీడవలె రాము ననుసరింప విశ్వామిత్రులేదో యుపదేశవ్యాజమున దూరమునకుఁ గొంపోయి రాము నొక్కనినే యుద్యానవనమున విడిచినారు.

స్థూలాం:—మనరాజకుమారికూఁడఁ జెట్టువెనుక దాఁగి రాముని జాలసేపే చూచినది.

ముష్టి:—రాజానుమతి యున్న వారికి వెంటనే పెండ్లి యగును.

దీర్ఘ:—కానినాఁడు వా రిరువురకుఁ బిచ్చియెత్తును.

ముష్టి:—ఇది మహారాజునకు విశ్వామిత్రునకుఁ దెలియునా ?

దీర్ఘ:—తెలియును. అందుచేతనే వారి నేకతమున విడిచి యుందురు.

స్థూలాం:—వారివివాహమహోత్సవము శీఘ్రమే చూచి జన్మము తరింపఁ జేసికొందము.

దీర్ఘ:—(చూచి) ఓహో ! రాముఁ డిటే వచ్చుచున్నాఁడు. మనపని చూచుకొందము. (నిష్క్రమింతురు)

ఇది ప్రవేశిక.

యజ్ఞఫలము

షష్ఠాంకము

[మదనావస్థలో రాముఁడు ప్రవేశించును]

రాము:—(పరిక్రమించి దీర్ఘనిశ్వాసము విడిచి)

గీ. స్వచ్ఛసుందరశరదిందువదన నామె
నచటఁ గుసుమాపచయవేళ నరయు టాది
సర్వమును విస్మరించి నాస్వాంత మెపుడుఁ
దన్ముఖాంబుజదర్శనోత్కంఠఁ దనరు. ౧

ఆహా !

గీ. విధి జగన్మోహనార్థ మీవిధు మోమ్ముఁ
జిరము యత్నము చేసి సృష్టించెనేమొ
కాక స్త్రీరూపనిర్మాణకౌశలమునఁ
గంతుఁడు సృజించెనో విధిగర్వ మడఁప. ౨

ఆహా ! చిత్రము.

గీ. ఒక్కసారి కనుంగొని యున్నమాత్ర
మఱచిపోయితి సర్వమ్ము మతి కలంగ
నింక నొకమాఱు కనుఁగొన్న నేమి యౌదు
నో యెఱుంగను బళిర ! మనోహరాంగి. 3

మఱియు,

మ. పరమానందముతోడ వత్సలతతో బాల్యంబునం దల్లి మ
త్పరమై స్తన్యమొసంగు టాదియెఱుఁగ న్బ్రాసాదమున్వీడి నా

కరయ న్మానసలౌల్య మెన్నఁడును లేదారాక్షసశ్రేణి పెం
పఱఁజేయ న్దలియింప; నాకిపుడు సంప్రాప్తించె నున్మత్తతల్.

యజ్ఞవిఘ్నకారు లగురాక్షసులను శస్త్రాస్త్రముల నాశముచేసి నాయాత్మశక్తి సుస్థిర మనువిశ్వాసముతో నుంటిని. అట్టినాయాత్మశక్తి యత్యల్ప మని యీసంఘటనమువలనఁ బరమేశ్వరుఁడు జ్ఞప్తి చేయుచున్నాఁడు. ఆహా! మరల నామెను జూచుకోరిక ప్రవృద్ధమై జ్వరమువలె నాదేహము నంతయుఁ దపింపఁ జేయుచు నిట్టి యకార్యమునైనఁ జేయించుచున్నది. ఇదివఱకెన్నఁడును విశ్వామిత్రమహర్షి యనుజ్ఞ లేక యేకార్యమును జేసియెఱుఁగని నేను నేఁడాయనయాజ్ఞ లేకయే దొంగవలె నిచ్చటికి వచ్చితిని. మహావనములయందు మహారణములయందు సర్వదా వన్నెడఁబాయక యాత్మవలె నుండులక్ష్మణునిఁగూడ విడిచి వచ్చితిని. లక్ష్మణునిఁ గాని గురువులను గాని యడుగ లేదు. ఇది న్యాయమా యన్యాయమా యని విచారణ లేదు. హృదయ మప్రయత్నముగా నామెయందు బద్ధమైనది. విషయములకుఁ జలింపని యారాముఁడను నేనే? కానిమ్ము. విశ్వామిత్రులకు దూరమున నుండుట మంచిది కాదు. ఇఁక, సమీపమున కేఁగెదను. అవిజ్ఞాతకులాచారస్త్రీదర్శనప్రసంగమునుండి మనస్సును మరలించెదను. కాని,

గీ. ఈమెఁ జూడక యానందహీన మగును
నా మన స్సది; ఇఁకపైని నేమి యయినఁ

బరమపావన మహానార్యచరిత మొల్లు
విడువఁ జాలుదుఁ గామప్రవృత్తిఁ దవిలి ? ౫

(పరిక్రమించి) ఆహా ! అడుగు పడుట లేదు.

గీ. ఒక్కయడుగైన నిడఁజాల కున్నవాఁడఁ
గరము బంధింపఁబడెనేమొ చరణయుగళి
ఆమెఁ జూడక యీకన్ను లౌర ! యొండు
చూడఁ జాలక యున్నవి చోద్యముగను. ౬

సరే.

గీ. ఎవతెఁ జూచిన మామకహృదయ మొల్ల
నవిరళానందభరితమై యతిశయిల్లు
నామె నింకొక్కపరిఁ బ్రీతి నరసి నేత్ర
పర్వముగ నేఁగెదను గురువర్యుకడకు. ౭

(ఆలోచించి) ఇప్పు డామె రాకుండిన నెంతసే పాఁగుదును? సందిగ్ధఫలవిషయమున మతిమంతుఁడు శ్రమపడఁడు. ఇట నుండు టుచితము కాదు. ఏలన, మహర్షి బ్రహ్మచర్యనియమముల నెన్నిటినో యుపదేశించిరి. వానిలో మనోనిరోధము మొట్టమొదటిది. కాన,

గీ. బ్రహ్మచర్యవ్రతంబునఁ బరగురాముఁ
డరయఁ జాలఁడు స్త్రీముఖ మది నిజంబు
ఇట్టియేకాంతమున వసియించుటీరు
తగదు తగ దెన్నివిధములఁ దలఁచి కనిన. ౮

(కళ్ళఁబోయి) ఇఁక, నేఁగెదను. (ముందు చూచి) ఓహో ! నా నేత్రపద్మముల నానందసరసిలో నోలలాడించిన యాసుందరి యీలతామూలమునఁ గూర్చుండి యున్నది.

ఇటనే యుండి యీమెదర్శనసుఖ మనుభవించి పోయె
దను. (పరిశీలించి) ఇది గాలిచేఁ గదలుమాధవీలత. ఛీ!
ఇది న న్నెంత మోసగించినది ? ఇంతకు నిది నామనో
వికలతయే. ఔను. కాముకు లిట్లే మోహితు లగు
చుందురు.

గీ. ఆత్మవైభవ మంతయు నవలఁ ద్రోచి
దేహ మొనరించి కామసందీపితముగ
ధైర్యవంతులశుద్ధచిత్తములనైనఁ
దమ వెసకుఁ ద్రిప్పుకొందురు తరుణు లౌర ! ౯

(ఆలోచించి) అట్లనుట యుచితము కాదు. ఈదోష
మామెది కాదు.

గీ. నడువఁగా లేదు గతిశోభ కడలుకొనఁగఁ
జూచి యెఱుఁగదు విభ్రమసూచకముగ
నెదుట నిల్వఁగ లే దామె యేల యిట్లు
వ్యర్థముగ నంటి నోటికి వచ్చినట్లు ? ౧౦

మఱియు,

గీ. బొమముడి ధనుస్సుగాఁ జూపుములికి నాదు
మానసము లక్ష్యముగ నేసెనో నయమునఁ
గాక మూఢుఁడ వ్యర్థమ్ముగాఁ దదీయ
రాగపాత్రుఁడ నని యనురాగి నైతి. ౧౧

ఏది యేమైన నగుఁగాక ! నేను వృథా విచారశ్రమ
మంద నేల ? పోవుదును.

(తెరలో) "సఖీ ! ఇటు. ఇటు."

రాము:—(విని, చూచి) కాదు. నామతిభ్రమ కాదు. సత్యము.

నానేత్రములకు నమందానందము స్రవింప శారదచంద్ర ప్రభ లీను మొగముతో నామె యే మరణింప నున్న నన్ను బ్రదికించుటకు సఖులతో నిటే వచ్చుచున్నది.

గీ. నభముపై మేఘమును జూచి నాట్యమాడు
నెమిలిరీతిని నీవచ్చునిరుపమాన
సుందరీరత్నవదనారవిందముఁ గని
మన్మనము నాట్య మొనరించు మహితభంగి. ౧౨

[అంత సఖులతో సీత ప్రవేశించును]

ఒకసఖి:—భర్తృదారికా! ఈయుద్యానమున నెటఁ గూర్చుండి మనోవినోదముఁ గావించుకొందము?

మఱియొకసఖి:—ఆమాధవీలతదగ్గఱ. లేక, అశోకవృక్షపునీడ.

సీత:—సఖి! చంద్రకలా! భర్తృదారికా! యని క్రొత్తగాఁ బిలిచెద వేమే? ఇదివఱకె ట్లనుదానవో యట్లే సీతా! యన వేమి?

చంద్ర:—నీ వట్లేల కనిపించుచుంటివి?

సీత:—మధురికా! నీ వట్లందు వేమే? నేను మీప్రియసఖి నగుసీతనే.

మధు:—నీవు మఱియొకవిధముగాఁ గనఁబడుచున్నావు. నీచాపల్య మెక్కడకుఁ బోయినది? భయముతో నున్నట్లు, నీకనులు వికసించుట లేదు. నీకన్నులయెఱుపు చూచిన, నిద్ర లేనిదానవువలె నున్నావు. ఏకాంతముగా నీయెదలో నేమనుకొంటివో తెలియుట లేదు.

చంద్ర:—ఇచ్చటికి వేగముగా నేల వచ్చితివో కూడఁ దెలియుట లేదు.

మధు:—నీలో యౌవనవికారము పుట్టియుండును. ఏయువకుఁడు నీబాహులతచేఁ గంఠము నలంకరించుకొని ధన్యుఁడు కాఁగలఁడో ?

సీత:—పోండు. మీరిదే యాలోచించుచుందురు.

రాము:—ఈమె వికారమును నేను గ్రహించితిని. ఈమె యెవరో రాజకన్యకూఁతురగుచో నాకగమ్య కాదు. అన్యవధువైన నలభ్యయే. అట్లైన, నాహృదయము మీమెయందుంచుట వ్యర్థమే యగును. (ఆలోచించి) అట్లు యుండదు. ఏలన,

సీ. పరవనిత యైన నీమె దుష్ప్రాప యైన
నామన స్సేల్లు పరుగెత్తు నీమెపైకి ?
మనసె కాద ! కృత్యాకృత్యమతివివేక
మునకు నుత్తమప్రామాణ్య మన ధరిత్రి? ౧౩

సీత:—ఏలొకో కాని నామనస్సీయుద్యానవనమున వెనుకటివలెఁ బ్రసన్న మగుట లేదు. శరీరమునకుఁ జాల సంతాపము కలుగుచున్నది. కదలనైనఁ గదలఁ జాలకున్నాను.

మధు:—ఆమణిశిలాతలమునఁ గూర్చున్నచో భర్తృదారికకుఁ గుసుమపరిమళముతో నుద్యానవాయువు వీచి స్వస్థతఁ జేకూర్పఁగలదు.

సీత:—ఔను. కూర్చుందము. (కూర్చుండి దీర్ఘముగా నిశ్వసించి) సఖీ! నాశరీరసంతాప మధిక మగుచున్నది.

మధు:—(నళినీదళమున సీతకు విసరును)

రాము:—ఆమె శరీరసంతాపమున నేనును దహించుచున్నాను.

క. ఈరమ్యోద్యానసరో
వారిసుశీతలితభూమిభాగము, సుమన
స్సౌరభవాసితమలయజస
మీరము, తాపంబుఁ గూర్చ నేమన నిదేలా ? ౧౮

కారణ మేమై యుండును ? ఆ. తెలిసినది.

గీ. ఇరువురకు దేహ మేనియు హృదయ మేని
గలియ నొక్కనిధర్మ మొక్కనికి నమరు
నా మనోవృత్తి సర్వము నాఁచికొన్న
యీమె తాపంబునం దపియించుచుంటి. ౧౯

సీత:—నా తాప మీచల్లనిగాలివలన శాంతింపదు. మీరు శ్రమ పడ వద్దు.

మధు:—(జనాంతికముగా) చంద్రకళా ! నే ననుకొన్నసంతాప కారణము నిజమే. ఇది శరీరసంతాపము కాదు. మన స్సంతాపమే.

చంద్ర:—ఐనచో, ఈవిషయ మార్యుఁ డగు రాముని కేల నివేదింపవు ?

మధు:—(జనాంతికముగ) ఆర్యుఁడు రాముఁడు విశ్వామిత్రపరవశుఁడై దృఢవ్రతము నవలంబించి యున్నాఁడు. ఆతనిం బ్రసన్నుఁ జేయఁజాలము.

రాము:—ఈసంతాపమువలన నామెముఖము తెల్లనగుచున్నను మఱియొకనూతనశోభ నే యందుచున్నది. ఆశ్చర్యము !

గీ. దూరమునఁ జూచినంత సుధారసంబు
గురిసి నామానసము చల్లఁబఱచు నెవతె

ఆమెయే ఘోరతాపంబు నందె నేఁడు
విధివిధానము ధర నసంవేద్య మౌర ! ౧౬

చంద్ర:-(జనాంతికముగా) మఱి యుపాయ మేమి? ప్రియసఖి భర్తృదారిక శోచనీయావస్థలోఁ బడిపోయినది.

మధు:—(జనాంతికముగనే) సరే. ధర్మవిరోధము కాని ప్రణయము పరిగణింపఁ దగినదే యని విశ్వామిత్రులమతమై యుండును. అందుచే నామహర్షి వీ రిరువురకు వివాహము జరిగినఁ బ్రసన్నుఁ డగును.

చంద్ర:—(జనాంతికముగా) ఉపాయారంభ మెట్లు చేయుదము ?

సీత:—సఖులారా ! ఎండ చాల బాధించుచున్నది.

మధు:—ప్రియసఖి ! సీతా ! చెట్టునీడ నున్నావు. ఎండ యెక్కడిది ?

సీత:—(లజ్జతో) ఇది నీడయా ?

రాము:—గీ. చల్లనౌ గాలిఁ బాదపచ్ఛాయమునను
గూరుచుండియు నీసుకుమారి మిగుల
ఘోరతాపవశమ్మునఁ గుందుచుండె
నేమి హేతువో ? చిత్ర మయ్యెడిఁ దలంప. ౧౭

గీ. పురుషహృదయాంతరమ్ములఁ బోలె స్త్రీల
హృదయములఁ గూడ దుర్భరమదనతాప
మేల కలుగదు ? (ఆలోచించి) తప్పక యీలతాంగి
యంగజార్దితయై తాప మందుచుండె. ౧౮

నేత్రానందదాయకుఁ డగునేయుత్తమునికొఱకో యీమె విరహ మనుభవించుచున్నది. ఆతఁ డెంత ధన్యుఁడో ! అన్యానురక్తను గామింపకుండుట ధర్మనియమము కాన

నే నీవిషయమునుండి మనస్సును మరలింతును.

గీ. ఏ సనాలోచితంబుగ నిటుఁ జరించి
తెలివితేమికి ఫలము నందితిని గాదె
వీరధర్మముతో సుఖమును విడిచిపోవ
జీవితం బెల్ల దుఃఖసంస్పృష్ట మయ్యె. ౧౯

మధు:—(జనాంతికముగా) నేను స్పష్టముగాఁ బ్రియసఖ నడిగెదను.

చంద్ర:—(జనాంతికముగా) అడుగుము.

మధు:—ప్రియసఖీ! యీసంతాపము మదనసంతాపమువలెనే యున్నది. ఎప్పుడా రాము నీయుద్యానవనమునఁ జూచితివో యప్పటినుండి నీసంతాప మారంభమైనది. ప్రతిదినము వృద్ధి యగుచున్నది. ఇది నిజమైనఁ జెప్పు. ఏదో యుపాయము చూతము.

రాము:—(విని హర్షముతో) ఏమి! నేనే యీమెతాపకారణమైతిని!

గీ. నన్నె మనసార వరియించుచున్న నీమె
యధికమదనార్తి సంతప్త యగును గాక
అట్లె నేనును దప్తుండ నగుచు మిగుల
హృదయమున నీమె యున్న నా కేమిబాధ? ౨౦

అహా!

గీ. స్వార్థబుద్ధులు మానవమాత్రు లెందు
నన్యదుఃఖమ్ముతో సుఖ మందు చుంద్రు
పరమదుస్సహ మీమెతాపమ్ముఁ జూచి
కులుకుచుంటిని సంతోషకలితుఁడ నయి. ౨౧

సీత:—నామనస్సున నిట్టివికార మున్న దని మీయిరువురకు నెట్లు తెలిసినది ?

మధు:—కానిచో నీసంతాపమున కింతకన్నఁ గారణ మేమై యుండును ?

సీత:—(సిగ్గుపడును)

రాము:—ఛీ ఛీ. కష్టము. నాగంధర్వనగరము విధ్వస్త మైనది. కామాకులబుద్ధులు, మూర్ఖులు, దీనులు, నగుమానవులు జగత్తుసందలిసర్వవ్యాపారములను, ఆత్మాశ్రయముగాఁ దలఁచి భ్రష్టు లగుదురు. కృతకృత్యు లగు విద్వాంసులు ధర్మయుక్త మగుకర్మ మొనరించి దానిఫల మందినను నందకున్నను దృష్టి వడసి సంతోషింతురు. వారు నిజముగా ధన్యులు.

మధు:—ఏకారణముననో తెలియని నీసంతాపమునకు నివారణోపాయ మెట్లు చూతుమమ్మా నీవు చెప్పనిచో ?

సీత:—చెలులారా ! మీరు చెప్పినకారణము నిజమే. మీతోఁ గాక యిఁక నెవ్వరితోఁ జెప్పుకొందును ?

రాము:—(సంతోషముతో) సంతోషము. దైవవిహిత మగు కార్యము సగము సిద్ధించినది. ఈమె యెవరికూఁతురో ?

మధు:—చెలీ ! వెంటనే యీవార్త మహారాజునకు, విశ్వామిత్రునకు, ఆర్యుఁ డగురామునకుఁ దెలుపుదము.

సీత:—(దీర్ఘముగా నిట్టూర్చి) ఒకపెద్దసంగతి మీరు మఱచితిరి.

మధు:—ఏ మది ?

చంద్ర:—నాకుఁ దెలియును. శివునివి ల్లెక్కిడినవానికే తన కూఁతు నిచ్చెద నని మహారాజు నిశ్చయించినాఁడు.

అది దుష్కరమగుటచే రామునికది సాధ్యమా యని ప్రియసఖి జడియుచున్నది.

సీత:—(దీర్ఘముగా నిశ్వసించి) ఔను.

మధు:—రాముఁ డెంతసుందరుఁడో యంతబలవంతుఁ డైనను ధనుర్భంగము కావింపఁ జాలఁ డని నిశ్చయింతువా ?

సీత:—చాలనినాఁడు నేను జీవింప లేను. (మూర్ఛిల్లును)

చంద్ర:—దేవతలారా ! రక్షింపుఁడు. సీత మూర్ఛిల్లినది.

రాము:—(సవ్వుచఁ జేరి) భయపడకుఁడు. నేను బ్రియురాలి...

(అర్ధోక్తితో మౌనము వహించును)

మధు:—ఆర్యునకు స్వాగతము. ప్రియసఖి నెట్లు రక్షింపవలయునో యట్లు చేయుదురుగాక !

రాము:—అంతయు వింటిని. కాని, సందేహనివృత్తి కడిగెదను. ఈపుణ్యాత్మురాలితండ్రి యెవరు ?

చంద్ర:—బ్రహ్మజ్ఞాననిధి. జనకమహారాజు.

రాము:—(తనలో) ఏకులకన్యయో యనుకొంటిని. ఈమె మహాకులజ యగుక్షత్రియకన్య. నాకొఱకై యీమె పరితపించుచున్నది. నాహృదయ మీమెయందు లగ్నమైనది. నాసుఖముకొఱకే విధి యీమెను సృష్టించియున్నాఁడు. (ప్రకాశముగా) ఈమె సఫలమనోరథ కాఁగలదు. నేను నీమెను జూడకున్నఁ బ్రపంచమును శూన్యముగాఁ దలంతును... (అర్ధోక్తితో విషాదము నటించుచుఁ దనలో) వివేకవినయోపేతుఁడనై మాటాడితినా ?

చంద్ర:—(తనలో) తెలియవలసినది తెలిసినది.

మధు:—మహారాజు మిగుల దుష్కర మగుపణ ముంచినాఁడు.

రాము:—అదియు నేను వినియే యున్నాను.

గీ. శివునిచాపంబు సజ్యంబు చేయ నొక్క-
మానవునిశక్తికైనచో దాని కేనె
తగుదుఁ; బ్రాముసు రాజసుతావివాహ
గోష్ఠి యయ్యెనా? భాగ్యదూరులము మనము. —౨౨

మధు:— ఈమాట మాకు మిక్కిలిఁ బ్రియకరము. ఆర్యపుత్త్రా! ఈమహాకార్యమును సాధింపఁ బ్రతిన పట్టితివి. కాని, బాలుఁడ వగు నీవలన నిది సాధ్యమా యని మేము శంకించుచున్నాము.

చంద్ర:— తేజశ్శాలురపరాక్రమమునకు వయోదేహము లపేక్షితములు కావు. సింహపోతము చిన్నదయ్యు మహాకాయము గలయేనుఁగును జంపును గదా!

(తెరలో) "మహారాజా! ఇటు. ఇటు."

రాము:—ఆహా! భగవానుఁడు (తనలో)

శా. రాజై యుండియుఁ గాంచె నెవ్వఁడు పవిత్రబ్రహ్మభావంబు; స
ద్భేదం బొప్ప నెవండు మానులకు నందించెన్ మహాజ్ఞాన; మా
భ్రాజిష్ణుండు నిరస్తకాముఁడు జగద్వంద్యుండు శాంతాత్ముఁడౌ
రాజర్షిప్రవరుండు వచ్చునిట కౌరా! మందమందంబుగన్.

కావున నే నిచట నుండఁ దగదు. పోయెదను.

(నిష్క్రమించును)

సీత:—సఖులారా! ఇపు డేమి చేయుదము?

చంద్ర:—ఇప్పుడు క్రొత్తగాఁ జేయవలసిన దేమి? మహారాజు వచ్చుచున్నాఁడు. కావున నెదురేఁగి నమస్కరింపుము.

సీత:—నాసంతాపవృత్తాంత మాయన వినలేదుకదా?

మధు:—నీ విట్లు శంకింపకుము. (నవ్వుచు) ఆయన విన్ననే నీసంతాపము పోవునుపాయము చూచును.

సీత:—నాకష్టసమయమున నన్నుఁ బరిహసించుచున్నావా ?

మధు:—నీదుఃఖశాంతి యైనది.

సీత:—మరల వేళాకోళమా ?

మధు:—వేళాకోళము కాదు. విను. రాముఁడు కానరానిచో నీ వెంత సంతాపపడుచున్నావో నీవు కానరానిచో నాతఁడు నంతసంతాపనే యందుచున్నాఁడు.

సీత:—పోవే. ఆర్యపుత్త్రుని పే రేల తెచ్చెదవు ?

మధు:—ఆయన నీ కార్యపుత్త్రుఁడు. మాకు స్నేహితుఁడు.

సీత:—(కోపముతో) నీ కెట్లు తెలియును ?

మధు:—(చెవిలో) ఇట్లు.

సీత:—నిజమా ?

మధు:—నిజమే.

సీత:—పోవే. అసందర్భప్రలాపము లాడుచున్నావు. నీమాటవినను. (తెరలో) "మహారాజా ! ఇటు. ఇటు."

చంద్ర:—మహారాజులు వచ్చినారు.

[అంత జనకుఁడు చేటులతోఁ బ్రవేశించును]

జన:— గీ. విమల మైయొప్పువిబుధునివిద్య తగిన
ఛాత్రుని గొసంగినప్పుడే సఫల మగును
అటులె కని పెంచి నట్టికన్యాలలామ
యోగ్యున కొసంగి సుకృతినై యొప్పఁ బితయు.

సీత:—(చేరి) తండ్రీ ! నమస్కారము. (నమస్కరించును)

జన:—వత్సా ! సర్వగుణనిధి యగుభర్తను బడయుదువుగాక !

పితృమాతృవంశములకుఁ గీర్తి నొసంగుదువుగాక !

సీత:—(కన్నీటితో) తండ్రి పెండ్లిచేసి నన్ను దేశాంతరము పంపి వేయును.

జన:—దేశాంతరమో, జన్మాంతరమో. ఏమైనను జీవికి స్వకృత్యము ననుసరించి పోవక తప్పదు. వెళ్ళినపిదప నెవరు బంధుజనులకు బాధ కలిగింపరో మఱి తాము దుర్గతి నందరో వారే ధన్యులు. అమ్మా! ఎప్పటికైనను నీ వేఁగక తప్పదు. నీవిప్రయోగభావమునఁ దపించుట మాకును దప్పదు.

గీ. దుఃఖములు పాపరాసివి తొడరి వాని
ధైర్యసంతోషముల నైపఁ దగును గాని
కడుసుఖోదర్కము లగుదుఃఖములఁ దలఁచి
మనసు శోకాకులంబుగాఁ జనదు చేయ. —౨౫

సీత:—(కన్నీటితో) తండ్రివలె నేను ధైర్యవంతురాలను గాను.

జన:—అవసరమునుబట్టి నీకును ధైర్య మదియే వచ్చును. మగని ప్రేమవలన నీవు మమ్ము మఱతువు.

సీత:—అట్లనకుము.

గీ. ఎంతవఱకును సంస్మృతి యొసఁగు నాకు
నంతవఱకును నామనమందుఁ దండ్రి!
పరమపావనభవదీయపాదపద్మ
యుగళి నెన్నఁడు మఱవంగనోప నిజము. —౨౬

జన:—వత్సా! మంచిది. అది న్యాయమే కాని, తప్పక కలుగ నున్నవియోగమును గూర్చి చింతింపరాదు. రాఁబోవు దుఃఖమును స్మరింపకుండుట, కడచినదుఃఖమును మఱ

చుట యివి ప్రాజ్ఞలక్షణములు. అందుచే నీవు సఖులతో నేఁగి మేడముందుభాగమునఁ గలబుద్ధివర్ధసపీఠమునఁ గూర్చుండి మనస్సును వినోదపఱచుకొనుము. (చేటితో) నీవు విశ్వామిత్రభగవానులతో సంధ్యోపాసన మైన వెనుక నేను వచ్చి వారితోఁ గొండొక కార్యము నివేదింపఁ దలఁచితి నని విన్నవింపుము.

అందఱు:—చిత్తము. (జనకుఁడు తక్క నందఱు నిష్క్రమింతురు)

జన:—ఈవేళ కాఱవనాఁడు నాకు సత్రాంతస్నానము. అపుడార్షవిధానమున సీతను రాముని కిచ్చెదను. ఏలన, కుల మన్న

గీ. పరమవిఖ్యాతము రఘువరకులంబు
రాముఁడు బుధుండు క్షాత్త్రవిరాజమాన
సుగుణపుంజము సీతకుఁ దగినవరుఁడు
వలచె రాముని నామె నావత్స నతఁడు. ౨౭

ఇఁక, శాంభవధనురారోపణరూప మగుపణమునకు రాముఁడు నిలువఁగలవాఁడే యని విశ్వామిత్రమహర్షి చెప్పియే యుండెను. (ఆలోచించి) రాముఁడే యిది చేయలేనినాఁడు విశ్వామిత్రభార్గవరాములను దప్పించిన నిఁక నిందులకు సమర్థుఁ డెవఁడు? నాపణము మూఢ ఫలమును గాని నిష్ఫలమును గాని యెన్నఁడు నీయదు. భగవానుఁ డగుభార్గవరాముఁడు శాశ్వతబ్రహ్మచారి. విశ్వామిత్రుఁడు వనవాసి. నాపణము విని యెందఱో వీరులు విభ్రమముతో విచ్చేసి యది నిర్వహింపలేక సిగ్గుపడి నాయసంభావితపణవిధానకౌశలమును నిందించి

పోఁజొచ్చిరికదా! విశ్వామిత్రవచనమున విశ్వాసముంచి నన్ను ధన్యునిఁగాఁ దలఁచుకొనుచుంటిని. (పరిక్రమించి మరల నాలోచించి) నాపరమసఖుఁడగు దశరథమహారాజును బిలువనంపెదను. నాకోరిక పాటించి యాతఁడు తప్పక విచ్చేయును. రాణులతోడను, వసిష్ఠభగవానులతోడను, కుమారమంత్రిభృత్యపరివారపురస్సరముగా విచ్చేయు మనికోరుచు నిపుడే దశరథునికడకు దూతను బంపుదును. మఱియు,

గీ. ఏనృపులు వచ్చి యీవింటి నెత్తలేక
 కడు నిరాశాత్ములై పోవఁగనిరో వారి
 నందఱను బిల్వనంపెద నరుగుదెంచి
 వార లీయుత్సవము చూడవలయు నాఁడు. ౫౦

మఱియు,

గీ. ఈపణము దుష్కరం బని యెవరు నన్ను
 నింద చేసిరో వారువా రంద ఱరయఁ
 గలరు రఘురాముశక్తిని; గాంచి మిగుల
 సిగ్గుపడఁ గాంత్రు తమతమచేవఁ దెలిసి. ౫౧

ఇంకను,

మ. పరమస్నేహమయుండ్నైతు దశరథున్ భార్యాత్రయింబిల్చియీ
 ధరణీజాతను దత్కుమారునకు మోదం బొప్పఁగా నిచ్చి యా
 వరదాంపత్యము నేత్రపర్వముగ సంభావించి ధన్యుండనై
 పరమానందము నందెదన్ విపుల మోహభారం బిటు ల్దీరఁగన్.

(నిష్క్రమించును)

ఇది షష్ఠాంకము.

యజ్ఞఫలము

సప్తమాంకము

[అంతఁ గూర్చుండి సదస్యులు, సభ్యులు, దశరథమహారాజు, కుమారులు, జనకమహారాజు, పరివారము, వసిష్ఠభగవానులు, విశ్వామిత్రుఁడు, శతానందుఁడు, మంత్రులు, రాణులు, పరిజనులు, రాజులు ప్రవేశింతురు.]

జన:—(లేచి)

గీ. తమము నడఁచెడిజ్ఞానతేజమును గాంచ
బ్రహ్మమయముగఁ దోఁచు సర్వంబు; ధర్మ
కర్మ మొనరించి లోకసౌఖ్యమ్ముకొఱకు
నాత్మవిజ్ఞత నెల్లరు నలరవలయు. ౧

గీ. కర్మపరము సమస్తంబు కాన దాని
విడువ శక్తుండు గాఁ డెట్టివిజ్ఞుఁ డైన
ధర్మయుక్తకర్మంబు నిత్యంబుఁ జేయు
సజ్జనుఁడు నిర్మలం బైనశాంతిఁ బడయు. ౨

గీ. తరణి యొక్కఁడె బహుజలాధారములను
వివిధరూపమ్ములను గానిపించునట్లు
ఒక్కటయ్యును నాత్మ తా నక్కజముగ
వివిధరీతుల మనలోన వెలయుచుండు. 3

గీ. యజ్ఞ మొనరింపఁ దగు మానవాళి కెప్పుడు
సురలు యజ్ఞమ్మునను మెచ్చి వరము లిత్తు

రీశుఁ దనియించి దాన నభీప్సితమగు
యజ్ఞఫలమును గాంతురు విజ్ఞులవని. ౪

నాయజ్ఞము సమాప్త మైనది. ఆర్షవిధి ననుసరించి రఘుకులప్రదీపుఁ డగుదశరథమహారాజుజ్యేష్ఠపుత్త్రుఁడు, సకలక్షత్త్రికులకమలాహస్కరుఁడు, భుజబలోత్థాపిత భగ్నానేకమహాబలవీరావిచాలితోగ్రచాపుఁడు, భీమ యాతుధానవధనివారితతపోవనభయసంశయుఁడు, సుకృతిజనమనఃకుముద ప్రసాదహేతుభూతుఁడు, నగు రామచంద్రునకు భూజాత యగుసీత నిచ్చితిని. ఇంతకును, అనురక్తానురూపవరాభిలాషిణి యగునామె నిచ్చుటలో మాప్రభుత్వ మే మున్నది? అపరిచ్ఛేద్య మగువారితుల్యగుణప్రీతి నభినందించితి నని మాత్రమే చెప్పవలసి యున్నది. మఱియు, భరతలక్ష్మణశత్రుఘ్నులను గ్రమముగా నాయుష్మంతు లగుమాండవి, ఊర్మిళ, శ్రుతకీర్తి వీరికిఁ దగినవరులనుగా భావించితిని. తుల్యగుణవంతులు, తుల్యరాజవంశసంబంధులు, నగు వీరివివాహములకు మీయందఱియనుమోదము నున్న నందఱొక్కసారి స్వస్తివాచకములు పల్కుఁడు.

అందఱు:—స్వస్తి. స్వస్తి. స్వస్తి.

(ఆకాశమునుండి పుష్పవర్షము కురియును.)

దశ:—(లేచి)

మ. వరరాజన్యులకున్ గురుండు పరమబ్రహ్మజ్ఞులన్ మేటి మ
త్పరమస్నేహహితుండు నోజనకభూపాలుండు వియ్యంకుఁ డై

సుమసంప్రాప్త గుణాశ్రుతాత్ములు సుతుల్ బ్రాఁతిందులందూఁగు స
ద్వరసంజాతలఁ గన్యకామణుల నందన్ నాకు సంతోషహా.

వసి:—

మ. ప్రియశిష్యాగ్రణిపుత్రరత్నములు సద్విద్యానవద్యుల్ వినీ
తియుతుల్ మత్సముపాత్తబోధనమహాధీయుక్తులున్ వీరలున్
నియతాస్త్రాగమకోవిదుల్ పరిణయోన్మేషంబు నందంగ న
వ్యయసంతోషమునందె నామనము బ్రహ్మానందతుల్యంబుగన్.

విశ్వా:—

చ. తగినసఖుండగున్ దశరథక్షితిపాలుఁడు శుద్ధకర్ముఁ డీ
సుగుణి విదేహభూపతి విశుద్ధమనస్కుఁ గొల్చు నన్ను న
త్యగణితబుద్ధు లస్త్రవిదులైనకుమారులు నాకు శిష్యు లి
ట్లగుట వివాహమియ్యదిముదంబుధిఁ దేల్చెనునన్ను మిక్కిలిన్.

శతా:—

చ. పరమవిశుద్ధవంశజులు భవ్యగుణాస్పదు లీవధూవరుల్
పరిణయశోభఁ జెన్నలర భవ్యసుఖం బది నాకుఁ గల్గె నీ
కరణిఁ జెలంగు బాంధవము కాంచనరత్నసమాగమంబు నాఁ
గరము సుఖప్రదం బగును గావుత ! భూస్థలి నెల్లవారికిన్.

(తెరలో) "ఏమేమి ? ఇంతమహాకార్యము నాకుఁ దెలియకుండఁగనే రాజులు చేసిరా ?"

వసి:—ఓహో ! పరశురామభగవానులు భ్రూభంగమున భువన భయంకరముగా నిటు వచ్చుచున్నారు.

(అందఱు లేచి నతశిరస్కులై నమస్కరింతురు)

రాము:—(లేచి) భయపడకుఁడు. భయపడకుఁడు.

శస్త్రమూలంబుననో మహాశాపముననో
ప్రబలకోపంబుతోఁ జంప వచ్చునట్టి
విప్రులు ప్రణామమున భక్తి వినయములను
శాంతు లగుదురు మిక్కిలి క్షణములోన.

[క్రోధవంతునివలెఁ బరశురాముఁడు ప్రవేశించును]

పర:—(ఎవరిని జూడనట్లు నటించి)

మ. అలఘుబ్రహ్మవిఘాతదర్శితబలాహంకారులన్, వైదికో
క్తులఁ బాటింపనిమూర్ఖులన్, బ్రజల నాక్రోశింపఁగాఁ జేయునా
ఖలరాజన్యులఁ, జంపి తద్రుధిర మాకంఠంబుగాఁ గ్రోలు నీ
ప్రళయోద్యజ్జ్వలనోపమం బగుకుఠారం బుగ్రరూపంబునన్.

గీ. ధర్మపరు లైనవిప్రులఁ దనుపుచుండు
రెవ్వరెవ్వరు స్వప్రజాహితు లగుదురు
వారి కెల్లర కభయంబు వటిల రాదు
బలము రక్షించు నెల్లవేళల నిజంబు.

(అందఱను జూచి తనలో) ఏమిది? నిరపరాధులు, ధర్మరక్షాధురీణులు వసుజనకాదులు కూడ నన్నుఁ జూచి భయపడుచున్నారే.

వసి:—భగవానుఁడా! నమస్కారము. (నమస్కరించును)

పర:—వసిష్ఠభగవానుఁడా! ప్రతినమస్కారము. (నమస్కరించును)

విశ్వా:—కౌశికుఁ డగువిశ్వామిత్రుఁడు నమస్కరించుచున్నాఁడు. (నమస్కరించును)

పర:—నీబ్రహ్మత్వము శాశ్వతముగా విరాజిల్లుఁగాక!

జన:—విదేహాధిపతి జనకుఁడు నమస్కరించుచున్నాఁడు. (నమస్కరించును.)

పర:— గీ. గురువ నైతి మహర్షులకును మహాత్మ !
యష్టవు వదాన్యమణివి మహారథుఁడవు
నావలన నేమి వాంఛింతు వోవివేకి ?
ఆర్యబహుమానమిత్రంబ వగుదుఁగాక !

దశ:—సావిత్రుఁ డగుదశరథుఁడు నమస్కరించుచున్నాఁడు.
(నమస్కరించును)

పర:—నీపుత్త్రిలు శాశ్వతయశ మొందుదురుగాక !

రామభరతలక్ష్మణశత్రుఘ్నులు:—భగవంతుఁడా! నమస్కారము.
(సగోత్రనామపురస్సరముగా నమస్కరింతురు)

పర:—వత్సలారా ! దీర్ఘాయుష్కులు, పుణ్యయశస్కులు, నౌదురుగాక !

ఇతరులు:—(పరశురామునికి నమస్కరించి యాశీర్వచనము లందుదురు)

పర:—(జనకునితో)
గీ. రామబలమున శివధనుర్భంగ మయ్యె
నని విని తపంబు విడిచి నే నరుగుదెంచి
నాఁడ వేగంబునం దెల్పు నా క దెల్లు ?
కేసరినిసుంగు గిరిఁ బెల్లగింపఁ గనెన ?

జన:—(బెదరుతో) భగవానుఁడా ! శివధనువును సజ్య మొనరించినవానికి సీత నిచ్చెద నని పణ మేర్పఱిచితిని.

పర:—అది నాకుఁ దెలియును. తరువాత ?

జన:—ఆయుష్మంతుఁ డగురాముఁ డాధనువు నెత్తఁగనే యది భగ్నమయ్యెను.

పర:—(రామునితో) ఇది నిజమా ?

రాము:—భగవానుఁడా ! నాబాల్యచాపల్యము క్షమింపుఁడు.

పర:—ఏ బాల్యచాపల్యము ?

రాము:—క. చిరముగ నానాతతం బయి
ధరణిపుకడఁ బ్రోఁతవడినధనువును బూనిక్
కరమునఁ బట్టినయంత నె
చెరిసగమై పడియె నేమి చేయుదు ? దేవా !

పర:—అయిన నిదిగో. ఈధనుస్సును సజ్యము చేయుము.
(ఇచ్చును.)

రాము:—భగవానునియాజ్ఞ. (గ్రహించి సజ్యము చేయును)

పర:—కూర్చుందుము. నీవైష్ణవ మగురూపమును గాంచఁ గంటిని. (తనలో) ఆహా ! నాకోరిక సిద్ధించినది.

మ. ఖలులై పాపులునై యధర్మరతులై గర్వాంధులై మన్నమూ
ర్ఖుల నొక్కమ్మడి దైవయోగమున నిర్మూలింపుభారంబు నీ
యిల నావెన్కభరించు నెవ్వఁ డని యెంతేఁ జింతతో నుంటిని
చ్చలుఁ జిత్తమ్మున వేగిరించెదు తపశ్చర్యారతిన్ పేదుచున్.

కాని,

గీ. అవని హరియంశమునఁ బుట్టినట్టివాఁడు
రామచంద్రుఁడు ధర్మసేవామహితుఁడు
నే నొనర్పక విడిచిననిఖిలదుష్ట
మర్దనం బొనరించి క్షేమంబుఁ గాంచు.

(ప్రకాశముగా) వత్సా ! దాశరథీ ! నీవు వైకుంఠవాసి వగుదేవదేవుఁడవు. తపోవనముల నీవు రాక్షసుల వధించినవృత్తాంతము విన్నప్పుడే పురుషోత్తముఁడవు రామరూపమున జన్మించితి వని గ్రహించితిని. ఇప్పుడు స్వయముగాఁ జూచితిని. అందుచే సప్రమాణముగా నాధనువు

నీ కర్పించితిని.

క. పాపులఁ బరిమార్చుటకే
చేపట్టుము నీవు దీని క్షితి ధర్మాత్ముల్
ప్రాపించి శరణుచొచ్చిన
నేపగిదిని వారిఁ గాచి యొసఁగుము రామా!

రాము:— దేవా! అట్లే చేయుదును.

పర:— ధర్మమార్గమున నే నేయేలోకముల జయించితినో వానిని సభ్యుల కిచ్చి తత్త్వజ్ఞుఁడనై నే నేఁగుచున్నాను.

వసి:— భగవానుఁడా! పుణ్యార్జితము లైనలోకములు నీ వేల విడిచెదవు?

పర:— గీ. కాలవశమునఁ బుణ్యంబు క్షయము కాఁగ
సారహీనంబు లౌ నెట్టిసంపదలును
వానిపై నుండ దావంత యైన నాస్థ
కాన నేను త్యజింతు లోకమ్ము లెల్ల.

గీ. అగుఁ జిదానందమయ మైనయట్టిబ్రహ్మ
మరయ శాశ్వత మది పరాపరము దాని
యందు నిత్యస్థితియె మహానంద మొసఁగు
నందె నేను బ్రహ్మానంద మందుచుందు.

విదూ:—(తనలో) ఈముసలియెలుఁగుబంటి త్వరగాఁ బోయిన మేలు.

పర:— నే నేఁగివచ్చెదను. (శీఘ్రముగా నిష్క్రమించును)

జన:— ఆహా! జామదగ్న్యుఁ డమితబలశాలికదా! ఈతఁ డెంతపరమశాంతుఁ డయ్యెను! ఇఁక, క్షత్రియులు సుఖులై యుందురు.

రాము:—పరశురాముఁ డాదేశించినప్రకార మిఁక నేను బాప నాశన ముపేక్షింపను. పాపు లెల్ల రిఁకఁ బలాయమాన నిద్రులు, కంపమానమనస్కులు నగుదురుగాక !

దశ:—పరశురామభగవానులు సర్వతేజోనిరాకరిష్ణు వగుబ్రహ్మ త్వమున నొప్పినారు.

విదూ:—(తనలో) ఆవృద్ధబుభుక్షము నెడలిపోయినపిదపఁగూడ వీ రంద ఱాతనిని స్తుతించుచున్నారు.

విశ్వా:—కాదు. ఆతనిపరాక్రమమున బహుక్షత్రియులు మర ణించినారు. కావున, నాతనిబ్రహ్మత్వము మహత్త్వ మందలేకపోయినది. భగవానుఁ డగువసిష్ఠునిబ్రహ్మత్వ మొక్కటియే ప్రశంసింపఁదగినది. అది నావంటివానిని సైతము తదేకకాంక్షచే సర్వసంగపరిత్యాగి నొనరించి నది. మఱియు వసిష్ఠునిబ్రహ్మత్వము హింసింపకయే యితరము లగుతేజస్సులను నిరాకరించును.

వసి:—ఈప్రసంగము తలఁచినదానికి భిన్నముగా వచ్చినది.

విశ్వా:—(పైకిఁ జూచి) దివ్యాభినందనము స్వీకరించుటకు సపత్నీ కులై దశరథకులప్రదీపులు కుమారులమధ్యమునఁ గూర్చుందురుగాక !

వసి:—ఏరీ దివ్యులు ?

విశ్వా:—అదిగో. అందఱు పైకిఁ జూడుఁడు.

అందఱు:—(పైకిఁ జూచెదరు)

విశ్వా:—

చ. నలువయు విష్ణువు న్శివుఁడు నారదతుంబురులింద్రుఁడుంగుతూ
హలు లయి కల్పవృక్షకుసుమావళిఁ జల్లుచు మంగళార్థమై

యలఘుతరంబుగాఁ జయజయారభటులం బచరించుచుండ్రి ని
స్తులబహువాద్యఘోషములతో నవదంపతు లుల్లసిల్లఁగన్.
దశరథజనకులు:—(చూచి) నిజము నిజము.

[అంత నలువురువధువులు సపరివారముగాఁ బ్రవేశించి నలు
వురువరులప్రక్క నిలిచియుందురు. దివ్యవాద్యఘోషములతో
నాకసమునుండి పుష్పవృష్టి కురియును.]

అందఱు:—స్వస్తి. స్వస్తి. స్వస్తి.
విశ్వా:—సఖా! దశరథా! నీ కింక నేమిప్రియము కావల
యునో కోరుకొనుము.
దశ:—దేవా!

గీ. పుత్త్రహీనదుఃఖం బది పోయె నెపుడొ;
యిపుడు జనకాత్మజలు స్నుష లిట్టు లైరి;
పేరు లయి ప్రీతిమంతులై వెలయుచుండి
రాత్మజులు నాకు నింకఁ గామ్యంబుఁ గలదె?

విశ్వా:—ఐన నిట్లగుఁగాక! రాజసింహుఁడ వగునీవు పాలింప

క. వర్ణాశ్రమధర్మంబులు
పూర్ణంబుగ వెలయఁ బ్రజలు పొందఁగ బహుసం
పూర్ణాయుస్సుఖములు నిఖి
లార్ణవపర్యంతభూమి యలరుత శాంతిన్.

వసి:—తథాస్తు.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది సప్తమాంకము.

సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ

తప్పొప్పుల పట్టిక.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
23	21	తలలో	తనలో
,,	23	గీ.	కైకేః—గీ.
24	4	గుణముల	గుణుల
38	6	పరమాశ్చర్యంబు	పరమాహ్లాదంబు
56	16	అనద్యం	అనవద్యం
58	1	దైతత్వ	దైవత్వ
64	16	కుశలురై	కుశలులై
68	22	చిగురించు	చిగిరించు
70	5	నొంటి నేకరణి	నెట్టు లేవంపు
93	3	సత్రాంతనము	సత్రాంతమున
114	5	మహీ	మహా

శ్రీ వేంకటేశ్వర గ్రంథావళి

౧. పద్యకావ్యములు

1. అష్టావక్రచరిత్రము రు 1-8-0
   First Edition 1944
   Second Edition 1946
   Third Edition 1948
   Prescribed for B. A. 1948 & 1949 (Madras University)
   ,, Bhasha Pravina 1948 & 1949 (Andhra)
2. అహల్యాగౌతమము రు 2-0-0
   First Edition 1949
   Second Edition 1952
3. అరుంధతీ వసిష్ఠము 1952
   రు 1-0-0

౨. గద్యకావ్యములు

1. శ్రీ మహర్షి జీవితకథామృతము
   PART I. రు 2-0-0
   First Edition 1945
   Second Edition 1947
   Third Edition 1952
2. ,, PART II. రు 2-0-0
   1946
3. మహాపురుషులు 1948
   Prescribed for S.S.L.C. 1951
4. రత్నత్రయము 1950
   First Edition ,,
   Second ,, 1951
   Third ,, 1952
   Approved by the T. B. C. for Forms IV—VI.

౩. నాటకములు

1. కుందమాల రు 2-8-0
   First Edition 1947
   Second ,, 1950
   Third ,, 1950
   Prescribed for Inter 1952 (Andhra)
   ,, B. A. 1952 (Osmania)
2. అభిషేకనాటకము రు 2-0-0
   First Edition 1949
   Second ,, 1952
3. వేణీసంహారము రు 3-0-0
   1951
   Prescribed for B. A. (Andhra)
4. యజ్ఞఫలము 1952 రు 2-0-0

౪. నిఘంటువులు

1. సూర్యరాయాంధ్ర నిఘంటువు
   3, 4 సంపుటములు. (ఇతరులతో కలిసి చేసినవి.)
2. వావిళ్ల నిఘంటువు
   (1, 2 సంపుటములు.)

౫. ఇతరములు

1. అష్టావక్రసంహిత 1951 రు 1/
2. ఆత్మోపహారము 1946 అ 8/

ప్రతులకు :

బులుసు వేంకటేశ్వరులు, బి.ఏ.,
రామారావుపేట, కాకినాడ.